నాణ్యమైన వాటికే పెట్టుబడి పెట్టండి
జాగ్రత్త పడండి! అసలైన TATA పైపును పొందండి
చింతించకుండ హాయిగా ఉండండి
TATA ముద్రణకై చూడండి
TATA పైపు సరసమైనది, ధృడమైనది.
అధికృత పంపిణీదారులు
SREE KRISHNARJUNA
STEEL & PIPE DISTRIBUTORS
H.O. Gogineni Buildings R.R. Street VIJAYAWADA-520001 Phone : 63410
Branch Office : 28-9-1, Suryabag VISAKHAPATNAM-530020 Phone : 61856

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన అగ్రశ్రేణి దినపత్రిక

ANDHRA PATRIKA
Regd No. H/HD. 231

ఆంధ్రపత్రిక

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD & VIJAYAWADA

వ్యవస్థాపకులు : దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

సంపుటం: 76 సంచిక: 322 | హైదరాబాదు శుక్రవారం 23-2-90 | పుటలు: 8 వెల: 1-30 పైసలు (విమానంద్వారా సర్ఫ్లై పది పైసలు అదనం)

కేంద్రానికి చెన్నా వినతి

సబ్సిడీబియ్యం కేటాయించండి

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)
హైదరాబాద్, ఫిబ్రవరి 22:

రాష్ట్రంలో ప్రభుత్వ పంపిణీవ్యవస్థ ద్వారా పేద ప్రజలకు సరఫరా చేస్తున్న కిలో రెండు రుపాయల సబ్సిడీ బియ్యం పథకానికి 25 లక్షల టన్నుల బియ్యాన్ని కేటాయించవలసిందిగా ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి కేంద్రాప్రభుత్వాన్ని కోరారు.

ముఖ్యమంత్రి డా.చెన్నారెడ్డి ఈ నెల 22వ తేదీన కేంద్ర అహార పౌరసరఫరాల శాఖమంత్రి శ్రీ నాథూరామ్‌మీర్ధాకు ఒక లేఖ వ్రాస్తూ రాష్ట్రప్రభుత్వం 30 లక్షల టన్నుల బియ్యాన్ని సేకరించి భారత అహారసంస్థకు ఇస్తుందని, అయితే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ పంపిణీ వ్యవస్థకు అవసరమైన 25 లక్షల టన్నుల బియ్యాన్ని కేటాయించాలని కోరారు.

ప్రభుత్వ పంపిణీవ్యవస్థ ద్వారా రాష్ట్రంలో 1 కోటి 32 లక్షల కుటుంబాలకు బియ్యం సరఫరా చేస్తున్నదని, దీనిలో 99 లక్షల 21 వేల ఆకుపచ్చ రేషన్ కార్డులుగల కుటుంబాలకు కిలో రెండు రూపాయలకు బియ్యం సరఫరా చేయడం జరుగుతుందని,' ఇందుకుగాను, 24 లక్షల టన్నుల బియ్యం ఏడాదికి అవసరమున్నదని, మరో లక్ష టన్నుల బియ్యం సాంఘిక సంక్షేమ హాస్టళ్ళకు సరఫరా చేస్తున్నామని డాక్టర్ చెన్నారెడ్డి ఈ లేఖలు పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో భారత అహారసంస్థ సేకరిస్తున్న 15 లక్షల టన్నుల బియ్యంలో ఏడాదికి 10 లక్షల టన్నుల బియ్యాన్ని రాష్ట్రానికి ఇస్తున్నదని ఆయన ఈ లేఖలో వివరించారు.

కేంద్రప్రభుత్వం ఇటీవల ఏడాదికి 20 లక్షల టన్నుల బియ్యాన్ని సేకరించవలసిందిగా రాష్ట్రప్రభుత్వాన్ని కోరిందని, దీనిలో 2/3వ వంతు అంటే 13.3 లక్షల టన్నుల బియ్యాన్ని ప్రభుత్వ పంపిణీవ్యవస్థకు కేటాయిస్తామని తెలిపిందని డాక్టర్ చెన్నారెడ్డి ఈ లేఖలో తెలిపారు.

రాష్ట్రప్రభుత్వం బహిరంగ మార్కెట్‌లో 11 నుంచి 12 లక్షల టన్నుల బియ్యాన్ని ఎక్కువ ధర చెల్లించి ప్రభుత్వ పంపిణీ వ్యవస్థకు కొనుగోలు చేయవలసివస్తుందని, దీనివల్ల రాష్ట్రప్రభుత్వంపై అదనపు భారం పడుతున్నదని, అందువల్ల రాష్ట్రంలో ప్రభుత్వ పంపిణీవ్యవస్థకు అవసరమైన మొత్తం 25 లక్షల టన్నుల బియ్యాన్ని సరఫరా చేయవలసిందిగా ముఖ్యమంత్రి డా.చెన్నారెడ్డి కేంద్ర మంత్రి శ్రీ మిర్ధాకు రాసిన లేఖలో కోరారు.

రాష్ట్రంలో ప్రకటించిన ప్రాంతాలలో బియ్యాన్ని సేకరించడానికి రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు ప్రకటిత ఏజన్సీగా అనుమతి ఇవ్వాలని, రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా రాయితీ రేట్లపై రుణసౌకర్యాన్ని కల్పించడానికి చర్యలు తీసుకోవలసిందిగా ఈ లేఖలో ముఖ్యమంత్రి కేంద్ర మంత్రిని కోరారు.

రాష్ట్రప్రభుత్వం 1989-90 పంట సంవత్సరంలో రైస్ మిల్లర్లకు క్వింటాలుకు రూ.5.50 పైసలు చొప్పున సేకరించే బియ్యానికి ఇవ్వడానికి సంప్రదింపులు జరిపిందని, ఈ మేరకు 12 లక్షల టన్నుల బియ్యానికి చెల్లించవలసి వుంటుందని ఆయన ఈ లేఖలో పేర్కొన్నారు.

రాష్ట్రప్రభుత్వం సబ్సిడీ రూపంలో ఇస్తున్న బియ్యంలో కొంత మేరకు మిల్లర్ల నుంచి సేకరించడంవల్ల ప్రభుత్వానికి అదనపు ఆర్థిక భారం పడుతున్నదని, అందువల్ల రాష్ట్ర పౌరసరఫరాలసంస్థను ప్రకటిత ఏజన్సీగా అనుమతిస్తే బియ్యం ధరను సంప్రదింపుల ద్వారా నిర్ణయించడమే కాకుండా, 14 శాతం రాయితీ అహార రుణాన్ని రిజర్వు బ్యాంకు నుంచి పొందే అర్హత కలిగివుంటుందని డా.చెన్నారెడ్డి ఈ లేఖలో వివరించారు,

కొనుగోలు ధరలకే నిలువల విలువకు అనుమతించాలి

రాష్ట్రంలో కొనుగోలు ధరలకే నిలువవున్న ధాన్యం విలువను అనుమతించాలని కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ మధుదండావతేకు రాసిన మరొక లేఖలో ముఖ్యమంత్రి డా.చెన్నారెడ్డి కోరారు.

గతంలో రిజర్వు బ్యాంకు విత్తనాల కొనుగోలు కేంద్రాలవద్ద గోదాములకు తీసుకువెళ్ళే రవాణా ఛార్జీలను కలుపుకుని ధరలను నిర్ణయించేదని, అయితే ఇటీవల రిజర్వు బ్యాంకు నిల్వ వున్న ధాన్యానికి రవాణా ఛార్జీలతో నిమిత్తం లేకుండా చెల్లిస్తామని అనడంవల్ల ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పాడతాయని ముఖ్యమంత్రి ఈ లేఖలో పేర్కొన్నారు.

రాష్ట్రప్రభుత్వం పేదరిక నిర్మూలనా కార్యక్రమాలలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలకు ఇటువంటి ఇబ్బందికర పరిస్థితులను నివారించవలసి వున్నదని ఆయన ఈ లేఖలో పేర్కొన్నారు.

అస్వస్థతవల్ల ప్రచారానికి జయస్వస్తి

మద్రాసు, ఫిబ్రవరి 22:

పళని లోక్‌సభ నియోజకవర్గం, తంజావూర్‌లలో రెండు రోజుల ప్రచారం అనంతరం అఖిలభారత అన్నా డి.ఎమ్.కె ప్రధాన కార్యదర్శి జయలలిత స్వల్పంగా అస్వస్థతకు గురిఅవటంవల్ల డాక్టర్ల సలహామేరకు కరైకల్, పాండిచ్చేరిలలో తమ ఎన్నికల ప్రచారాన్ని విరమించుకున్నారు.

'కోనేటికోటి' ఫైళ్ల ప్రహసనం

ఎక్కడిదొంగలు అక్కడనే, గప్‌చుప్!

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)
హైదరాబాద్, ఫిబ్రవరి 22:

రాష్ట్ర మంత్రి శ్రీ కోనేరు రంగారావు వ్యవహారానికి సంబంధించిన 36 మునిసిపల్ ఫైళ్ళను విచారణల కమీషనరేట్ పరిశీలమాత్రమే చేస్తుందనీ, ప్రతిదానికీ న్యాయవిచారణ సాధ్యంకాదని ముఖ్యమంత్రి శ్రీ మర్రి చెన్నారెడ్డి అనటం నేరస్థులను తప్పించేందుకేనని భారతీయ జనతాపార్టీ శాసనసభాపక్షం నాయకుడు శ్రీ సి.హెచ్. విద్యాసాగర్‌రావు అన్నారు. ఇక్కడ జరిగిన ఒక పత్రికా విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇలాంటి పరిశీలనలు ఇదివరకే ముఖ్యమంత్రి చేశాడనీ, తిరిగి ఒక ఐ ఎ ఎస్ అధికారిచే పరిశీలన జరిపించటం ఒక ప్రహసనం మాత్రమే అని ఆయన అన్నారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి 'కుమారుని'కి చెందిన ఫైలు కూడా వుందనీ, అందుకే ఫైళ్ళలోని వ్యక్తులను బైటపెట్టకుండా ముఖ్యమంత్రి జాగ్రత్తలు తీసుకుంటున్నారనీ, దీన్నిబట్టి చూస్తే ఆ ఫైళ్ళలోని వ్యక్తులు 'ఘనాపాఠీలు' అని అర్థమవుతున్నదని ఆయన అన్నారు.

'సరిపడని' అధికారులను బదిలీచేసే అలవాటున్న మంత్రి ఇలాగే అధికారంలో కొనసాగితే ఈ విచారణలోగానీ, పరిశీలనలోగానీ అసలే ఫలితం వుండదని అంటూ, మునిసిపల్ శాఖామంత్రిని వెంటనే ఆ స్థానం నుండి తొలగించాలనీ, ఫైళ్ళలోని వ్యక్తులను బయట పెట్టాలనీ, తగిన విధంగా న్యాయవిచారణ జరిపించాలని విద్యాసాగర్‌రావు డిమాండ్ చేశారు.

శ్రీ కోనేరు రంగారావుపై ఎలాంటి చర్యను తీసుకోకపోగా విజయవాడ కాంగ్రెస్‌కమిటీవారిచే ఈ వ్యవహారాన్ని బయటకులాగిన శ్రీ దత్తాత్రేయపై బురదచల్లించటం, తప్పుడు ఆరోపణలు చేయించటం ముఖ్యమంత్రి హోదాకు తగదనీ, ఇలాంటి తప్పుడు ఆరోపణలవల్ల నాయకుల జీవితాలు మలకనైపోయే అవకాశం లేకపోలేదని ఆయన అన్నారు. శ్రీ కోనేరు రంగారావుపై ఆరోపణలు చాలా స్పష్టంగా వున్నా వ్యవహారాన్ని పొడగించడం విచారకరమని అంటూ, అవినీతి ఎంతస్థాయిలో వుంటే అభియోగం చేయాలో, ఏ మేరకు అభియోగాలు వుంటే విచారణ జరిపిస్తారో ముఖ్యమంత్రి వివరించాలని ఆయన అన్నారు.

రాష్ట్రంలో లోకాయుక్తగాని, ఉపలోకాయుక్తగానిలేరని, లోకాయుక్త ఫైలు వెతకాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇన్ని లొసుగులు పెట్టుకొని పైగా తమ పార్టీ వారిచే ప్రత్యారోపణలు చేయించడం మానుకోకపోతే ఆందోళనాకార్యక్రమం తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ విషయంపై ప్రతిపక్షాలన్ని కలిసి ఆలోచిస్తున్నాయని ఆయన అన్నారు.

అలాగే క్రిమినల్ కేసులున్నవారు మంత్రి వర్గంలో వున్నారనీ, తాము ఈ విషయం శాసనసభలోనే తెరిపినా ఇంతవరకూ ఏ చర్యా తీసుకోలేదని శ్రీ విద్యాసాగర్‌రావు అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని దిగిపొమ్మని అనడం తమకలవాటులేదని అంటూ శ్రీ కోనేరు మంత్రిగా కొనసాగకూడదని ఆయన అన్నారు. రాష్ట్ర సమాచార శాఖ మంత్రి శ్రీ దివాకరరెడ్డి అనంతపురం జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంకులో 64,607.57 రూపాయలు స్వాహా చేశారనీ, ఇది 1976లో జరిగిందని అంటూ అలాంటి వ్యక్తికి మంత్రివర్గంలో వుండే నైతిక హక్కు లేదని ఆయన అన్నారు. అలాగే రవాణాశాఖమంత్రి శ్రీ సుధాకరరావు కలప దొంగరవాణా కేసులో వున్నారనీ, అతని నుండి కలపను స్వాధీనం చేసుకోవడం జరిగిందనీ, ఈ కేసులో ఇద్దరు ప్రభుత్వాధికారులు సస్పెండుకూడా అయ్యారని ఆయన తెలిపారు. ప్రజలకు నీతివంతమైన ప్రభుత్వాన్ని ఇస్తానన్న ముఖ్యమంత్రి ఇలాంటి క్రిమినల్ కేసులున్నవారిపై ఏంచర్య తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు.

నీటి తీరువాకూడా సరిగ్గాలేదని రైతులకు అన్యాయం జరుగుతుందని అంటూ నీటి తీరువాలో పెద్ద మొత్తాలు వసూలు చేస్తున్నారని శ్రీ విద్యాసాగరరావు ఆరోపించారు.

సెలవు

శివరాత్రి పర్వదిన సందర్భంగా 23వ తేదీన మాకార్యాలయానికి సెలవు. కనుక 24 వతేదీ సంచిక వెలువడదు. పునర్దర్శనం 25నే. పండుగసందర్భంగా పాఠకులకు ప్రకటనకర్తలకు, ఏజంట్లకు మా శుభాకాంక్షలు.

'కేశోరాం'తో కుమ్మక్కు, 'కోటి' మినహాయింపు

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)
హైదరాబాద్, ఫిబ్రవరి 22:

కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ వాడుకున్న విద్యుత్ బిల్లులు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఆ ఫ్యాక్టరీ యాజమాన్యంతో లాలూచీపడి కోటి రూపాయల మినహాయింపు ఇచ్చిందని శాసనసభలో టి.డి.పి పక్ష ఉపనాయకుడు శ్రీ ఎం.రఘుమారెడ్డి ఆరోపించారు. ఆయన గురువారంనాడిక్కడ జరిగిన విలేఖరుల సమావేశంలో ప్రసంగించారు. ఒకవైపు రాష్ట్రంలోని రైతులు విద్యుత్ కోతవల్ల తీవ్రనష్టాన్ని ఎదుర్కొంటుంటే, మరోవైపు సిమెంట్ ఎక్కువ ఉత్పత్తి చేస్తామనే పేరుతో అధిక విద్యుత్‌ను వాడుకున్న కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీకి ఒక కోటి రూపాయల రాయితీ ఇవ్వడంలోనే ప్రభుత్వ నీతి అర్థమయిందని ఆయన తీవ్రంగా ఆరోపించారు.

రాష్ట్రంలో చాలాచోట్ల లోవోల్టేజివల్ల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే బాగుచేయించని స్థితిలో వున్న ప్రభుత్వం, స్వప్రయోజనాలు ఆశించి మినహాయింపు ఇచ్చిందని ఆయన వివరించారు.

రాష్ట్రమంత్రి శ్రీ కోనేరు రంగారావు వ్యవహారంలో కూడా అవినీతి చోటు చేసుకోవడంవల్లే ముఖ్యమంత్రి ఈ విషయంపై న్యాయవిచారణ జరిపించడంలేదని కూడా, శ్రీ రఘుమారెడ్డి ఆరోపించారు.

న్యాయవిచారణ జరిపించాలని పలువురు ప్రతిపక్ష నాయకులుకోరితే, ప్రతి విషయానికీ న్యాయ విచారణ జరిపించాలా? అని ముఖ్యమంత్రి అంటున్నారని, అన్యాయం జరిగిందంటే న్యాయవిచారణ జరిపించకుంటే ఎలాగని శ్రీ రఘుమారెడ్డి ప్రశ్నించారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఆర్టీసీ బస్సు ఛార్జీలు పెంచితే కాంగ్రెస్‌నాయకులు ప్రతిపక్షంలో వుంటూ ఆందోళనలకు దిగి బస్సులనుకూడా దగ్ధం చేశారని ఆయన వివరించారు.

రాష్ట్రమంత్రి శ్రీ కె.వి.సుధాకరరావు విశాఖపట్నంలో మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం 15 వందల కోట్ల రూపాయలను గంగపాలు చేసిందని వ్యాఖ్యానించడంపై కూడా శ్రీ రఘుమారెడ్డి తీవ్రంగా విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే 15 వందలకోట్లరూపాయల ఖర్చుతో ప్రారంభించిన సంక్షేమ పథకాలు కొనసాగించాలని శ్రీ రెడ్డి సూచించారు.

మూడు 'ముళ్ళ'బంధం

నిర్మల్, ఫిబ్రవరి 22(నవవార్త): శుభం పలకరా పెళ్ళికొడకా అంటే పెళ్ళి కూతురు......ఎక్కడ చచ్చింద న్నాట్ట వెనకటికొకడు. అరేళ్ళపాటు ప్రేమాయణంసాగించి, పెళ్ళి చేసుకుంటానని చెప్పి చివరికి మరొక అమ్మాయిని పెళ్ళి చేసుకోడానికి ప్రయత్నించా పోలీసు అధికారులు, పెద్దమనుషుల దోక్యంతో పెళ్ళిచేసుకుని వెంటనే తన భార్య 'వేశ్య' అంటున్నాడో పోలీసు ప్రబుద్ధుడు.

సారంగాపూర్‌లో పనిచేస్తున్న పోలీసు కానిస్టేబుల్ దేవీలాల్, ఇందరవెల్లి మండలం మర్కగూడలో అంగన్‌వాడి టీచర్‌గా పనిచేస్తున్న శాంతకు మధ్య ఆరేళ్ళ నుండి ప్రేమ సంబంధాలున్నాయి. అయితే తనను దేవీలాల్ మాటలతో

(మిగతా 2 వ పేజీలో)

నాపాదధూళి సోకినచోటల్లా మాదే గెలుపు

రామన్న జోస్యం

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)
హైదరాబాద్, ఫిబ్రవరి 22:

ఉత్తరభారతదేశంలో ఎన్నికల సందర్భంగా తాను పర్యటించిన మూడు రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో భారతీయజనతాపార్టీ, గుజరాత్‌లో జనతాదళ్ గెలుపొంది ప్రభుత్వాలు ఏర్పాటుచేయడం తథ్యమని నేషనల్‌ఫ్రంట్ ఛైర్మన్, రాష్ట్ర మాజీముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు జోస్యం చెప్పారు. కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు అని ఆయన అన్నారు. ఆయన గురువారంనాడు ఆబిడ్స్‌లోని నివాసగృహంలో ఏర్పాటుచేసిన విలేఖరులు సమావేశంలో మాట్లాడారు. అంతకుముందే శ్రీ రామారావు తనఎన్నికల పర్యటన ముగించుకొని బొంబాయినుంచి నగరానికి వచ్చారు. తాను పర్యటించిన మూడురాష్ట్రాల్లో కూడా తెలుగుదేశం పార్టీ విధానాలపట్ల ప్రజలు ఎంతో ఆకర్షితులై ఉన్నారని, వారి రాష్ట్రాల్లోకూడా సబ్సిడీబియ్యం, జనతావస్త్రాలు, పక్కాఇండ్ల నిర్మాణం జరగాలని అభిలషిస్తున్నారని శ్రీ రామారావు చెప్పారు.

మూడు నెలల క్రితం కేంద్రంలో ఏర్పాటైన నేషనల్‌ఫ్రంట్ ప్రభుత్వం పట్ల విశ్వాసం ప్రకటించారని ఆయన చెబుతూ "నేను ఎక్కడికి వెళ్లినా జనం వేల సంఖ్యలో వచ్చి అదిగో ఎన్టీఆర్ ఇదిగో ఎన్టీఆర్ అంటూ ఎంతో ఉత్సాహంతో చూశారు. ఇది నా కెంతో సంతోషాన్ని కలిగించింది బ్రదర్స్" అని శ్రీ రామారావు అన్నారు.

తనను ఎన్నికల ప్రచారంలో పాల్గొనమని ఎవరూ అడగలేదని ఫ్రంట్‌ఛైర్మన్‌గా బాధ్యతతో తానే స్వయంగా ప్రచారానికి వెళ్లానని ఆయన ఒకప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాంగ్రెస్‌పార్టీ అధికారదాహంతో తప్పుడు ప్రచారాలు చేస్తూ ఎన్నికల్లో ఓట్లు సంపాదించాలని ప్రయత్నిస్తున్నదని ఇది వారి వెకిలితనానికి నిదర్శనమని శ్రీ ఎన్టీఆర్ విమర్శించారు. బుల్లెట్‌ప్రూఫ్ అద్దాలమధ్య బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించి ప్రసంగాలు చేస్తే ప్రజలమధ్యకు వచ్చినట్లుకాదని ఆయన మాజీప్రధాని శ్రీ రాజీవ్‌గాంధీని పరోక్షంగా పేరుపెట్టకుండా విమర్శించారు. భారతదేశ గతచరిత్ర ఎంతో ఘనమైందని, ధైర్యం ఉన్న వారెందరో ఈ దేశాన్ని పాలించారని శ్రీ రామారావు అంటూ విక్రమాదిత్యుడు, చాణుక్యుడు ఎంతో ధైర్యవంతులని, అలాంటి మనదేశానికి పాలించే అర్హత ధైర్యవంతులకే ఉందని, పిరికివారికి లేదని ఆయన స్పష్టంచేశారు.

సమాజానికి దూరంగా ఉంటూ అధికారంలో ఉండాలనుకోవడం ఎవ్వరికి సాధ్యంకాదని, అలాంటి వారిని ప్రజలుకూడా తమ మనిషిగా స్వీకరించరని శ్రీ రామారావు తన సహజధోరణిలో ప్రసంగం కొనసాగించారు.

కాశ్మీర్, పంజాబ్ రాష్ట్రాల్లో శాంతిభద్రతలులేవని ఒక పెద్దమనిషి వ్యాఖ్యానించాడని, ఆ రెండు రాష్ట్రాల్లో శాంతి భద్రతలసమస్య ఆ పెద్దమనిషి అధికారంలో ఉండగా తలెత్తినవేనని శ్రీ ఎన్టీఆర్ రాజీవ్‌గాంధీని విమర్శించారు. ఢిల్లీలో సిక్కులు గొంతులు కోసినప్పుడు లేదా? శాంతి భద్రతల సమస్య అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇది

(మిగతా 2 వ పేజీలో)

పాతజ్ఞాపకమేదియో పలకరించెను - మనసులో......

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)
హైదరాబాదు, ఫిబ్రవరి 22:

ఎన్నికల పర్యటన సందర్భంగా తాను జబల్‌పూర్ విమానాశ్రయంలో ఉండగా కాంగ్రెస్(ఐ)అధ్యక్షులు మాజీప్రధాని శ్రీ రాజీవ్ గాంధీ యాదృచ్ఛికంగా కలిసి కొద్ది సేపు మాట్లాడుకున్నామని నేషనల్‌ఫ్రంట్ ఛైర్మన్ శ్రీ రామారావుచెప్పారు.

ఆయన గురువారం నాడు ఆబిడ్స్‌లోని తన నివాసంలో విలేఖరులతో మాట్లాడుతూ శ్రీ రాజీవ్‌గాంధీతో జరి

(మిగతా 2 వ పేజీలో)

తప్పులు చేశాం, క్షమించండి!

గయ, ఫిబ్రవరి 22:

ఎనిమిది రాష్ట్రాలలోని విధానసభ ఎన్నికల అనంతరం తన పార్టీలో చీలికలు రావచ్చుని వస్తున్న ఊహాగానాలను మాజీ ప్రధాని, కాంగ్రెస్(ఐ) అధ్యక్షుడు శ్రీ రాజీవ్‌గాంధీ నిర్ద్వందంగా ఖండించారు.

ఎవరు ఈ పార్టీని వదిలి వెళ్ళినప్పటికీ విశ్వాసంగల నాయకులు మాత్రం వదలరని, ముందుకూడ మాతోనే ఉంటారని శ్రీ గాంధీ విలేఖరులతో అన్నారు.

బీహార్ ముఖ్యమంత్రి శ్రీ జగన్నాధ్ మిశ్రా వంటి వ్యక్తులు ఎల్లప్పుడు తమ పార్టీలోనే కొనసాగుతారని కూడ శ్రీ గాంధీ పేర్కొన్నారు.

శ్రీ గాంధీ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ గతంలో తన ప్రభుత్వం తప్పులు చేసిందని అంగీకరించారు. అందుకు తనను క్షమించి, వాటిని మరచిపోవలసిందిగా ఆయన కోరారు.

ప్రజలకు చేసిన వాగ్దానాలను నెలవేర్చుకునే సామర్థ్యం నిరూపించుకోడానికి నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం పూర్తి కాలం అధికారంలో ఉండాలని కోరుకుంటున్నాని ఆయన తెలిపారు.

శ్రీ రాజీవ్‌గాంధీ వెడుతున్న రైలు ఆగిన ప్రతిస్టేషన్‌లోనూ ఆయనకు అఖండ స్వాగతం లభించింది.

అస్మదీయుల విస్మయం

రుణాల మాఫీపై సందిగ్ధం

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)
హైదరాబాద్, ఫిబ్రవరి 22:

నేషనల్‌ఫ్రంట్ ప్రభుత్వం ప్రకటించిన పదివేలవరకు రుణాల మాఫీపై రైతాంగం తీవ్ర సందిగ్ధంలో ఉన్నారని, సమగ్రమైన సమాచారం ఇటు ప్రభుత్వంవద్దగాని, అటు బాంకుల వద్ద గాని లేకపోవడంతో అసలు ఎలాంటి అప్పులు ఎవరికి మాఫీ అవుతాయో అర్థం కాని పరిస్థితి ఉందని తెలుగుదేశం పార్టీ, ఎమ్మెల్యేలు శ్రీయుతులు ఎం.రఘుమారెడ్డి, కె.రమాకాంత్, ఉమావెంకటేశ్వర్లు అన్నారు. వీరు గురువారం నాడిక్కడ జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.

ఈనెల 24న జరగనున్న రైతుసదస్సులో ఈ విషయంపై చర్చించి ఒక ప్రతినిధి బృందంను కేంద్రప్రభుత్వం వద్దకు పంపించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం కూడా రైతుల పట్ల కక్షసాధింపుచర్యలకు పాల్పడిందని, గతంలో సకాలంలో రైతులు చెల్లించిన రుణాల వడ్డీలో అయిదన్నరశాతం రాయితీ ఇచ్చేవారని ప్రస్తుత ప్రభుత్వం ఈ రాయితీని ఇచ్చేందుకు సుముఖంగాలేదని వారు ఆరోపించారు. రైతులకు గిట్టుబాటుధరలు లభించక నష్టానికి గురవుతున్నారని వారు తెలిపారు. అంతర్ రాష్ట్ర మార్కెటింగ్ విధానంలో ఉన్న కొన్ని నిబంధనలను సడలించాలని ప్రభుత్వానికి, ఎఫ్.సి.ఐ.కి నిర్ణయించిన మొత్తం 30 లక్షల టన్నుల లెవీ పూర్తి చేసిచేశారని దాంతో బయటి రాష్ట్రాలకు వెళ్ళి ధాన్యం అమ్ముకోవడంలో నిబంధనలు అడ్డువస్తున్నాయని స్వంత రాష్ట్రంలో గిట్టుబాటు ధరలు లేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం ధర మూటఅరవైరూపాయలకు పడిపోగా, మిర్చిధర 600 రూపాయలకు తగ్గిందని వారు తెలిపారు.

భూమి హక్కుల పాసుపుస్తకాల పంపిణీలో కూడా ప్రభుత్వం ఇంతవరకు ఒక నిర్ణయం తీసుకోలేదని ఈ విషయంలో కూడా 24న జరగనున్న రైతు సదస్సులో ఒక తీర్మానం ద్వారా ప్రభుత్వానికి తగిన సూచనలివ్వనున్నట్లు వారు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఆగ్రో సంస్థ కూడా రైతులకు నిరుపయోగంగా మారిందని ఆగ్రో సంస్థ రైతుల ఉత్పత్తులను కొనుగోలు చేసే గిట్టుబాటు ధర కల్పించాలని వారు కోరారు.

జైలర్ కాల్చివేత

అమృత్‌సర్, ఫిబ్రవరి 22:

అమృత్‌సర్‌పట్టణంలోని రాణికాబాగ్ ప్రాంతంలో జైలు అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీ వర్ధిని గురువారంనాడు ఉదయం ఉగ్రవాదులు కాల్చిచంపారు.

పిల్లలను పాఠశాలలో విడిచిపెట్టటానికి శ్రీ వర్ధి, అతని భార్య కారులో వెళ్తుండగా స్కూటర్‌పై వచ్చిన ఇద్దరు తీవ్రవాదులు ఆహారపౌరసరఫరాల కార్యాలయం వెలుపలినుండి కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు.

కారును నడుపుతున్న శ్రీ వర్ధి తలకు బుల్లెట్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. కారు విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో అతని భార్య, పిల్లలు మామూలు గాయాలతో బయటపడ్డారు.

అమృత్‌సర్ జిల్లాలోని వేర్వేరు ఘటనల్లో బుధవారం రాత్రి ఉగ్రవాదుల చేతుల్లో ఇద్దరు చనిపోగా, ఒక వ్యక్తి కిడ్నాపుకు గుయ్యాడు.

తరన్‌తరన్ పోలీసు జిల్లాలోని రాటోక్ గ్రామంవద్ద ఇద్దరు ఉగ్రవాదులు బల్‌కర్‌సింగ్ అనే వ్యక్తిని కాల్చి చంపారు. మజితా పోలీసు జిల్లాలోని విషే గ్రామం వద్ద కేవల్‌సింగ్ అనే రైతును ఉగ్రవాదులు కాల్చి వేశారు.

ఎయిర్‌బస్‌ల సరఫరాలో జాప్యం

బొంబాయి, ఫిబ్రవరి 22:

విమానాల రెక్కల తయారీ విభాగంలో సమ్మె జరుగుతున్నందువల్ల ఎ-320 విమానాల సరఫరాలో 5 నెలల జాప్యం జరుగుతుందని ఫ్రాన్స్‌కు చెందిన ఎయిర్‌బస్ ఇండస్ట్రీస్ గురువారం పేర్కొంది. భారత్‌కు పంపవలసిన మరోనాలుగు ఎ-320 విమానాలు కొంతకాలం ఆపవలసిందిగా ప్రభుత్వం కోరడంతో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌తో సహా మరో 5 అంతర్జాతీయ విమానయాన సంస్థలకు ఎయిర్‌బస్ ఇండస్ట్రీస్ ఈ విషయం వివరించింది.

కొన్నెత్తుటి పాటకు కొత్త గొంతు

ఉస్మానియా క్యాంపస్‌లో 'రాడికల్స్‌మార్చ్'

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)
హైదరాబాద్, ఫిబ్రవరి 22:

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో గత ఐదేళ్ళుగా తన కార్యక్రమాలను నిలుపుకున్న రాడికల్ విద్యార్థి సంఘం తిరిగి తన కార్యక్రమాలను పునః ప్రారంభించనున్నట్లు క్యాంపస్ విద్యార్థి, రాడికల్ నాయకుడు శ్రీ శ్రీనివాస్ తెలిపారు. దీనికి కారణం శ్రీ చెన్నారెడ్డి సానుకూల విధానం కానేకాదనీ, మారుతున్న రాజకీయ, సామాజిక పరిస్థితులే ఇందుకు కారణమని అతను వివరించాడు. క్యాంపస్‌లో ఇన్ని రోజులుగా "రాజ్యం" చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు పచ్చి స్వార్థంతో వ్యవహరించారనీ, విద్యార్థులు వారి పార్టీని చూసి వారిని ఎనుకున్నారుగానీ. వ్యక్తిగతంగా వారు అవకాశవాదులనీ, ఏ మాత్రం నైతిక విలువలులేని గూండాలనీ శ్రీ శ్రీనివాస్ ఆరోపించారు. అధికారులతో కుమ్మక్కై దొంగదారులుగా ఎం.బి.ఎ. ఎం.ఫిల్, బి.ఎల్, ఐ.సి. కోర్సులలో సీట్లు తెచ్చుకొని తమ ప్రతిభా పాటవాలతో సంపాదించినట్లు ఫోజులు కొడతారని అంటూ ఇకపై ఇలాటి ఆటలను సాగనివ్వమనీ, విద్యార్థులకోసం పోరాడుతామనీ ఆయన అన్నారు. ఇందుకు ఎన్ని ఆటంకాలు వచ్చినా ఇకపై వెనుతిరిగేదిలేదని ఆయన స్పష్టం చేశారు.

ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటయిన సమావేశంలో శ్రీ గద్దర్, శ్రీ కాకరాల, శ్రీ వరవరరావు ఉపన్యసించారు. ఊహించని రీతిలో విద్యార్థులు తరలిరావటంతో ఆడిటోరియం క్రిక్కిరిసిపోయింది.

బ్రిటన్‌కు 'మోసగాని' బదిలీ

సింగపూర్, ఫిబ్రవరి 22:

పది మిలియన్ డాలర్ల కుట్రకేసుతో సంబంధమున్న అమెరికన్ జార్జ్‌హోవార్డ్‌ను సింగపూర్ నుండి బ్రిటన్‌కు పంపించారు.

మరికొందరు వ్యక్తులతో కలిసి అబద్ధపు క్రెడిట్ నోట్‌ను సృష్టించి లండన్‌లోని కాలిఫోర్నియా బాంకునుండి 10 మిలియన్ డాలర్లను దొంగిలించడానికి హోవార్డ్ కుట్రపన్నారు. ఇతనిని గత సెప్టెంబర్‌లో కమర్షియల్ క్రైమ్ డివిజన్ ఆఫీసర్లు అరెస్ట్ చేశారు.

అంతేకాక గత నెలలో అతనిని కోర్టులో హాజరుపరచి అతని కుట్రలకు తగిన సాక్ష్యాధారాలు ఉన్నట్లు కోర్టు నమ్మింది. ఇప్పుడు అతనిపై బ్రిటన్ తగిన చర్య తీసుకోవాలి. అందుకు దేశ వ్యవహారాల, న్యాయశాఖామంత్రి శ్రీ ఎస్.జయకుమార్ ఆదేశాల మేరకు హోవార్డ్‌ను బ్రిటిష్ పోలీసులకు అప్పగించారు.

తెహ్రీ నిర్మాణం తెలివితక్కువ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:

తెహ్రీ ఆనకట్టను కనుక నిర్మిస్తే అది ఇరవై శతాబ్దంలో చేసిన అతి తెలివితక్కువపనికి నిదర్శనమవుతుందని ప్రముఖ పర్యావరణ కార్యకర్త శ్రీ సుందర్‌లాల్ బహుగుణ వ్యాఖ్యానించారు.

యు.ఎన్.ఐ.కిచ్చిన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన ఇటువంటి పని తన కళ్లెదుట జరగటం తనకిష్టం లేదని అందుకే దీనికి వ్యతిరేకంగా తాను పోరాటం సాగిస్తున్నానని చెప్పారు.

శ్రీ బహుగుణ మరొక విషయాన్ని వివరిస్తూ ఈ ఆనకట్ట ప్రాజెక్టును సమర్థించినవారందరూ రాజకీయంగానూ, వ్యక్తిగతంగానూ చాలా కష్టాలకు గురయ్యారని వెల్లడించారు.

తెహ్రీ ఆనకట్టను నిర్మించాలని 1949లో అనుకున్నా దీనిపై చర్చలు 1960 దశాబ్దంలో ప్రారంభమయ్యాయని శ్రీ బహుగుణ వివరించారు. 1975లో ఈ ఆనకట్ట నిర్మాణాన్ని సమర్థించిన అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి హేమవతి నందన్ బహుగుణ ఒక 15 రోజులలోగా తన ముఖ్యమంత్రి పదవిని కోల్పోయారని శ్రీ బహుగుణ చెప్పారు. తరువాత శ్రీ వి.పి.సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఆయన భగీరథ జలాలను తరలించే కాలువలను సందర్శించిన తరువాత తన సోదరుడిని కోల్పోయారని శ్రీ బహుగుణ వెల్లడించారు.

ఇక భగీరథపై ఆనకట్ట నిర్మిస్తే ఎటువంటి దుష్పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందోనని ఈ గ్రామస్థులు తల్లడిల్లిపోతున్నారు. తెహ్రీ ఆనకట్టకు మద్దతునిచ్చిన తరువాతే మాజీ కేంద్ర మంత్రి కేదార్‌నాథ్, యు.పి.మంత్రి బల్బీర్ సింగ్ తమ పదవులను పోగొట్టుకున్నారని గ్రామస్థులు చెప్పారు.

మెగాసెసే అవార్డు విజేత అయిన శ్రీ బహుగుణ మాట్లాడుతూ భగీరథపై పెద్ద ఆనకట్టకు మొదట మద్దతునిచ్చిన దివంగత మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ తరువాత ఈ ప్రాంతాన్ని సందర్శించి తన నిర్ణయాన్ని మార్చుకున్నారని చెప్పారు.

శ్రీ రాజీవ్‌గాంధీ అధికారాన్ని చేపట్టిన తరువాత తెహ్రీ ఆనకట్ట కార్యక్రమం చురుకుగా ప్రారంభమైందని, కంట్రాక్టర్ల పలుకుబడి ఎక్కువై ఈ ఆనకట్ట నిర్మాణానికి వ్యతిరేకంగా వచ్చిన అన్ని ఆరోపణలకు విలువ లేకుండాపోయిందని శ్రీ బహుగుణ వ్యాఖ్యానించారు.

స్త్రీలను కించపరిచే టి.వి.'వెన్నెల'ను నిషేధించండి

కర్నూలు, ఫిబ్రవరి 22:

దూరదర్శన్‌లో ప్రసారమవుతున్న వెన్నెలనాటకంలో 'మరదలు' గురించి అసభ్యకరమైన అభ్యంతరమైన అశ్లీలమైన సంభాషణలు, సన్నివేశాలు స్త్రీజాతిని కించపరిచేవిధంగా ఉన్నాయని కర్నూలు సివిక్ అసోసియేషన్ కార్యదర్శి అడ్వకేటు శ్రీ వి. నాగాంజనేయులు ఆరోపించారు. సభ్యసమాజానికి తలవంపులు తెచ్చే విధంగా ఈ చిత్రీకరణ వుందనీ బావమరదలు సంబంధాలను అశ్లీలంగా చూపించడం మూలంగా చిన్నారి మనసులను చెడుద్రోవ పట్టించే అవకాశం ఉందన్నారు. తక్షణం ఇలాంటి అశ్లీల సన్నివేశాలు, సంభాషణలు పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు తీసికోవాలని నాగాంజనేయులు ఒక పత్రికా ప్రకటనలో కోరారు. 'ఇనోడీసెంట్ రెప్రజెంటేషన్ ఆఫ్ ఉమన్'నిషేధం చట్టం క్రింద ఇలాంటి ప్రదర్శనలు నేరం క్రిందికి వస్తాయని. స్వయం ప్రతి పత్తి కల్పించే సమయంలో అధికారులు ఇలాంటి దుర్వినియోగం కార్యక్రమాలకు పాల్పడటం దురదృష్టమని ఇటువంటి ప్రదర్శనలు పునరావృతం కాకుండా దూరదర్శన్ వారికి తెలియచెయ్యాలని నాగాంజనేయులు మహిళాసంఘాలను కోరారు.

హరిజనులపై ఖాకీ లాఠీ

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 22:

రంగారెడ్డి జిల్లాలోని తప్పాదుగ్రామంలో రెడ్డి కులస్థులు కొందరు ముఖ్యమంత్రి బంధువులమని చెప్పుకుంటూ హరిజనులమీద దాడి చేస్తుంటే పోలీసులు కూడా వారికి మద్దతుగా హరిజనులపైనే అక్రమకేసులు బనాయిస్తున్నారని నిరసిస్తూ గురువారం ఆ గ్రామ హరిజనులు, మహిళలు ఎస్.పి. కార్యాలయం ముందు ధర్నా చేశారు.

గత కొన్ని నెలలుగా తాము శ్రీ సుదర్శన్‌రెడ్డి అనే భూస్వామి ఆధీనంలో బినామీ పేర్లతో వున్న వంద ఎకరాల భూమిని పేదలకు పంచాలని కోరుతూ వుండగా, ఇటీవలనే జిల్లా కలెక్టర్ భూస్వాములకు నోటీసులు జారీచేశారని ఇబ్రహీంపట్నం తాలూకా వ్యవసాయ కార్మికుల సంఘం కార్యదర్శి శ్రీమతి గీతారామస్వామి తెలిపారు.

తమ పోరాటం వల్లనే భూస్వాములకు భూమికి సంబంధించిన నోటీసులు వచ్చాయనే కక్షతో ఆ గ్రామ హరిజనులను కర్రలతో, ఇనుపరాడ్లతో, గొడ్డళ్లతో కొట్టి తీవ్రంగా గాయపర్చారని, అయితే పోలీసులు దాడిచేసిన భూస్వాములను వదిలేసి దాడికి గురైన హరిజనులమీద సెక్షన్ 307 కేసులు బనాయించి జైళ్ళలో బంధించారని ఆమె ఆరోపించారు.

రంగారెడ్డి ఎస్.పి. ఆఫీసుముందు ధర్నా

రంగారెడ్డి జిల్లా ఎస్.పి. ప్రవర్తనాతీరు ముఖ్యమంత్రి పెద్ద పాలేరులా వుందని ఆమె విమర్శించారు.

ఇప్పటికైనా భూస్వాముల మీద కేసులు పెట్టి, జరిగిన సంఘటనను దర్యాప్తు చేసి దోషులను శిక్షించకుంటే తాము ముఖ్యమంత్రి వద్దకు వెళ్తామని ఆమె ఎస్.పి.కి ఒక మెమొరాండం ఇచ్చారు.

ఎస్.పి. ఖండన

తాము నిష్పక్షపాతంగా గొడవచేసి కొట్టుకున్న రెండువర్గాలవారిని అరెస్ట్ చేశామని, ఇద్దరిపైనా కేసులు పెట్టామని ఎస్.పి. శ్రీ కమలకుమార్ తనను కలిసిన విలేఖరులకు వివరణ ఇస్తూ పారి ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

కంబోడియాకు పరిష్కారం

సింగపూర్, ఫిబ్రవరి 22:

కంబోడియాలో 11 ఏళ్ల నుంచి సాగుతున్న అంతర్యుద్ధాన్ని ఆపివేసేందుకు, వచ్చే జకర్తా చర్చలలో పరిష్కారం కుదరవచ్చునని భావిస్తున్నారు.

ప్రస్తుతం ఎడమొహం పెడమొహంగా ఉన్న కంబోడియా రాజు నీర్దోమ్ సియోనక్, ప్రధాని హున్‌సేన్‌లు కలిసి బుధవారంనాడు బాంకాక్‌లో ఒక చారిత్రాత్మక ప్రకటనను విడుదల చేయటంతో కంబోడియా సమస్యకు పరిష్కారం లభించవచ్చున్న ఆశాభావాన్ని అందరూ వ్యక్తం చేస్తున్నారు.

పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ సమావేశం విఫలమైన తరువాత విడుదలైన మొదటి ప్రకటనలో కంబోడియాలో ఐక్యరాజ్యసమితి సేనలు ఉండటం చాలా ముఖ్యమని పేర్కొన్నారు.

బాంకాక్‌లో ఆరుగంటలసేపు చర్చలు జరిపిన ఈ ఇద్దరు నాయకులు కంబోడియా జాతీయ సార్వభౌమత్వాన్ని సమైక్యతను కాపాడటానికి ఒక జాతీయ సంఘాన్ని ఏర్పాటు చేయాలనికూడా నిర్ణయించుకున్నారు.

కంబోడియాపై ఏర్పాటుచేసిన త్రైపాక్షిక సంఘం నుంచి విడిపోయిన సియోనక్, హున్‌సేన్‌తో చేతులు కలపటాన్ని విశేషమైన చర్యగా అందరూ గుర్తిస్తున్నారు.

ఈ నెల 26 నుంచి 28 దాకా జరిగే చర్చల్లో ఈ ప్రకటన కంబోడియాలో శాంతిని నెలకొల్పేందుకు దోహదపడొచ్చు. కంబోడియాలో జరుగుతున్న అంతర్యుద్ధం తలెత్తటానికి కారణాలను, ఇతర భవిష్యత్ కార్యక్రమాలను చర్చించేందుకు ఈ ఇద్దరు నాయకులు మళ్లీ సమావేశాలు జరపబోతున్నారు.

జకర్తాలో జరిగే సమావేశంలో వియత్నాం, లావోస్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్‌లు పాల్గొంటున్నాయి.

రాములుపై కేసు ఎత్తివేతకు 'విరసం' అభ్యర్థన

హైదరాబాద్, ఫిబ్రవరి 22:

"బ్రతుకు పోరు" వంటి ఉత్తమ నవలలు, "అడవిలో వెన్నెల" వంటి ఉత్తమ కథలు రాసి, కొడవటిగంటి కుటుంబరావు స్మారక కథాబహుమతి పొందిన బి.ఎస్.రాములు కరీంనగర్ జిల్లాలో ఆయనపై మోపిన అక్రమకేసువల్ల ఏర్పడిన ప్రాణాపాయస్థితివల్ల అజ్ఞాత జీవితానికి ఐదేళ్ల క్రితం వెల్లాడు. అప్పటికే ఆయన విరసం కార్యవర్గ సభ్యుడు.

అజ్ఞాత జీవితానికి వెళ్ళేముందు 1984, 85ల్లో రాడికల్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి, అఖిలభారత విప్లవ సాంస్కృతిక సమితి దేశమంతా విప్లవోద్యమం ప్రచారం చేస్తూ తిరిగిన బృందంలో సభ్యుడు.

వృత్తి రీత్యా కరీంనగర్ జిల్లా మల్యాలలో హాస్టల్ వార్డెన్‌గా వున్న రాములును పోలీసులు అరెస్టు చేసి చిత్ర హింసలుపెట్టి జగిత్యాల కోర్టులో అక్రమ కేసు పెట్టారు. ఉద్యోగంనుంచి సస్పెండ్ చేశారు. పోలీసుల చేతుల్లో, మతోన్మాదుల చేతుల్లో ప్రాణాపాయం కలిగే పరిస్థితికూడ ఏర్పడింది.

రాములుపై మోపిన అక్రమ కేసులు ఎత్తివేసి, ఆయన ఉద్యోగంలో సస్పెన్షన్ తొలగించి తిరిగి ఆయన బహిరంగ జీవితం కొనసాగించే అవకాశం కల్పించాలని 'విరసం' ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందని కార్యదర్శి శ్రీ వి.చెంచయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

గృహిణి ఆత్మహత్య

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 22:

రాజేంద్రనగర్ ప్రాంతంలో నివశిస్తున్న శ్రీమతి సుచిత్రాసాహ (42) అనే గృహిణి మానసిక వత్తిడిలను తట్టుకోలేక కిరోసిన్ పోసుకుని అగ్నికి ఆహుతి చేసుకుంది. ఆమె భర్త ఇంట్లోలేని సమయం చూసి బాత్‌రూంలో అంటించుకుని మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

తనకు భర్త, కూతురు అంటే ప్రేమ అని, కేవలం మానసికవ్యథతోనే తాను ఆత్మహత్య చేసుకున్నట్లు ఒక లేఖ రాసినట్లు వారు చెప్పారు. ఈ కేసును రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబసమస్యలతో ఆత్మహత్య

జియాగూడా నివాసి శ్రీ మహ్మద్ సర్దార్ అలి (50) కుటుంబ సమస్యలతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శ్రీ అలికి ఇద్దరు భార్యలు, ఆరుగురు పిల్లలు వున్నారని, కుటుంబబాధలు తట్టుకోలేకనే ఆత్మహత్య చేసుకున్నాడని వారు తెలిపారు. ఈ కేసును కుల్‌సుంపూరా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అబ్దుల్లాగారి మనసు దారితప్పుతున్నదా!

జమ్ము, ఫిబ్రవరి 22:

జమ్ము-కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగమన్న దానిపై నేషనల్ కాన్ఫరెన్స్‌కు సంబంధించినంతవరకు ఎటువంటి సందేహాలకు తావులేదని, దీనిపై ఎటువంటి మార్పు ఉండబోదని జమ్ము-కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ సీనియర్ నాయకులు ఐదుగురు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రంలో పార్టీ యూనిట్ల రద్దుపై ప్రజాభిప్రాయ సేకరణపై పార్టీ వైఖరిని స్పష్టం చేయాలని మాజీ ముఖ్యమంత్రి పార్టీ అధ్యక్షుడు డా.ఫరూక్ అబ్దుల్లాను వారు కోరారు. 1952 పూర్వ పరిస్థితిని తేవాలని కాశ్మీర్‌లోయ నాయకులు కొందరు కోరడాన్ని ప్రస్తావిస్తూ, షేక్ అబ్దుల్లా సమాధిపై ప్రమాణంచేసిన నాయకులు ఇటువంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం వారి అయోమయస్థితిని, స్వాతంత్రపోరాట చరిత్ర గురించి తెలియకపోవడాన్ని అందులో నేషనల్ కాన్ఫరెన్స్ పాత్రపట్ల అవగాహనాలేమిని సూచిస్తుందని వారు అన్నారు.

జమ్ము-కాశ్మీర్ లౌకిక పునాదిని పటిష్టంచేయాలని, పూర్వుల ఆశయాలను నిలబెట్టాలని వారు నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులను కోరారు.

లోయలో శాంతి స్థాపనకు అందరూ పార్టీ విభేదాలను మరచి కృషి చేయాలని, కాశ్మీర్ మైనారిటీలు దేశంలోని ఇతర ప్రాంతాలకు వలస పోకుండా నిలిపివేయాలని వారు కోరారు.

మాజీ ఆర్థికమంత్రి బాబూ పర్మానంద్, మాజీ ఆరోగ్యమంత్రి రాజ్‌బలీ, ఎం.ఎల్.సి కాశీరాసింగ్, రిటైర్డ్ మేజర్ జనరల్ బి.ఎన్.ధర్, నేషనల్ కాన్ఫరెన్ సీనియర్ ఉపాధ్యక్షుడు రతన్‌లాల్ గుప్త ఈ ప్రకటనపై సంతకాలు చేశారు.

అంబేద్కర్ పండుగకు మండేలాను పిలవాలి!

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 22:

కేంద్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించే అంబేద్కర్ శతజయంతి ఉత్సవాలకు నెల్సన్ మండేలాను ఆహ్వానించాలని కేంద్రప్రభుత్వాన్ని కోరినట్లు షెడ్యూల్డు కులాల హక్కుల రక్షణ సంఘం తెలిపింది. గురువారం ఉదయం ఏర్పాటుచేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో ఆ సంఘం అధ్యక్షుడు శ్రీ ఎ.బాలానందం మాట్లాడుతూ భారత రాజ్యాంగనిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ హరిజనులకే నాయకుడుకాదని, ఆయన జాతీయ నాయకుడని కాబట్టి ఏప్రిల్ 14వ తేదీన ఆయన జన్మదినం సందర్భంగా ప్రభుత్వం శెలవుదినం ప్రకటించాలని ఆయన కోరారు. అంతేగాకుండా డా.బి.ఆర్.అంబేద్కర్ శతజయంతి ఉత్సవాలను నెహ్రూ శతజయంతి ఉత్సవాల లాగా సంవత్సరంపాటు జరిపించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.



అంబేద్కర్ శతజయంత్యుత్సవ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన యాదయ్య

ఏప్రిల్ 14వ జరగనున్న అంబేద్కర్ శతజయంతి ఉత్సవాలు సందర్భంగా కవులకు, సంఘ సేవకులకు రాష్ట్రంలో మొదటిశ్రేణిలో ఉత్తీర్ణులైన హరిజన గిరిజన విద్యార్థులకు సన్మానం జరుగుతోందని వారు తెలిపారు.

అదే విధంగా ఏప్రిల్ 14వ తేదీన హైదరాబాదు నుంచి మహారాష్ట్ర మీదుగా ఢిల్లీ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్టు వారు తెలిపారు.

రాష్ట్రంలోని వివిధ గ్రామాలు సందర్శించి అంబేద్కర్ చరిత్రను చెప్పి ప్రజలను చైతన్యవంతులు చేయాలని తాము నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. శతజయంతి ఉత్సవాలు రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని యువజనసంఘాల, పార్టీల సమైక్యతతో నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.

డాక్టర్ అంబేద్కర్ స్మారకార్థం రాష్ట్రంలో ఒక విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఉత్సవాల సందర్భంలో రాష్ట్రంలో హరిజన, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషిచేయాలనివారు ప్రభుత్వాన్ని కోరాలని నిర్ణయించినట్టు తెలిపారు.

నగరంలోని బాగ్‌అంబర్‌పేట నిర్మించిన అంబేద్కర్ భవనానికి అదేరోజు ప్రారంభోత్సవం జరుగుతోందని వారు తెలిపారు. అదే రోజు ఉదయం చార్మినార్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు టార్చి ర్యాలీ నిర్వహిస్తామని వారు తెలిపారు.

రాజ్యాంగ నిర్మాత, డా. బి.ఆర్. అంబేద్కర్ శతజయంత్యుత్సవ కమిటీ చైర్మన్‌గా శ్రీ యాదయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మౌలానాకు ప్రధాని నివాళి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:

ప్రముఖ స్వాతంత్రసమరయోధుడు మౌలానా అబుల్‌కలామ్ ఆజాద్ 32వ వర్ధంతి సందర్భంగా ఉపరాష్ట్రపతి డాక్టర్ ఎస్.డి. శర్మ, ప్రధాని శ్రీ వి.పి. సింగ్ ఆయనకు నివాళులర్పించారు.జామామసీద్ సమీపంలో ఉన్న ఆయన సమాధిపై ఉపరాష్ట్రపతి, ప్రధాని గురువారం ఉదయం పుష్పగుచ్ఛాలు ఉంచారు.

మౌలానా స్థాపక అధ్యక్షుడిగా ఉన్న భారత సాంస్కృతికసంబంధాల మండలి (ఐసిసిఆర్) ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మౌలానా సమీపబంధువైన శ్రీమతి నజ్మా హెప్తుల్లాకూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామన్న జోస్యం

(1వ పేజీ తరువాయి)

ఇలావుండగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న శాసనసభ ఎన్నికలలో కొన్ని స్థానాలకు నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వానికి బయటినుంచి మద్దతు ప్రకటిస్తున్న బి.జె. పి.తో నేషనల్‌ఫ్రంట్ భాగస్వామ్యమైన జనతాదళ్ అభ్యర్థులే పోటీపడుతున్నారనే విషయం ఒకవిలేఖరి శ్రీ ఎన్టీఆర్ దృష్టికితీసుకురాగా, ఇది దురదృష్టకరమైన సంఘటన, అలా జరిగివుండావలసి ఉండేది కాదు అని వ్యాఖ్యానించారు.

ఎన్నికలు జరిగిన తర్వాత జరిగే ప్రిసీడియం సమావేశంలో అలాంటి అభ్యర్థులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని శ్రీ రామారావు చెప్పారు. చర్యకుముందు చర్చించడం, సమీక్షించడంకూడా జరుగుతుందని ఆయన వివరించారు. అలా పోటీపడడం నేషనల్ ఫ్రంట్ విధానాలకు తీవ్రవ్యతిరేకరమని, ఇలాంటి చర్యలను బి.జే.పి. నాయకుడు శ్రీ అటల్ బిహారివాజ్‌పాయ్ కూడా ఖండిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలో కొంతమంది టిడిపి సభ్యులను జనతాదళ్‌లో చేరవల్సిందిగా 'దళ్' నాయకులు కొందరు చేస్తున్న ప్రకటనలపట్ల శ్రీ ఎన్టీఆర్ తీవ్రంగా స్పందించారు.

"దళ్" కేంద్ర నాయకత్వం చాల మంచిదని, కానిస్థానికంగా ఉన్న కొంతమంది 'దళ్'కు చెందినవారు వెకిలిచేష్టలు చేస్తున్నారని, ఈ ప్రకటనలు కూడా అలాంటివారి సృష్టేనని ఆయన అన్నారు. తెలుగుదేశంనుంచి జనతాదళ్‌లో ఎవ్వరు చేరడంలేదని శ్రీ రామారావు స్పష్టం చేశారు.

అతివపై సామూహిక అత్యాచారం

మిర్యాలగూడ, ఫిబ్రవరి 22:

స్థానిక లలిత థియేటర్‌లో మంగళవారం రాత్రి సినిమాచూసి వస్తున్న ఒక యువతిపై 5 గురు దుండగులు సామూహిక మానభంగం జరిపిన ఉదంతం వెల్లడయింది.

కుమారి నాగమణి (16) అనే యువతి హల్య మండలము 'మారెపల్లి గౌరారం' గ్రామ నివాసి. మిర్యాలగూడ పట్టణానికి తమ బంధువుల ఇంటికి వచ్చిన నాగమణి రాత్రి రెండవ ఆట సినిమా చూసి ఇంటికి తిరిగి వెళుతుండగా సైదులు, కోటేష్, వెంకన్న, గురవయ్య, నిరంజన్, అనే 5 గురు దుండగులు సామూహిక మానభంగం జరిపారు. స్థానిక బంగారుగడ్డ ప్రాంతంలో ఇంటికి వెళుతున్న కుమారి నాగమణిపై దుండగులు ఈ దారుణానికి పాల్పడ్డారు. అయితే అదే ప్రాంతంలో గస్తీ తిరుగుతున్న కానిస్టేబుల్స్ ఆ ఐదుగురు దుండగులను పట్టుకున్నారు. ఈ అత్యాచారం పట్ల పట్టణ ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురి అవుతున్నారు. మిర్యాలగూడ సి.ఐ శ్రీ సీతారామ్‌రెడ్డి ఇద్దరు పోలీసులను కుమారి నాగమణి స్వగ్రామానికి పంపించి ఆమె కుటుంబసభ్యులను పిలిపించారు. కుమారి నాగమణిని ఆమె కుటుంబసభ్యులతో స్వగ్రామానికి పంపించారు.

మిర్యాలగూడ పోలీసులు కేసునమోదు చేసుకొని నిందితులను కోర్టుకు హాజరు పరచనున్నారు.

కుమారి నాగమణిపై జరిగిన ఈ అత్యాచారం పట్టణములో పెద్ద సంచలనం సృష్టించింది. గత వారం స్థానిక "నాగార్జున" థియేటర్ వద్ద శ్రీమతి 'అలివేలు' చనిపోయిన తీరు పలు అనుమానాలకు దారితీసింది. శ్రీమతి అలివేలు ఆత్మహత్య చేసుకుందని పోలీసులు కేసు నమోదుచేసుకోగా ఆమె అత్యాచారంనకు గురై హత్య చేయబడిందని ఆ వీధి జనం తదమ అనుమానమును వ్యక్తపరుస్తున్నారు. అలివేలు సంఘటన జరిగి వారం రోజులు గడువకముందే మరో యువతిపై అత్యాచారం జరగడంపట్ల శాంతి భద్రత విషయంలో పట్టణప్రజలుతమ తీవ్ర నిరాశను వ్యక్తం చేస్తున్నారు.

పట్టణంలో రోజురోజుకు అల్లరిమూకలు రోడ్‌సైడ్ రోమియోల ఆగడాలు ఎక్కువయ్యాయి. వీధిన వెళుతున్న మహిళలపై ఈ అరాచకశక్తులు అల్లర్లలు శృతి మించితున్నాయి. మహిళలపై జరిగే అత్యాచారాలను అరికట్టాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సెక్స్ పరీక్షలు నిషేధించాలి!

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 22:

స్వచ్ఛందసంస్థలు, యువజన సంఘాలు ముందుకువచ్చి రాష్ట్రాభివృద్ధికి ఇతోధికంగా సేవ చేయాలని రాష్ట్రగవర్నర్ సతీమణి శ్రీమతి సుమన్ కృష్ణకాంత్ పిలుపునిచ్చారు.

నగరంలోని అమర్ ఆసుపత్రిలో ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో హైస్కూలు విద్యార్థులకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభిస్తూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చిపెట్టాలని అన్నారు. ప్రస్తుతం ఆసుపత్రులలో చేస్తున్న సెక్స్ పరీక్ష విధానానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వస్తి చేప్పాలని ఆమె కోరారు.

రెడ్‌క్రాస్ సంస్థ ముఖ్యంగా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో, మురికి వాడలలో నివశించే ప్రజల వైద్య ఆరోగ్య అభివృద్ధిపట్ల తగిన శ్రద్ధ వహించాలని ఆమె రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులను కోరారు.

సమాజంలో విద్యార్థులు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం కూడా సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ఆమె అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యధికంగా నిధులు కేటాయించి స్త్రీ, శిశు సంక్షేమానికి కృషి చేయాలని ఆమె అన్నారు. నేడు సమాజంలో అట్టడుగున ఉన్న ప్రజలు అనేక వ్యాధులతో సతమతమవుతున్నారని వారిని అభివృద్ధిలోకి తెచ్చేందుకు అందరూ కృషి చేయాలని ఆమె కోరారు. రాష్ట్రంలో రక్తదాన శిబిరాలు నిర్వహించి ఆ రక్తాన్ని అట్టడుగు వర్గాలకు అందజేయాలని ఆమె కోరారు.

బాలికలు విద్యారంగంపట్ల అత్యంత శ్రద్ధ కనబరచి బాలురతో సమానంగా విద్యనభ్యసించి ఉన్నత మార్గంలో పయనించాలని ఆమె బాలికలను కోరారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నట్లు తెలిసిందని, అత్యాచారాలు రూపుమాపడానికి అందరూ సమైక్యంగా కృషి చేయాలని ఆమె కోరారు.

ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ శ్రీ ఎస్.ఎన్.మహంతి మాట్లాడుతూ నగరంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడానికి వైద్యులు ముందుకు రావాలని అన్నారు. నగరంలో మురికివాడల్లో నివశించే ప్రజలు తగిన వైద్య సౌకర్యం లేక అనేక ఇక్కట్లకు గురౌతున్నారని, వారికి సరైన వైద్య సౌకర్యం కల్పించడానికి వైద్యులు ముందుకు రావాలని ఆయన కోరారు.

సమావేశంలో ప్రముఖ వైద్యులు శ్రీ వ్యాఘే, రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ శ్రీ ప్రేంనారాయణ్ తదితరులు ప్రసంగించారు.

'చెన్నా' మహారాష్ట్ర పర్యటన

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 22:

రాష్ట్ర ముఖ్యమంత్రి డా.మర్రి చెన్నారెడ్డి శనివారం ఉదయం పది గంటలకు హైదరాబాద్ నుండి మహారాష్ట్రలోని షోలాపూర్ వెళ్ళి తిరిగి ఆదివారం సాయంత్రం ఆరుగంటలకు నగరానికి చేరుకుంటారు. శ్రీ చెన్నారెడ్డి శనివారం ఉదయం పదకొండు గంటల పదిహేను నిముషాలకు షోలాపూర్‌కు వెళ్ళి మహారాష్ట్ర మంత్రి శ్రీ సుశీల్‌షిండే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని అదేరోజు బొంబాయి చేరుకొని అక్కడ స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొంటారు.

ఆదివారం ఉదయం బొంబాయిలో ఒక కార్యక్రమంలో పాల్గొని మధ్యాహ్నం మూడు గంటలకు అక్కడి నుండి బయలుదేరి షోలాపూర్ మీదుగా నగరానికి ఆరు గంటలకు చేరుకుంటారు.

బొంబాయిలో జాజ్

బొంబాయి, ఫిబ్రవరి 22:

ఎన్నోఏళ్ళుగా సంగీత ప్రియులకు జాజ్‌పై ఆసక్తిని పెంచేందుకు విశేషంగా కృషి చేస్తున్న ద్వైవార్షిక జాజ్ ప్రదర్శన 'జాజ్ యాత్రా 1990' బొంబాయి, న్యూఢిల్లీలో గురువారం ప్రారంభమయింది. నాలుగురోజులపాటు జరిగే ఈ ఉత్సవమొక్కటే నిధుల కొరత వున్నా పనిచేస్తున్నదని జాజ్ ఇండియా నిరంజన్ జవేది చెప్పారు.

సోన్నీ రాలిన్స్, మాక్స్‌రోచ్, హెర్బీ మాన్ మొదలైన ప్రముఖులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. జపాన్ సదావో వతనాబె, అబ్దుల్లా ఇబ్రాహిం ఈ ఏడాది ఉత్సవంలో పాల్గొంటున్నారు. ఇబ్రహీం బొంబాయి యాత్రపై ప్రత్యేక ప్రదర్శన ఇస్తున్నారు.

23వ టి.వి.లో అర్ధరాత్రి ప్రత్యేక ప్రసారాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22:

మహాశివరాత్రి సందర్భంగా 23వ తేదీ రాత్రి 11 గంటలకు ఢిల్లీ నుండి ప్రసారమయ్యే ప్రత్యేక చిత్రం తదుపరి హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు ప్రసారమవుతాయి.

1.దక్షయజ్ఞం, నృత్యరూపకం 2.వేములవాడ ఉత్సవాలపై ప్రత్యేక కార్యక్రమం. 3.పేర్ని శివతాండవం 4.శ్రీశైల ఉత్సవాల డాక్యుమెంటరీ 5.శివగంగ, స్పాన్సర్డ్ కార్యక్రమం 6.శివభక్త, నటకీర, స్పాన్సర్డ్ కార్యక్రమం 7.ప్రత్యేక చిత్రలహరి కార్యక్రమాలు ప్రసారమవుతాయి.

పాతజ్ఞాపకమేదియో పలకరించెను మనసులో......

(1వ పేజీ తరువాయి)

గిన సంభాషణ వివరాలను వివరించారు.

ఢిల్లీ వెళ్ళేందుకు తాను జబల్‌పూర్ ఎయిర్ పోర్టులో ఉండగా అప్పటికే అక్కడ శ్రీ రాజీవ్‌గాంధీ వచ్చి చేరుకున్నారని, ఈ విషయం కాంగ్రెస్ నాయకులు శ్రీభజన్‌లాల్, హరిదేవ్‌జోషి ద్వారాతెల్సిందని చెప్పారు. అయితే తాను వెంటనే "మాసి" "కన్పించి వద్దాం"అని ఆయనున్న హోటీకి వెళ్ళగానే అదెరె రామారావు జీ "నమస్కార్" అని శ్రీ రాజీవ్‌గాంధీ పలకరించారని తాను ప్రతినమస్కారం చేశానని శ్రీ రామారావు తెలిపారు.

ఎన్నికల పర్యటనకు వచ్చారా? అని ఆయన ప్రశ్నిస్తే అవును మీకు తెలియదా ఈ రోజు ఇక్కడమాబహిరంగ సభ జరిగిందికదా! అని జవాబు చెప్పినట్లు ఆయన చెప్పారు. నేను కూడా ప్రచారానికి వచ్చాను అని మాజీ ప్రధాని అంటుండగానే ఎయిర్‌పోర్టు అధికారులు సార్ విమానం టైం అయిందని చెప్పగానే వెళ్తాం అని సెలవు తీసుకొనేముందు మీరు ఎలా వెళ్తారు? అని అడిగానని అయితే "నా చిన్న విమానం ఉందిగా" "దానితోనే మిమ్ముల్నిఓవర్‌టెక్ "చేయాలనుకుంటున్నానని రాజీవ్‌గాంధీ చెప్పారని దానికి బదులుగా ప్రజలిచ్చిన ఆయుధం పదునుతో మిమ్ముల్ని ఎదుర్కొంటాం అని సమాధానం చెప్పి తామిద్దరం నవ్వుకుంటూ అక్కడినుంచి వెళ్ళిపోయినట్లు శ్రీ రామారావు చెప్పారు. శ్రీ రామారావు రాజీవ్‌గాంధీతో జరిగిన సంభాషణ ఎంతో ఉత్సాహంతో నవ్వుకుంటూ పత్రికలవారికి ఓపికగా వివరించారు.

'దేవీ' భాగోతం

(1వ పేజీ తరువాయి)

మోసపుచ్చి ఈ మధ్య మరో యువతిని పెండ్లి చేసుకోడానికి ప్రయత్నించగా తాను పోలీసు ఉన్నతాధికారులతో మొర పెట్టుకున్నానని, వారు తగిన చర్య తీసుకుని శ్రీ డి.రామకృష్ణయ్య ఆధ్వర్యంలో తమకు నిర్మల్ పట్టణం డి.ఎస్.పి కార్యాలయంలో వివాహం జరిపించినట్లు శాంత తెలియజేశారు.

అయితే శాంత తనకు తెలియదని బలవంతంగా పోలీసులు తనకు పెళ్ళి చేశారని ఆమె ఒక వేశ్య అని అందుకు తగిన సాక్ష్యాలు తన వద్ద ఉన్నాయని తన ఉద్యోగం పోతుందనే ఉద్దేశంతో తాను ఈ పెళ్ళికి ఒప్పుకున్నానని దేవీలాల్ చెప్పారు.

తనను వివాహం చేసుకుంటానని ఒక లాడ్జిలో కొంతకాలం ఉంచి అనేకసార్లు కొట్టి బాధించాడని, తనకు న్యాయం చేయమని కోర్టుకు అప్పీలు చేసుకున్నట్లు కూడా శాంత తెలిపారు.

శ్రీశైలం కాలువను దర్శించిన ప్రపంచ బ్యాంక్ బృందం

కర్నూలు, ఫిబ్రవరి 22:

శ్రీశైలం కుడిగట్టుకాలువ పనితీరును పరిశీలించేందుకు గత మంగళవారం "ప్రపంచబ్యాంక్ "అధికారుల బృందం కర్నూలు జిల్లాలో పర్యటించింది. శ్రీశైలం కుడి గట్టుకాలువను ఈ బృందం సందర్శించింది. ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సహాయంతో నిర్మితమవుతున్న ఈ కాలువను ప్రతి ఆరు నెలలకు ఒక పర్యాయం ఈ బృందం పరిశీలిస్తుంది. ప్రపంచబ్యాంక్ బృందం నాయకులు శ్రీ పాలుమోరిస్ నాయకత్వంలో రోడ్డు ఇంజనీర్, న్యాయశాస్త్ర నిపుణుడు ఎ.పి. రావు సభ్యులుగా శ్రీశైలం కుడిగట్టుకాలువ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీ గోందరెడ్డి తెలిపారు.

ఐదు ప్యాకేజ్‌ల పని నిర్మాణానికి 43.61 కోట్ల రూపాయలు ఈ సంవత్సరం కేటాయించగా 11.5 కోట్ల రూపాయలు ఇప్పటికి ఖర్చు అయిందని ఏడవ కిలోమీటరు వద్ద నున్న తూడిచెర్ల గ్రామం నుండి 48 వ కిలోమీటరువద్ద నున్న గోరకల్లు రిజర్వాయరువరకు ఐదు ప్యాకేజ్‌ల నిర్మాణం శీఘ్రంగా సాగుతున్నట్లు ఎస్.ఇ. శ్రీ గోవిందరెడ్డి తెలిపారు.

కృష్ణాజలాలే శరణ్యం

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 22:

జంటనగరాల ప్రజల దప్పిక తీర్చడానికి కృష్ణానది నీరే శరణ్యమని నగరానికి చెందిన ఏడుగురు కాంగ్రెస్ మున్సిపల్ కౌన్సిలర్లు గురువారం జరిగిన విలేఖరుల సమావేశంలో డిమాండ్ చేశారు.

1988 వ సంవత్సరంలో రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జంటనగరాలకు కృష్ణానది నీటిని తీసుకురావాలని నిర్ణయించడం జరిగిందని వారు చెప్పారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా నిర్ణయాలు మార్చుకోవడం సబబు కాదని అంటూ 'నోటిదాకా వచ్చిన నీళ్లను' కాదనడం శోచనీయమని వారు అన్నారు. 1988 వ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల సంఘం కృష్ణానది నీరే జంటనగరాల ప్రజల దప్పిక తీరుస్తుందని దీనికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వు 371 ని 1986వ సంవత్సరం జూలై 2వ తేదీన, జి.వో. 438ని 1986వ సంవత్సరం ఆగస్టు 19వ తేదీన జి.వో. 681 డిసెంబర్ 24వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం జారీచేయడం జరిగిందని వారు చెప్పారు. కృష్ణానది జలాలను జంటనగరాలకు తీసుకురావాలని అప్పటి శాసనసభ్యులు, మున్సిపల్ కార్పొరేటర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో చర్చించి నిర్ణయించడం జరిగిందని వారు అన్నారు.

కృష్ణానది జలాలను జంటనగరాలకు తీసుకురావాలని నల్గొండ జిల్లా అక్కంపల్లి వద్ద 40 లక్షల రూపాయల వ్యయంతో రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేయడం జరిగిందని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం గోదావరినదీజలాలను తీసుకవస్తామనడంలో అర్థంలేదని వారు విమర్శించారు.

జంటనగరాల ప్రజలకు కృష్ణానది జలాలను తీసుకరావాలని కోరుతూ ఈనెల 26వ తేదీన నగరంలోని కోఠిలో గాంధీ జ్ఞాన్‌మందిర్‌నుండి పోలీస్ కంట్రోల్‌రూంవరకు పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం అప్పటికీ స్పందించని యెడల తీవ్ర ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు సర్వశ్రీ టి. పద్మారావు, పి. నర్సింగరావు, సి. నారాయణ, బి. లక్ష్మణ్ యాదవ్, యం. నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

గాలిబ్‌కు నివాళి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:

ప్రఖ్యాత ఉర్దూకవి మీర్జాగాలిబ్ 121వ వర్ధంతి సందర్భంగా దేశప్రజలు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాలిబ్ అకాడమీ వద్ద బుధవారం సాయంత్రము ఒక సభ జరిగింది. తిరుగుబాటు కాలంలోనే భారతీయులక్లేశాలను వర్ణించిన గాలిబ్ లౌకిక తత్వాన్ని ప్రజలు అలవరచుకోవాలని ఉపన్యాసకులు కోరారు.

కీ.శే.భాగవతుల రామారావు స్మారకసభ

హైదరాబాదు, ఫిబ్రవరి 22:

సిటీసెంట్రల్‌లైబ్రరీ భవనంలో 24 సాయంత్రం 6గంటలకు శ్రీ బి.పి.ఆర్. విఠల్ కీ.శే. భాగవతుల రామారావు స్మారక ప్రసంగం యిస్తారు. సభకు శ్రీ అల్లాడికుప్పుస్వామి అధ్యక్షత వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ అవార్యకుల్ ఆధ్వర్యంలో యీ సభ జరుగుతుంది.

సభలు-సమావేశాలు

శ్రీరాజరాజేశ్వరి గానసభ

సాయంత్రం 6-30ని.లకు కర్నాటక గాత్ర సంగీతం, శ్రీ కె.ఎస్.ఆర్. బాలకృష్ణశాస్త్రి శ్రీ రాజరాజేశ్వరి సేవాకేంద్ర, ఇన్‌కంటాక్స్‌కాలనీ, మెహిదిపట్నం.

జనతాదళ్, బిజెపిలమధ్య 'చివరిక్షణం చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:

ఈ నెల 27న జరగనున్న శాసనసభల ఎన్నికలకు ప్రచారం తారాస్థాయికి చేరుకొంది. ఎన్నికల ప్రచారానికి ఇంక కేవలం మూడురోజులే గడువుండగా చివరిక్షణంలోనైనా ముక్కోణపుపోటీని ఆపాలని ప్రయత్నిస్తూ జనతాదళ్, భారతీయ జనతాపార్టీలు చర్చలు జరపుతున్నాయి.

వివిధపార్టీల అభ్యర్థులు ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థిస్తుండగా జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులందరూ సుడిగాలి పర్యటనలు జరుపుతున్నారు. ఎన్నికలు జరుగుతున్న మొత్తం 8 రాష్ట్రాలలోను, కేంద్రపాలితప్రాంతమైన పాండిచ్చేరిలోనూ కూడా వివిధ పార్టీల జాతీయనాయకులు ముమ్మర ప్రచారం చేస్తున్నారు.

ప్రధాని శ్రీ వి.పి.సింగ్ జనతాదళ్ అభ్యర్థుల ప్రచారంకోసం బీహార్‌లో పర్యటన జరుపుతుండగా, మాజీ ప్రధాని కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ రాజీవ్‌గాంధీ కూడా అదేస్థాయిలో ప్రచారం గావిస్తున్నారు. వీరిద్దరూ కూడా ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న సుమారు అన్ని రాష్ట్రాలు పర్యటించారు.

సరిగ్గాలేని వాతావరణం, వర్షాలకారణంగా ఒరిస్సా, హిమాచలప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్‌లలో ప్రచారానికి ఆటంకాలు కలిగాయి. అయితే సర్వసాధారణంగా వెళ్లడానికి వీలుకాని ప్రాంతం కూడా పర్యటించి ఓటర్లను అభ్యర్థించడానికి వివిధపార్టీల కార్యకర్తలు కృషి చేస్తున్నారు.

పోలీసులా? కిరాయిగూండాలా

వనపర్తి, ఫిబ్రవరి 22: మహబూబ్‌నగర్ జిల్లా దౌల్తాబాద్ మండలం గోకఫల్సాబాద్ గ్రామంలో హరిజనుడైన దాసరి రామయ్యపై దౌర్జన్యం చేస్తూ, అతడుకొన్నభూమిని దున్నకుండ గ్రామభూస్వాములైన సంజీవరెడ్డి భీమయ్యలడ్డుకుంటూ భూమిని ఆక్రమించుకున్నారని జిల్లా టి.ఎన్.టి.యు.సి. అధ్యక్షుడు శ్రీ నారాయణస్వామి గురువారంనాడు విలేఖరుల సమావేశంలో తెలిపారు. నైజాం రాక్షసత్వాన్ని తలదన్నే విధంగా హరిజన స్త్రీలను భూస్వాములు చెట్లకు కట్టివేసే చిత్రహింసలకు గురిచేశారని శ్రీ స్వామి వివరించారు.

1965లో హరిజనులైన దాసరి రామయ్య, సాయప్ప, భీమప్ప కలిసి అదే గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి సాయిరెడ్డిదగ్గర 17 ఎకరాల భూమిని 18 వేల రూపాయలకు కొని రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారని శ్రీ స్వామి వెల్లడించారు.

శ్రీ జి. నారాయణస్వామి కథనంప్రకారం 1965లో హరిజనులు సర్వే నెం. 348 గల 17 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నప్పటినుండే భూమిని దున్నకుండా సంజీవరెడ్డి, భీమయ్య దౌర్జన్యం చేయడం ప్రారంభించారు. రామయ్య, అతని సోదరులు కోడంగల్ కోర్టుకు వెళ్తే అనుకూలంగా తీర్పు వచ్చింది. అయినా కోర్టు తీర్పును ఖాతరుచేయకుండా పోలీసులఅండతో భూస్వాములు భూములు ఆక్రమించుకొని సాగుచేసుకుంటున్నారని శ్రీ స్వామి ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లాకోర్టుకూడ 1980లో హరిజనుల పక్షాన తీర్పు నిచ్చింది. ఈ తీర్పును కూడా లెక్కచేయకుండా పోలీసుల సమక్షంలోనే హరిజనులను కొట్టి భూమిని దున్నకుండా దౌర్జన్యం చేశారని ఆయన అన్నారు. భూస్వాములనుండి మాకు రక్షణ కల్పించాలని కోడంగల్ పోలీసులకు హరిజనులు మొరపెట్టుకుంటే ఆ భూమిమీది కాదు, మాకు తెలుసు మేము కోర్టు తీర్పులను లెక్కచేయం, అని హరిజనులనే కొట్టి తప్పుడుకేసులు ఎనాయించారు. 1987లో సంజీవరెడ్డి, భీమయ్య కలసి హరిజనుల తలలు పగులగొడితే పోలీసులకు ఫిర్యాదుచేస్తే భూస్వాములపై ఎలాంటిచర్యలు తీసుకోకుండా, హరిజనులనే 8 రోజులు జైలుకు పంపించిన ఘనత కోడంగల్ పోలీసులకు దక్కిందని, భూస్వాములకు కోడంగల్ పోలీసులు కిరాయిగూండాలుగా వ్యవహరిస్తున్నారని శ్రీ స్వామి ఆగ్రహం వెలిబుచ్చారు.

గ్రామాలలో భూస్వాములు రాజ్యమేలుతున్నారని, గోకఫల్సాబాద్ గ్రామంలో పేదప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బ్రతుకుతున్నారని శ్రీ స్వామి ఆవేదన వెలిబుచ్చారు. హరిజనుల భూమి రిజిస్ట్రేషన్ కాగితాలనుకూడా శ్రీ స్వామి విలేఖరులుకు చూపించారు. కోర్టుతీర్పు ప్రకారం పోలీసులు జోక్యం చేసుకొని 17 ఎకరాల భూమిని హరిజనులకు అప్పగించకపోతే కోడంగల్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాచేస్తామని శ్రీ స్వామి హెచ్చరించారు.

ఆ అమ్మాయి నిలువెల్లా బంగారమే!

పారిస్ నుండి దిగిన ఓ బాలిక ఇందిరాగాంధి అంతర్జాతీయ విమానాశ్రయంలో మందగమనంతో నడుస్తుంటే అధికారులు ముచ్చటగా చూస్తున్నారట. అయితే ఆ అమ్మడు బరువంతా తానేమోస్తున్నట్లు పోతూ కన్పించడంతో కస్టమ్స్ అధికారులకు అనుమానం వచ్చి సోదా చేస్తే ఏముంది, ఆరు కిలోల బంగారం ఉంది. దీనివిలువ 20.5 లక్షలు ఉంటుంది.

కేవలం పద్నాలుగున్నర ఏళ్ళ వయస్సున్న కిమ్‌లిమెన్ షిటిజెన్ అనే ఈ ఫ్రెంచి బాలిక లక్సెంబర్గులో స్కూల్లో చదువుకుంటోంది. కిమ్ ఒక్కొక్కటి పదితులాల బరువు ఉండే 50 బంగారు బిస్కట్లను ఒక బెల్టులో చుట్టి నడుముకు పెట్టుకుని ధీమాగా ఇక్కడకు వచ్చింది. గ్రీన్ చానల్ గుండా వెళ్ళబోతుండగా ఆమె అసలు రంగు బయటపడింది. వెంటనే కస్టమ్స్ అధికారులు పట్టుకుని బంగారాన్ని స్వాధీనం చేసుకుని కిమ్‌ను పిల్లల జైలుకు పంపారు.

ఫిబ్రవరి 14న కిమ్ ఇక్కడకు వచ్చినప్పుడు ఒక స్థానికుడితో స్నేహం కుదిరిందట. ఆ వ్యక్తి ఈ పనికి పురమాయించగా, స్నేహం కోసం ఆమాత్రం చేయలేనా అనుకుంది కాబోలు ఈ సాహసానికి పూనుకుంది.

ఒక మైనర్ బాలిక బంగారం స్మగ్లింగ్‌చేస్తూ పట్టుబడడం ఇదే మొదటిసారని కస్టమ్స్ అధికారులు తెలిపారు. ఈ సంఘటన మంగళవారం జరిగింది.

నకిలీ మహిళాపోలీస్ పద్మ.

నకిలీ మహిళాపోలీస్

నిర్మల్, ఫిబ్రవరి 22:(నవవార్త) కరీంనగర్ జిల్లా పెద్దపల్లి గ్రామ ఎరుకల కులానికి చెందిన ఇరవైఏళ్ళ సంవత్సరాల యువతి పద్మ తాను పోలీసు డిపార్ట్‌మెంట్‌కు చెందిన వ్యక్తినని చెప్పి మోసంచేసి డబ్బు వసూలు చేసినందుకు పద్మను అదుపులోనికి తీసుకొన్నట్లు నిర్మల్ డి.ఎస్.పి. శ్రీ డి.రామకృష్ణయ్య తెలిపారు.

ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ పట్టణంలోని హాస్టలులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ఒక మహిళతో తాను వరంగల్ నుండి రహస్య విషయాలు తెలుసుకోవడానికి ఇక్కడికి వచ్చానని, మీ కోర్టుతగాదాలో సహకరిస్తానని, మీ పిల్లలకు ఉద్యోగాలు కూడా ఇప్పిస్తానని కొంత డబ్బు వసూలుచేసిందని, ఉద్యోగాలు ఇప్పిస్తానని పలుచోట్ల డబ్బు వసూలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నిందితురాలు పద్మను అదుపులోనికి తీసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు శ్రీ డి.రామకృష్ణయ్య తెలిపారు.

అప్పడాల ఎగుమతిలో రు. 3.6 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: గత సంవత్సరం ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తులు 5.1 కోట్ల రూపాయల మేరకు పెద్ద ఎత్తున ఎగుమతి చేశారు. ఇది 1987-88లో 3.6 కోట్లు రూపాయలు ఉంది.

ఎగుమతుల్లో గ్రామీణ పరిశ్రమ ఉత్పత్తులకే పెద్ద వాటా లభించింది. ఈ ఉత్పత్తుల్లో అప్పడాలు, తాటిచేప, విస్తరాకులు ఉన్నాయి.

1956లో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కె.వి.ఐ.సి.)ను ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు, అభివృద్ధికిగాను, ఇదే ఉద్దేశ్యంతో పనిచేసే సంస్థల సహకారంతో పనిచేసేందుకు ఈ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కె.వి.ఐ.సి. కార్యక్రమాలను 27 రాష్ట్ర కె.వి.ఐ. బోర్డులు, అఫ్యలియేటెడ్ బోర్డు 1148 సంస్థల ద్వారా అమలుచేస్తున్నారు. అలాగే 1.5 లక్షల గ్రామాల్లో ఉన్న 30,000 కోపరేటివ్ సంఘాల ద్వారా నిర్వహిస్తున్నారు.

కె.వి.ఐ.సి కార్యక్రమాల అమలు బాధ్యతను ఆరుకోవల్ ఖాదీ, గ్రామ పరిశ్రమల అడ్వయిజరీ కమిటీలు తీసుకున్నాయని 1988-89లో ఐ.డి.బి.ఐ. తయారుచేసిన అభివృద్ధి కార్యక్రమాల నివేదికలో తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలను ఇంకా ఎక్కువ స్థాపించాలనే కార్యక్రమంలో భాగంగా కమిషన్ కొత్తగా 34 పరిశ్రమలు స్థాపిస్తోంది.

శింగనమల మండలంలో అభివృద్ధిపనులు

శింగనమల, ఫిబ్రవరి 22(నవవార్త) శింగనమల మండలంలో 1989-90 సంవత్సరంలో వివిధ పథకాల క్రింద అనేక పనులను చేపట్టినట్లు మండలాభివృద్ధి అధికారి శ్రీ యం.వి. నరసింహం తెలిపారు.

రోజ్‌గార్ యోజన క్రింద మండలానికి మొదటి విడతగా రూ. 3,29,557 లు, రెండవ విడత క్రింద రూ. 1,55,353 లు అందగా, రూ. 4,39,200 ల ఎస్టిమేట్లతో 35 పనులు మంజూరయినట్లు, వీటిలో 7 పనులు పూర్తి అయినట్లు, తక్కినవి ప్రోగ్రెస్‌లో వున్నట్లు ఆయన చెప్పారు.

జీవనధార క్రింద మండలంలోని రాచేపల్లి, ఆకులేడు, గురుగుంట్ల, యస్.జి. తాండా, నాగులగడ్డం, తరిమెల గ్రామాలలో 32 బావులు మంజూరు కాగా యిప్పటికి 6 పూర్తి అయ్యాయన్నారు.

ఎస్.సి. యాక్షన్‌ప్లాన్ క్రింద 59 మంది లబ్ధిదారులను గుర్తించి ఒక్కొక్కరికి 6 వేల వంతున రుణాలు మంజూరయ్యాయనీ, డ్వాక్రా పథకం క్రింద తరిమెల, నాగులగుడ్డం గ్రామాలలో ఒక్కొక్క యూనిట్‌కు 15 వేల వంతున రెండు యూనిట్లు మంజూరైనట్లు ఆయన చెప్పారు.

సోషియల్ ఫారెస్ట్రీ క్రింద సన్న, చిన్నకారు రైతాంగానికి 6 వేల 65 మొక్కలను, డి.పి.ఎ.పి. క్రింద 2 వేల సీమరేగు, ఆరువందల మామిడి మొక్కలను పంపిణీ చేసినట్లు ఎం.డి.ఓ. తెలిపారు.

ఇ.ఆర్.డి.పి. క్రింద మండలంలోని 14 పంచాయితీలలో మొత్తం 279 మంది లబ్ధిదారులను గుర్తించి వారికి రూ. 5,87,500 లు మంజూరు చేసినట్లు, యిప్పటికి 172 యూనిట్లు గ్రౌండు అయినట్లు శ్రీ నరసింహం తెలిపారు.

పావలావడ్డీ క్రింద ... శెవెడి, బండమీదపల్లి, ... కల్లుమడి, తరిమెల, ... గుమ్మేపల్లి, సోదనపల్లి, సిడనవాడ, మల్లెగొంది, పీలేపల్లి, ఎర్రాయపేట, నాయనవారిపల్లి, గ్రామాలలో 62 సైక్లోన్ల్లను సరఫరా గావించినట్లు చెప్పారు.

జలధార క్రింద 33 బావులు 50% శాతం సబ్సిడీతో మంజూరైనట్లు, సెస్ క్యాప్ క్రింద పెనకలి, సోదనపల్లి, సలకంచెరువు గ్రామాలలో 9 ... గ్యాస్ ప్లాంట్లు మంజూరైనాయన్నారు తరిమెలలో 300 పొగరాని పొయ్యిలు ఏర్పాటు గావిస్తున్నట్లు ఆయన చెప్పారు.

గ్రామీణ ఖాదీ కుటీరపరిశ్రమల క్రింద తరిమెలలో 30 మందికి, సలకం చెర్లుపునందు 20 మందికి, బండమీదపల్లెలో ముగ్గురికి 20 శాతం సబ్సిడీతో రుణాలు ఒక్కొక్కరికి రెండునుండి మూడువేల దాకా మంజూరైనట్లు ట్రైసం పథకం క్రింద సుమారు వందమందికి వివిధ వృత్తులకుగాను 6 నెలలపాటు శిక్షణనిస్తున్నట్లు చెప్పారు. తెలుగు బాల మహిళా ప్రాంగణం క్రింద 10 మంది మహిళలను కూడా శిక్షణకు పంపినట్లు ఆయన తెలిపారు.

విగ్రహప్రతిష్ఠ

కరీంనగర్, ఫిబ్రవరి 22:(నవవార్త) కరీంనగర్ పట్టణం సప్తగిరి కాలనీలో ఈ నెల 11వ తేదీనుండి 14వ తేదీవరకు శ్రీ కోదండరామస్వామి ఆలయమూర్తి ప్రతిష్ఠామహోత్సవం శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజజీయర్ స్వామిచే వేలాది భక్తుల సమక్షంలో దిగ్విజయంగా నిర్వహించబడినది. శ్రీ అండాల్ మహర్షి, శ్రీ నమ్మాళ్వార్ శఠగోప స్వామి మూర్తులు, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం నాలుగురోజుల కార్యక్రమంలో నిర్వహించబడినవి. ప్రతిష్ఠా కార్యక్రమంలో అత్యంత భక్తిశ్రద్ధలతో వేలాది మంది భక్తులు పాల్గొనగా శ్రీ జీయర్ స్వామి వారికి మంగళాకృతులను, ఆశీస్సులనందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి సహకరించిన భక్తులందరికి శ్రీ జీయర్‌స్వామి శాలువ కప్పి ఆశీస్సులనందజేశారు.

శ్రీశైలం ఎడమకాలువకు అధికప్రాధాన్యత

సూర్యాపేట, ఫిబ్రవరి 22:(నవవార్త) సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు సస్యశ్యామలం చేయగల శ్రీశైలం ఎడమ కాలువకు చెన్నారెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఇందుకై ఎక్కువ నిధులు కేటాయించగలదన్న విశ్వాసాన్ని కాంగ్రెస్ శాసనసభ్యుడు శ్రీ ఆర్. దామోదర్‌రెడ్డి వ్యక్తపరిచారు.

శ్రీ దామోదర్ సూర్యాపేటలో మాట్లాడుతూ పోచంపాడు రెండవదశ పూర్తి చేసేందుకు డాక్టరు చెన్నారెడ్డి ప్రభుత్వం ఎక్కువ నిధులు కేటాయించగలదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కొద్ది కాలంలోనే రాష్ట్ర పురోగతి స్పష్టంగా కనిపిస్తున్నదని, తెలుగుదేశం ప్రభుత్వం తప్పుడు కార్యక్రమం వలన ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాన్ని తిరిగి సరియైన బాటలో నడిపించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఆయన తెలిపారు. ప్రస్తుత కరెంటు కోత తెలుగుదేశం ప్రభుత్వం చలవేనని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం తొందరపాటుతో తీసుకున్న నిర్ణయాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పునఃపరిశీలించి మంచి వాటిని కొనసాగిస్తున్నదని, మిగతా వాటిని పరిశీలిస్తున్నదని ఆయన తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారులపై సాగించిన కక్ష సాధింపు ధోరణులు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉండవని ఆయన అన్నారు.

నక్సలైట్ల విషయంలో శ్రీ చెన్నారెడ్డి అనుసరిస్తున్న విధానం విజయవంతమైనదని శ్రీ దామోదర్‌రెడ్డి ప్రశంసించారు. రెండు రూపాయల కిలో బియ్యం పథకం చెన్నారెడ్డి ఆపివేయనున్నట్లు టి.డి.పి. తప్పుడు ప్రచారం చేశారు. కాని డాక్టర్ చెన్నారెడ్డి ఆర్థిక భారం ఎక్కువైనప్పటికీ ధైర్యంతో కొనసాగిస్తున్నారని, గత ఏడు సంవత్సరాలుగా తెలుగుదేశం ప్రభుత్వం ఇండ్లు లేనివారికి స్థలాలను కేటాయించడంపై నిషేధం విధించగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిషేధాన్ని ఎత్తివేసిందని శ్రీ రెడ్డి తెలిపారు. ఉద్యోగస్తులు, ... కాగానే ఊపిరి పీల్చుకున్నారని ఆయన తెలిపారు. సూర్యాపేటలో రెవిన్యూ డివిజన్ కార్యాలయం, తుంగతుర్తిలో విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం, తుంగతుర్తిలో 132 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణం కొరకు తాను కృషి చేస్తున్నట్లు శ్రీ దామోదర్‌రెడ్డి తెలిపారు. తన నియోజకవర్గంలో రోడ్లు, బస్‌ల కొరకు తాను ప్రయత్నిస్తున్నట్లు శ్రీ దామోదర్‌రెడ్డి తెలిపారు.

అనంతపురానికి నాన్‌స్టాప్ సర్వీస్

ధర్మవరం, ఫిబ్రవరి 22(నవవార్త) సుమారు 80 వేల పైబలుకు జనాభా కలిగిన ధర్మవరం ప్రజల సౌకర్యార్థం ధర్మవరం నుండి అనంతపురానికి 'నాన్‌స్టాప్' సర్వీసును ప్రవేశపెట్టినట్లు ధర్మవరం డిపో మేనేజర్ శ్రీ రామారావు తెలిపారు.

25న విద్యార్థులకు వ్యాసరచనపోటీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22: ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థినీ, విద్యార్థుల వ్యాసరచనశైలిని పెంపొందించే ఉద్దేశంతో 'కళాసరిత'సాంఘిక, సాహితీ సాంస్కృతిక సంస్థ ఈనెల 25వ తేదీన విద్యానగర్‌లోని 'హిందీ మహావిద్యాలయం'లో "స్త్రీలలో సామాజిక స్పృహ" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థాపక కార్యదర్శి శ్రీ మద్దెల దశరథరావు తెలిపారు.

తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలలో జరుగు ఈ పోటీలలో ఉత్తమ రచనలకు ప్రతి భాషలో రెండేసి బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను "కళాసరిత" సప్తమ వార్షికోత్సవంలో బహూకరించనున్నట్లు ... వివరించారు.

కరెంటుకోతతో ప్రజలు ఇక్కట్లు

సూర్యాపేట, ఫిబ్రవరి 22:(నవవార్త) సూర్యాపేట పట్టణంతోపాటు పరిసర ప్రాంతాలలో ఉదయం 6 నుంచి 8 వరకు కరెంటు కోత విధిస్తున్నామని అధికారులు తెల్పుతున్నప్పటికి వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయని, ఈ ప్రాంత ప్రజలు ఆందోళన ప్రకటిస్తున్నారు. పగటిపూట రోజంతా కరెంటు ఉండడం లేదని, రాత్రి 10 గంటల వరకు. కరెంటు కోత అమలు పరుస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారని, ఆదివారంనాడు మహాభారత్ టీవీ సిరియల్ కూడ మాడలేక పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

కరెంటు కోతవలన పైరులు ఎండిపోతున్నాయని కరెంటు మోటార్లు లోవోల్టేజి వలన కాలిపోతున్నాయని రైతులు ఆందోళన ప్రకటిస్తున్నారు. గత సంవత్సరం ఫిబ్రవరిలో ఇంత కరెంటు కోత అమలు పరుచలేదని వారు తెల్పుతున్నారు. గతంలో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు కరెంటు కోతను ఏకధాటిగా విమర్శించిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు తమ హయాంలో కరెంట్ కోత పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పరీక్షల సమయమాసన్నమైనప్పటికీ కరెంటు కోతవలన చదువలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. పారిశ్రామికవేత్తలు, కుటీర పరిశ్రమలవారు గూడ కరెంటు కోతవలన నష్టపోతున్నారు. సూర్యాపేట పట్టణంలో కరెంటు కోతవలన దొంగలబెడద ఎక్కువైపోతుందని గృహస్తులు భయపడ్తున్నారు.

అధికారికంగా 4 గంటలు మాత్రమే కోత విధిస్తున్నామని అధికారులు తెలుపుతున్నప్పటికీ, పగటిపూట 6 గంటలు, రాత్రిపూట 10 గంటల వరకు కరెంటు కోత విధించమని ఆదేశాలు వున్నట్లు తెలుస్తున్నది. ఈ సంవత్సరం వర్షాలు బాగా పడుటవలన బావులలో నీరు పుష్కలంగా వున్నవని, అందువలన రైతులు తమ భూములన్నీ సేద్యం చేస్తున్నారని, ఈ 13 గంటల కాలంలో భూములన్నిటికీ నీరందించలేకపోతున్నారని విద్యుత్ అధికారులు తెల్పుతున్నారు. ఇదిలా వుండగా గృహావసరాలకు సంబంధించి కనెక్షనుకు గతంలో 50 రూపాయల వరకే ఖర్చుకాగా ప్రస్తుతం 550 రూపాయల వరకు ఖర్చు అవుతున్నదని వినియోగదారులు ఆందోళన ప్రకటిస్తున్నారు.

బహిరంగవేలం

కాలపరిమితిగడిచినప్పటికివిడిపించనివద్దులు

1. పుక్‌రాజ్ రామ్‌లాల్‌జైన్, పాన్‌బ్రోకర్ పి.బి.ఎల్. నెం 88/78 1-71-1 పోస్టాఫీసు వీధి, రేణిగుంట వారి తాలూకు కాలపరిమితి గడిచినప్పటికి విడిపించని 1-10-88 నుండి 29-12-88 ది వరకు గల వద్దులు 27-2-1990ది ఉ.గం.లు 10ల నుండి 1-71-1 పోస్టాఫీసు వీధి, రేణిగుంటలో బహిరంగముగా వేలం జరుపబడును

2. బన్వరలాల్ దయాచంద్ గోథా, పాన్‌బ్రోకర్ పి.బి.ఎల్ నెం 36 ●ము. నెంబరు 4, బజారు వీధి, తిరుపతి వారి తాలూకు కాలపరిమితి గడిచినప్పటికి విడిపించని 1-9-88 నుండి 31-12-88 ది. వరకు గల వద్దులు 15-3-90 ది పుదయం గం 10ల నుండి 4, బజారువీధి తిరుపతిలో బహిరంగముగా వేలము జరుపబడును

3. డి. చిరంజీలాల్ జైన్, పాన్ బ్రోకర్, పి. బి.యల్. నెం 154 నెం 4 రు., బజారువీధి, తిరుపతి వారి తాలూకు కాలపరిమితి గడిచినప్పటికి విడిపించని 1-9-88 నుండి 31-12-88 వరకు గల వద్దులు 15-3-90 ది. సాయంత్రం 4 గంటల నుండి నెం 4, బజారువీధి, తిరుపతిలో బహిరంగవేలము జరుపబడును.

4. శ్రీహరి అండ్ కో, పాన్ బ్రోకర్ పి.బి.యల్ నెం. 85 రు, 134 ఆర్. సి.రోడ్డు, తిరుపతి వారి తాలూకు కాలపరిమితి గడిచినప్పటికి విడిపించని 30-6-87 నుండి 18-2-88 ది. వరకు గల వద్దులు 16-3-90 ది. ఉదయం గం. 10 లనుండి 134, ఆర్.సి. రోడ్డు, తిరుపతిలో బహిరంగముగా వేలము జరుపబడును

5. శ్రీ లక్ష్మి అండ్‌కో, పాన్ బ్రోకర్ పి.బి.ఎల్.నెం. 113 రు 191 A, కర్నాలవీధి, తిరుపతివారి తాలూకూ, కాలపరిమితి గడిచినప్పటికి విడిపించని 25-9-86 నుండి 31-12-87 ది వరకు గల వద్దులు 19-3-90 ది. ఉదయం గం, 10ల నుండి 191-A కర్నాలవీధి, తిరుపతిలో బహిరంగముగావేలం జరుపబడును

6. బి.సునీల్‌కుమార్, పాన్ బ్రోకర్ పి.బి.ఎల్. నెం.229 రు,132 ఆర్.సి.రోడ్డు, తిరుపతివారి తాలూకూ కాలపరిమితి గడిచినప్పటికి విడిపించని 23-10-87 నుండి 1-11-88ది వరకు గల వద్దులు 25-3-90ది ఉదయం గం. 10ల నుండి 132, ఆర్.సి.రోడ్డు, తిరుపతిలో బహిరంగముగా వేలం జరుపబడును

కె.వి రామకృష్ణారావు,
ప్రభుత్వము నియమించిన వేలందారు,
11/268, సంతపేట, నెల్లూరు

25న విద్యుత్ కార్మికుల సదస్సు

కర్నూల్, ఫిబ్రవరి 22: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న విలేజ్ ఎలెక్ట్రికల్ వర్కర్ల సమస్యలపై హైదరాబాద్‌లో ఈ నెల 20న ప్రదర్శన, విద్యుత్‌సౌధవద్ద ధర్నా కర్నూల్ డివిజన్ యునైటెడ్ ఎలెక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ నిర్వహించింది. సమావేశానికి శ్రీ ఎస్.మద్దిలేటి అధ్యక్షత వహించారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు చర్చించేందుకు విజయవాడలో ఈ నెల 25న జరగనున్న సదస్సులో ప్రతినిధులు పాల్గొనాలని తీర్మానించారు.

సమావేశం సి.ఐ.టి.యు జిల్లా కార్యాలయంలో జరిగింది. సమావేశంలో సి.ఐ.టి.యు జిల్లా అధ్యక్షుడు శ్రీ టి.షడ్రక్ ప్రసంగిస్తూ విలేజ్ వర్కర్, కాంట్రాక్ట్ వర్కర్, ఎం.ఆర్.టి, ప్రైవేటు ఏజెన్సీల పేరుతో, విద్యుత్ బోర్డు కార్మికులతో వెట్టిచాకిరి వేయిస్తున్నదని విమర్శించారు. సెప్టెంబర్ 1, 1988లో జిల్లా కలెక్టర్ సమక్షంలో విద్యుత్ శాఖ తదితర ప్రభుత్వశాఖ ఇంజనీర్లతో జరిగిన సమావేశంలో ప్రభుత్వశాఖలు క్యాజువల్, అన్‌స్కిల్డ్ కార్మికులను పనికి వినియోగించుకుంటే వారికి గ్రామాల్లో 14 రూపాయలు, పట్టణాల్లో రు.15.50 రూపాయలివ్వాలని ఒప్పుకున్నారు. కాని నిపుణతతో కూడిన పని చేస్తున్న విలేజ్ ఎలెక్ట్రికల్ వర్కర్లకు మాత్రం నెలకు 150 రూపాయలు అంటే రోజుకు వేతనం ఐదు రూపాయలు మాత్రం ఇస్తూ వారు చేసిన నిర్ణయాన్ని వారే ఉల్లంఘిస్తున్నారని, అమలుజరపడంలేదని, ఈ విషయంలో మొదటినుండి పనిచేస్తున్న కార్మికసంఘాలు ఈ సమస్యలు పట్టించుకోలేదని ఆరోపించారు. యునైటెడ్ ఎలెక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరి శ్రీ ఎస్.మద్దిలేటి మాట్లాడుతూ పర్మనెంట్ కార్మికులు సమస్యలతోపాటు దారుణంగా దోపిడీకి గురవుతున్న తాత్కాలిక వర్కర్ల సమస్యలను కూడ పరిష్కరించడం ద్వారానే అందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. సి.ఐ.టి.యు జిల్లా నాయకులు శ్రీ కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి సమైక్య ఆందోళన తప్ప వేరొక మార్గంలేదని, సి.ఐ.టి.యు సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు.

అనంతరం శ్రీ ఎం.సుభాన్ అధ్యక్షులుగా, శ్రీయుతులు ఎ.కృష్ణారెడ్డి, ఎస్. ముసుంపలి, శ్రీ బి.పార్థసారథి ఉపాధ్యక్షులుగాను, శ్రీ ఇ.రామకృష్ణ కార్యదర్శిగా, శ్రీయుతులు వి.సుదర్శన రెడ్డి, బి.రామలింగం, బి.ఎ.గఫూర్‌సాహెబ్, ఎన్.వి.శేషయ్య సహాయకార్యదర్శులుగా, శ్రీ వి.ఎల్లారెడ్డి కోశాధికారిగా, శ్రీ ఎం.వెంకటేశ్వర్లు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కర్నూలు డివిజన్ కమిటీ ఎన్నుకోబడింది.

ఫ్రంట్ పాలనలో దేశ ఐక్యతకు ముప్పు

బెంగుళూరు, ఫిబ్రవరి 22: నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వపాలనలో దేశ ఐక్యత, సమగ్రతలు ప్రమాదంలో పడతాయని దక్షణాదిరాష్ట్రాల కాంగ్రెస్ నాయకత్వం హెచ్చరించింది. ఈ నెల 27 న శాసనసభలకు ఎన్నికలు జరగనున్న సందర్భంగా ఉత్తరాది రాష్ట్రాలకు బుధవారం ఒక విజ్ఞప్తి చేస్తూ వారి విదంగా పేర్కొన్నారు.

నవంబర్ లోక్‌సభ ఎన్నికల అనంతరం దేశంలో నెలకొన్నపరిస్థితిని ఓటర్ల దృష్టికి తీసుకువస్తూ కాంగ్రెస్ కు మద్దతు నీయవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు. శ్రీ రాజీవ్ నాయకత్వం, కాంగ్రెస్ పార్టీ అవసరమని ఈ స్థితి మరింత స్పష్టంగా చెపుతోందని వారు అన్నారు.

ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ చెన్నారెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి శ్రీ వీరేంద్రపాటిల్, గోవా ముఖ్యమంత్రి శ్రీ ప్రతాప్‌సింగ్‌రాణే, పార్టీనాయకులు శ్రీ కరుణాకరన్, శ్రీ ఎ.కె. ఆంథోని, ఆస్కార్ ఫెర్నాండెజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకుడు, బలహీన వర్గాల నాయకుడు 'మల్లు'

రామంతపూర్, ఫిబ్రవరి 22: రాష్ట్ర రాజకీయరంగంలో, కాంగ్రెస్(ఐ) నేతగా అంచెలంచెలుగా ఎదుగుతూ, జాతీయ స్థాయిలో కాంగ్రెస్(ఐ) అధిష్ఠానవర్గ నాయకులతోపాటు ఢిల్లీనేతలు మెచ్చే విధంగా ప్రజలకు సేవలందించిన బలహీనవర్గాల నాయకులు స్వర్గీయ మల్లు అనంతరాములు వస్నజీవిగా నిలిచిపోయారని సిద్దిపేట పార్లమెంట్ సభ్యులు శ్రీ నంది ఎల్లయ్య మల్లు సేవలను కొనియాడారు.

రామంతపూర్ పబ్లిక్‌స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన మల్లు అనంతరాములు సంతాప సభలో ప్రసంగిస్తూ తాను ఢిల్లీలో అనేకమార్లు శ్రీ మల్లును కలిసినప్పుడు ఆయన ఎంతో ఆప్యాయత కనబరిచేవారని, అదే విధంగా అనేక మంది ఉగ్రనాయకులు శ్రీ మల్లు కార్యదీక్షతను కొనియాడేవారని ఆయన అన్నారు.

మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యురాలు శ్రీమతి ఉమాదేవి ప్రసంగించారు. రంగారెడ్డి జిల్లా తరఫున తాను డా. చెన్నారెడ్డితోపాటు మల్లును సత్కరించడానికి తెచ్చిన పట్టుశాలువ అలాగే వున్నదని కారణం ఆరోజు సభకు రాలేకపోయారని, రెండోరోజు శాలువ అందించబోగా ఈసారి సన్మానసభలో ఇవ్వమని నవ్వారని ఆమె గుర్తు చేసుకున్నారు.

దేశంలో బలహీనవర్గాల ప్రజలకు సేవ అందించిన మహానాయకులు డా.బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగ్‌జీవన్‌రామ్, డి.సంజీవయ్యల తరువాత అంతటి మహానాయకుడుగా స్వర్గీయ మల్లు వారి స్థాయికి ఎదిగారని మాజీ మంత్రి శ్రీ కొమ్ము పాపయ్య నివాళులర్పించారు.

కేంద్ర ప్రభుత్వం బలహీనవర్గాల ప్రజల సంక్షేమానికి ప్రవేశపెట్టిన ఎన్నో పథకాలు ఎప్పటికప్పుడు అమలు జరిగేవిధంగా స్వర్గీయ మల్లు చేసిన కృషి ఎనలేనిదని స్టేట్‌బ్యాంకుఆఫ్ ఇండియా డైరెక్టర్ శ్రీ వెంకట్‌నారాయణయాదవ్ వివరించారు.

మామూలు గ్రామసేవకునిస్థాయినుండి మహోన్నతమైన జాతీయనాయకుని స్థాయికెదిగిన స్వర్గీయ మల్లు బాల్యంనుండే ప్రతిభాపాటవాలను చూపించారని శ్రీ కోట వున్నయ్య నివాళులర్పించారు.

ఉప్పల్ మునిసిపల్ చైర్మన్ శ్రీ శివారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ శ్రీ సందయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ కె.కృష్ణ, అప్పిగూడ మాజీ సర్పంచ్ శ్రీ పార్థసారథిరావు, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీ ప్రేమ్‌కుమార్ తదితరులు ప్రసంగిస్తూ స్వర్గీయ మల్లు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జరిగిన సభకు శ్రీ శివారెడ్డి అధ్యక్షత వహించగా శ్రీ సందయ్య ఆహ్వానితులను వేదికపై ఆహ్వానించారు. శ్రీ కోట వున్నయ్య శ్రీ మల్లు చిత్రపటానికి పూలమాల వేశారు.

సభానంతరం నుండి 2 నిమిషాలు ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ మౌనం పాటించారు. (కం)

రక్షణకరువైన విజయ

మిర్యాలగూడ, ఫిబ్రవరి 22: మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ భీమవరం గ్రామంలో ఈ నెల 8న శ్రీమతి విజయ అత్యాచారం జరిపిన 4 వ్యక్తులు ప్రస్తుతం మార్క్సిస్టుపార్టీ కార్యాలయంలో తలదాచుకున్నారని వేములపల్లి మండల కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ వీరారెడ్డి మరి కొందరు కాంగ్రెస్ నాయకులు పట్టణ కాంగ్రెసు కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఆరోపించారు. ఒక ప్రెస్ ... నంతో తమకు ... సంబంధముంలే దని ప్రకటిస్తూనే మరోవైపు నిందితులను, వారిని ప్రోత్సహించిన వారిని రక్షించడానికి ప్రయత్నిస్తున్నారని వారు తెలిపారు. అత్యాచారానికి గురి అయిన శ్రీమతి విజయను నిందితుల భార్యలు వెళిచేశారని వారు ఆమెను రోజు తిడుతున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సమావేశములో పాల్గొన్న శ్రీమతి విజయ మాట్లాడుతూ గ్రామములో పోలీసు పికెట్ ఉన్నప్పటికీ తనకు రక్షణలేదని, నిందితుల బంధువులు రాత్రిపూట తన ఇంటిపై రాళ్ళు వేస్తూ తనను భయపెడుతున్నారని ఆమె తెలిపింది. గ్రామస్తులు కొందరు తనను తిడుతూ, తనపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆమె ఆవేదనతో తెలిపారు.

శ్రీమతి విజయ రక్షణకోసం ప్రస్తుతం గ్రామంలో ఒక హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుల్‌లు ఉన్నారని, ఇంకా అదనపు పోలీసు బలగాన్ని పంపగలమని మిర్యాలగూడ సి.ఐ శ్రీ సీతారాంరెడ్డి తెలిపారు.

కిరోసిన్‌ధర పెరిగింది

అనంతపురం, ఫిబ్రవరి 22 కిరోసిన్ రవాణా రేట్లను ప్రభుత్వం పెంచిన దృష్ట్యా అనంతపురం జిల్లాలో కిరోసిన్‌ధరలు స్వల్పంగా పెంచామని జిల్లా కలెక్టర్ ప్రకటించారు. అనంతపురం జిల్లాలోని వివిధ పట్టణాల లోని కిరోసిన్ వినియోగదారులు ఆయా పట్టణాలలోని కిరోసిన్ విక్రయరేట్లను రెవెన్యూ అధికారుల ద్వారా తెలుసుకొని కిరోసిన్ కొనుగోలు చేయాలని ఆయన కోరారు. (వి)

దొరికిన దొంగలు

నిర్మల్, ఫిబ్రవరి 22:(నవవార్త) నిర్మల్ పట్టణంలో ఫారెస్ట్‌రేంజి అధికారిగా పనిచేస్తున్న శ్రీ లింగారావు ఇంటిలో చొరబడి మూడువేల మూడు వందల రూపాయలు దొంగిలించిన ఆరుగురిలో భైంసాకు చెందిన నలుగురు దోపిడీ దొంగలను అదుపులోనికి తీసుకొన్నట్లు నిర్మల్ డి.ఎస్.పి. శ్రీ డి.రామకృష్ణయ్య తెలిపారు.

ఉత్తూరోల్ల గణేశ్, ఆకుల కేశవులు, ఆరెల్ల కిషన్, ఆకుల గణేశ్‌లతోపాటు మరో ఇద్దరు దోపిడీ దొంగలు ఇటీవల శ్రీ లింగారావు నిర్మల్ పట్టణంలో లేని సమయంలో ఇంటిలో చొరబడి డబ్బు దొంగిలించారని పెట్రోలింగ్‌కు వెళ్ళిన తమ సిబ్బంది అనుమానాస్పద పరిస్థితులలో వారిని పట్టుకొన్నారని, స్థానిక ఇందిరానగర్‌లో మరో ఇంటి దొంగతనానికి కూడా వారికి సంబంధమున్నట్లు వారు ఒప్పుకొన్నారని ఆయన పేర్కొన్నారు.

కేసు నమోదు చేసుకొని నలుగురిని అదుపులోనికి తీసుకొని పరారీలో ఉన్న ఇద్దరికొరకు గాలిస్తున్నట్లు శ్రీ డి.రామకృష్ణయ్య తెలిపారు.



రేంజర్ ఇంటి దోపిడీదొంగలు

గోధుమల కేటాయింపు

అనంతపురం, ఫిబ్రవరి 22: పౌర సరఫరాల కమీషనర్, ఫిబ్రవరి 90 మాసమునకు ప్రజా పంపిణీ విధానం క్రింద భారత ఆహార సంస్థ, అనంతపురం జిల్లాకు 300 మెట్రిక్ టన్నులు గోధుమలు కేటాయించడం జరిగింది. ప్రజాపంపిణీ విధానం క్రింద గోధుమలు కార్డుపై మనిషికి ఒక్కింటికి కనీసం 2 కేజీలు చొప్పున, గరిష్ఠం 25 కేజీలు చొప్పున పంపిణీ చేయు నిమిత్తం కేటాయించడం జరిగిందని జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీ ఎస్.నరసింహులు తెలిపారు.

బియ్యం కేటాయింపు ఉత్తర్వులకు సంబంధిత శాసనసభ్యులకు, ఆహార సలహా సంఘపు సభ్యులకు, విజిలెన్సు డి.ఎస్.పి. గారికి, జిల్లా ప్రజాపరిషత్ అధ్యక్షులకు, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులకు తెలియచేయవలసియుంటుందని జిల్లా పౌరసరఫరాల అధికారి తెలియచేశారు. (వి)

దేశవ్యాప్తంగా హిందీవ్యాసరచన పోటీ

ఆగ్రా, ఫిబ్రవరి 22: ఆగ్రాలోని ప్రభుత్వ కేంద్ర హిందీ ప్రచారసంస్థవారు ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా హిందీయేతరులకు నిర్వహిస్తున్న హిందీ వ్యాసరచన పోటీలను ఈ సంవత్సరం కూడా నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో పాల్గొనే అభ్యర్థులు హిందీతోపాటు బి.ఎ. డిగ్రీ పూర్తిచేసినవారై వుండాలి. 'భారతీయ సంస్కృతిని నడిపించే వాహనం హిందీ' అనే అంశంపై వ్యాసం రాయవలసి వుంటుంది. మార్చి 30 వ్యాసాలను పంపే చివరి తేదీ. ఉత్తమ వ్యాసకర్తలకు ఐదువందలు, నాలుగువందలు, మూడువందల రూపాయలను మూడు బహుమతులుగా అందచేస్తారు. స్వంత చిరునామా గల కవరును పంపుతూ డైరెక్టర్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిందీ, హిందీ సంస్థాన్‌మార్గ్, ఆగ్రా-282005 అనే చిరునామాకు పంపి వివరాలు తెలుసుకోవచ్చు.

ఎన్.సి.సి. పరీక్షల పర్యవేక్షణ

కరీంనగర్, ఫిబ్రవరి 22:(నవవార్త) వరంగల్ ఎన్.సి.సి. కేంద్ర కార్యాలయం గ్రూప్ కమాండర్ శ్రీ అనుపమ్ పురోహిత్ గత మంగళవారంనాడిక్కడ, ఎన్.సి.సి. 9వ బెటాలియన్‌ను సందర్శించారు.

ఎన్.సి.సి. సర్టిఫికెట్ వార్షిక పరీక్ష పర్యవేక్షణకు గాను ఆయన ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా శ్రీ పురోహిత్ ఒక సైనిక సమ్మేళనాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. 1964లో సైన్యంలో చేరిన శ్రీ పురోహిత్ 1965లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో పాల్గొన్నారు.

ఎన్.సి.సి. విభాగానికి వచ్చిననాటి నుండి పురోహిత్ ఇండో-కెనడా యువ ఎక్స్చేంజీ కార్యక్రమంలో ప్రముఖ పాత్ర వహించారు. కర్నల్ పురోహిత్‌కు స్థానిక ఎన్.సి.సి. కార్యాలయం వద్ద 9వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ శ్రీ బి.ఎన్.మెహతా తదితర అధికారులు స్వాగతం పలికారు.

పురపాలకసంఘకార్యాలయము, మదనపల్లె

ఆర్.ఒ.సి.నెం.2787/89-ఇ1, తేది: 15-2-1990

టెండరు నోటీస్

ఈ క్రింది కనుబరచిన పనులు చేయుటకు గాను మునిసిపల్ రిజిష్టరు కాంట్రాక్టర్ల వద్ద నుండి గరావత్తులతో సహ సీలు వేయబడిన టెండర్లు 9-3-1990 తేది శుక్రవారము సాయంత్రము 4-00 గంటల వరకు మదనపల్లె మునిసిపల్ కమీషనరు వారిచే గాని లేక వారిచే అనుమతి పొందిన వారిచే గాని స్వీకరింపబడి సదరు టెండరు అదేరోజ సాయంత్రము 4-30 గంటలకు హాజరైన టెండరుదార్ల సమక్షములో తెరువబడును. టెండరు షెడ్యూలు ఫారములు 7-3-1990 తేది బుధవారము వరకు నిర్ణయించిన రుసుము మున్సిపల్ ఖజానాలో చెల్లించి పొందవచ్చును. టెండరు ధరావత్తు తేది 8-3-1990 గురువారము లోపల చెల్లించి రసీదు టెండరుకు జతపరచవలెను. మిగత విషయములు ఆఫీసు పనిచేయు వేళలలో వచ్చి తెలుసుకొనవచ్చును.

వ. నెం.	పనియొక్క పేరు	అంచాజ అంచనా	చెల్లించవలసిన ధరావత్తు	షెడ్యూలు ఫారం వెల
1.	మదనపల్లె పురపాలక సంఘ పరిధిలో కాలువలు కట్టుట, రోడ్లువేయుట, బోరింగులు వేయుట, పంపు రూములు కట్టుట మొదలగు పనులకు 13 విడి అంచనాలతో.	రూ.1,85,540	—	—

(సం.) డి. వెంకటేశ్వర్లు,
కమీషనరు.

ఈ సీరియల్ సమర్పిస్తున్నవారు MINAR FANS

మరో మన్వంతరం 17

బొల్లిముంత నాగేశ్వరరావు

మరుదినం ఆనంద్ పుట్టినరోజు. వేడుకలన్నీ గెస్ట్ హౌస్‌లోనే.....

'మీ పుట్టినరోజు పండక్కి ఎవరైనా పాట పాడితే ఎలా వుంటుందండీ!'

'చాలా బాగుంటుంది! మీరే ఎందుకు పాడకూడదు.'

'అమ్మో! ఆంజనేయుడి ముందు కుప్పిగంతులు వేసినట్టుంటుంది.'

విరగబడి నవ్వాడు ఆనంద్ తర్వాత.

'శైలజగారూ! నాకు పుట్టినరోజు పండుగలంటే అంత యింటరెస్టింగ్ ఏం ఉండదు! చుట్టూ వున్న వారి బలవంతం మీద ఏదో అయినట్లూ పోయినట్టూ... రేపు జరగబోయే పుట్టినరోజుకు మీరు వస్తే మాత్రం అదెంతో నిండుగా వుంటుంది.'

'ఎందుకని?'

'ఎందుకనేముందండీ! అందమైన సరోవరానికి హంసతోటే నిండుదనమొస్తుంది. మనోహరమైన పూతోటకు మందారాలతోటే నిండుదనమొస్తుంది.'

శైలజ ఆ మాటలకు పెద్దగా నవ్వింది.

'ఎందుకలా నవ్వుతారు?'

'పాడటంలోనే మీరు గొప్పవాళ్లనుకున్నాను. పిచ్చి కవిత్వం చెప్పటంలో కూడా ....'

శైలజ మాటలు పూర్తి కాకుండానే-'కవిత్వం పిచ్చిదో, మంచిదో నాకైతే తెలీదుగాని శైలజగారూ! రేపు మీరు రాకపోతే మాత్రం నేను నిజంగానే పిచ్చివాడినవుతాను.'

ఈ మాటలతో శైలజ కంపించింది!

'రియల్లీ?'

'యస్... రియల్లీ.'

'ఎందుకలా?'

'ఐ లవ్ యూ'

ఆనంద్ ఆ మాటలని మెల్లిగా వెళ్లిపోయాడు అతను వదలి వెళ్లిన ఆ మాటలు మాత్రం ఆమె గుండెల్లోకి జెట్ వేగంలో దూసుకుపోయాయి. అవి ఆకాశమంత విశాలంగా వుంటాయనీ, హిమాలయా అంత బరువుగా వుంటాయనీ, పసిఫిక్ అంత లోతుగా వుంటాయనీ, ఆ మాటలు తగిలిన మొదటి క్షణాల్లో ఒక ఆడపిల్ల హృదయం అదోలా అయిపోతుందనీ ఆమెకు అప్పుడే మొదటసారిగా తెలిసింది!

అనూహ్యంగా వచ్చిన విజయ్ బదిలీ 'రసమయి' సభ్యులందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది!

ఆ రోజు సాయంత్రం రసమయి తన భవంతిలో అతనికి పార్టీ ఎరేంజ్ చేసింది. దానికి పుర ప్రముఖుల్ని కూడా ఆహ్వానించింది.

శ్రీధర్, కొండలరావు కూడా దానికి ఎటెండ్ అయ్యారు.

అందరం మరోసారి ఒకచోటకు చేరామన్న ఆనందం ఉన్నా, తన మధ్యనుండి ఒక మనిషి దూరంగా వెళ్లిపోతున్నారనే బాధ చాలామందిలో వుంది. ఆయన బదిలీ 'రసమయి'లో కొందరికి ఆనందం కలిగించింది. అలాంటి వారిలో ముఖ్యుడు సుందరం! సుందరం ఈ మధ్య ఒక వర్గాన్ని కూడ గట్టాడు. లేకుంటే 'రసమయి' లో తన ప్రాబల్యం రోజు రోజుకీ దిగజారటం మొదలయ్యింది.

ఖరీదైన మనుష్యులుండాల్సిన 'రసమయి' రైల్వే కళాసీ స్థాయికి ఎందుకు దిగజారాలని సుందరం అవకాశమొచ్చినప్పుడల్లా తన మిత్రుల్తో వాదిస్తుండేవాడు. ఇటీవల విజయ్ రైల్వే కళాసీలను కూడా 'రసమయి'లో సభ్యులుగా చేర్చాడు. అది కొందరికి నచ్చలేదు. అయినా ఎవరూ ఎదురు చెప్పలేదు.

'విశిష్ట వ్యక్తుల స్థాయి' జముకుల పాటల స్థాయికి దిగజారటం...

'మంగళంపల్లి లాంటి మహోన్నత వ్యక్తులకు అందాల్సిన రాగసుధ అవార్డు మాసిపోయిన గుడ్డలు ధరించిన ఓ అనామకుడు తీసుకెళ్లటం...'

'వెండి తెర నిండు జాబిలి తళుకులు తోలుబొమ్మల్లోకి పడిపోవటం...'

'విజయకుమార్ తోలుబొమ్మలాట వాళ్లను కూడా ఇటీవల సన్మానించాడు. ఇదంతా ఇప్పటి వరకూ సుందరానికున్న ఆవేదన-'

ఈ రోజు తనకే తెలిని రిలీఫ్!

ఇలా అనుకోకుండా దొరికిన ఈ ఆనందం విజయ్‌కి కనపడనీయకుండా దాచాలని సుందరమే పదే పదే తన విచారాన్ని ఆయన సమక్షంలో వ్యక్తీకరించటం మొదలెట్టాడు!

ఆహ్వానించబడిన వాళ్లందరూ వచ్చారు.

సుందరం చురుగ్గా పనిచేస్తున్నాడు. కొండలరావును చూస్తూ చిరునవ్వుల్ని చిందిస్తున్నాడు.

పార్టీ బఫే పద్ధతిలో సాగిపోయింది. వచ్చిన మిత్రులందరూ ఆయనకు సెండాఫ్ శుభా కాంక్షల్ని అందించి వెళ్తున్నారు.

శ్రీధర్, కొండలరావు కూడా విజయ్‌కుమార్‌తో కాసేపు ఇష్టాగోష్టిగా గడిపారు.

'రాగసుధ ఒక గొప్ప ప్రోగ్రాం. ఎవరూ ఇవ్వలేని విధంగా మొదటి బహుమతి ఇచ్చారు.'

కొండలరావు మాటలకి విజయ్‌కుమార్ నవ్వాడు

'నేను కాదండీ ఇచ్చింది! మీ పుర ప్రజలే ఇచ్చారు. ఏ పట్నంలో జరిపినా ఆ బహుమతిని అలాగే యిస్తారు.'

కొండలరావు మాట్లాడలేదు.

'ఇప్పుడా విషయాలెందుకు లేవయ్యా' శ్రీధర్ అడ్డుపడ్డాడు.

'ఆ విషయాలు ఎప్పుడు మాట్లాడుకున్నా తప్పేం ఉండదు! ఆనంద్ కొస్తుందనుకున్న బహుమతి అప్పటివరకూ మనం చూడని సాగర్ కొట్టేశాడు. సాగర్‌లో వున్నది ప్రజల భాష, ప్రజల సంగీతం, ఆనాడి అందరికి తెలీదు! ఆ నాడే మీ ఆనంద్ పట్టుకోగలిగితే- మంచి ఆటగాడే కాకుండా పాటగాడవుతాడు. ఈ విషయాల్ని వివరిద్దామంటే మరలా మీ ఆనంద్ కనిపించలేదు.'

విజయ్‌కుమార్ చెప్పుకుపోతున్నాడు.

ఏ ఆనంద్ తనకు కనిపించలేదని విజయ్‌కుమార్ అంటున్నాడో.. ఆ ఆనంద్-

సరిగ్గా అదే సమయానికి- పట్నానికి బయట వున్న తన గెస్ట్ హౌస్‌లో మిత్రుల్తో ఇంతకంటే ఖరీదైన ఖుషీ పార్టీలో వున్నాడు.

(ఇంకా వుంది)



అశేష యాత్రికులను ఆకర్షిస్తున్న 'దక్షిణకాశి' పెదకళ్లేపల్లి

మహాశివరాత్రి సందర్భంగా ఏటా అయిదు రోజులపాటు పెదకళ్లేపల్లిలోని శ్రీ దుర్గానాగేశ్వరస్వామి క్షేత్రంలో జరిగే ఉత్సవాలు ఈ సంవత్సరం 21వ తేదినుండే మరింత ఘనంగా జరుపుతున్నారు. ఈ ఉత్సవాలకు ప్రతి ఏడాది వేలాదిమంది భక్తులు ఇక్కడకు తరలి రావటం జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో బహుపురాతనమైన క్షేత్రాల్లో శ్రీ దుర్గానాగేశ్వరస్వామి క్షేత్రం ఒకటి అని చెబుతారు.

పెదకళ్లేపల్లి కృష్ణాజిల్లా యందలి దేవరకోట సీమలోని చల్లపల్లి మండలంలో పురాణేతిహాస ప్రసిద్ధి గాంచిన గ్రామము. ఈ పురమున కశ్యప ప్రజాపతి పుత్రులగు కర్కోటక, వాసుక, తక్షక, శంఖచూడ, ధృతరాష్ట్ర, శంఖపాల, ధనంజయ, పింగళులను అష్టఫణిరాజుల తల్లియగు కద్రువ శాపవిముక్తికై ఒక శిలావేదికను నిర్మించి నాల్గు ప్రక్కల నాచ్ఛాదనగా నుండుటకై కదళీ తరువుల బారుకొల్పి ఈశాన్య భాగమున గోముఖ ఆకారములో నొక సరోవరమును నిర్మించిరి. వారు ఆ సరోవరమునందు స్నానమాచరించి యనుష్టానముల నిర్వర్తించుకొని శివుని పూర్వోక్త మండవ మధ్యమున బ్రతిష్టించి నియమముగ ప్రతి దినము పూజచేయుచుండిరి. అంతట శివుడు గన్నులకు మిరుమిట్లు గొలుపుచు అంబరతలము వరకు వ్యాపించిన శరీరము యొక్క ఒత్తిడికి ప్రక్కలనున్న కదళీ షండంబులెల్ల ఫెళఫెళారావంబులతో నొక్కమారు క్రిందబడ, శ్రీ దుర్గా పార్వతీ సమాలింగిత దేహుడైన లింగ మధ్యమున యావిర్భవించెను. వారును ఆ మహారభసంబునకు కులికిపడి వింతగొని ఒకరినొకరు హెచ్చరించుకొనుచూ, "కదళీ" "కదళీ" అని కేకలిడసాగిరి. చంద్రశేఖరుడు వారి అమాయకత్వమునకు సంతసించి శాపంబునకు భయపడ వలదు. ఆస్తీకుడు మిమ్ము జనమేజయ యజ్ఞవాటంబున రక్షించగలడు. కావున మీరు నిశ్చింతగా నుండుడు. మరియు నేనుద్భవించు సమయమున మీరు ఆశ్చర్యము నొంది "కదళీ" "కదళీ" యని కేకలువైచిరి గాన మీ మాటలు ఆచంద్రతారకముగా నుండునట్లు ఇక్కడ "కదళీపుర" అనుపేర ఒక పురము కీర్తి గాంచునని యంతర్ధానమయ్యెను. అప్పటినుండీ ఈ గ్రామము "కదళీపురము" అని ప్రసిద్ధి గాంచినది.

కాశీ క్షేత్రమందు గంగ యెట్లు ఉత్తరవాహినియో ఇచ్చట "కృష్ణానది" అట్లే ఉత్తరవాహిని. అది ఆనందవనము, ఇది కదళీ వనము. అచ్చట విశ్వేశ్వరుని వలే నిచ్చట క్షేత్రస్థుడు శ్రీ దుర్గా పార్వతీ సహిత నాగేశ్వర క్షేత్రజ్ఞుడు, కాలభైరవుడు, క్షేత్రపాలకుడు కాశీక్షేత్రమందు బిందుమాధవుని వలే నిందు మదనగోపాలస్వామి. అచట మణికర్ణిగా కుండము, ఇచ్చట నాగకుండము. అందువలన ఈ గ్రామమునకు "దక్షిణకాశి" అని ప్రసిద్ధి కలిగెను. నాగేశ్వర స్థావరమగుటచే దీనిని కర్కోటక క్షేత్రమనియు అందురు.

ఈ కదళీపుర క్షేత్ర (పెదకళ్లేపల్లి) మహాత్యము అగస్త్య మహర్షి శ్రీరామ చంద్రునకు చెప్పినట్లు పురాణమునందు గలదు.

ఈ కదళీపుర క్షేత్రమునకు తూర్పు నకృష్ణానదియు, దక్షిణమున శ్రీ సీతారామ క్షేత్రమయిన అయోధ్యయు, పశ్చిమమున అగస్త్య మహర్షి ప్రతిష్ఠితయగు ఓకువనము అని పేరుగల శ్రీ రామేశ్వర క్షేత్రమును, ఉత్తరమున కదళీకారణ్యమును సరిహద్దులై ఉన్నవి. మరియు ఈ క్షేత్రము కాశీ క్షేత్రము వలెనే దక్షిణోత్తరముల "కృష్ణాభీమరథి" మధ్యస్థమై పంచకోశ విస్తీర్ణము కలిగియున్నట్లు సాంబపురాణము ఉత్తరఖండంలో -

కృష్ణాభీమారథీ మధ్యే సర్వతీర్థ విరాజితమ్
పంచక్రోస సమాకీర్ణం- కదలాషండ మండితమ్

అని చెప్పబడింది. ఈ కదళీ పురమున విశ్వామిత్రుడే గాక వశిష్ట మహర్షి కూడా తపస్సు చేసినట్లు తెలియుచున్నది.

అనగా కృష్ణానది యెచ్చట ఉత్తరవాహినిగా ప్రవహించుచున్నదో, శ్రీ నాగేశ్వరస్వామి యెచ్చట వెలసియున్నాడో అదియే శ్రీ నాగేశ్వరస్వామి క్షేత్రము. దీనినే కర్కోటక క్షేత్రమని కూడా అందురు. ఇచ్చట గల శివ లింగము కర్కోటకుడగు సర్పరూపమున నుండును. మొదట ఈ లింగమును వశిష్ట మహర్షి పార్వతీ దుర్గా దేవేరులతో గూడా పూజించెను. ఈ వశిష్ట విశ్వామిత్రులు ఇరువురు కలహించిరి. ఈశ్వరుని గురించి వశిష్టుడు తపంబొనర్చి సిద్ధుడైనందున విశ్వామిత్రుడు వేణుగాన ప్రియుడైన విష్ణుని గొలిచి ప్రతిష్టించి సిద్ధుడయ్యె. అందువలన ఈ క్షేత్రము కర్కోటక క్షేత్రమని, విశ్వామిత్ర క్షేత్రమని కూడా ప్రసిద్ధి అయినట్లు తెలియుచున్నది. మరియు నీ నాగేశ్వరాలయమున ఉత్తరభాగమున నాగకుండము కలదనియు, దీని ఉత్తరమున బ్రహ్మ, రుద్రకుండములు గలవనియు, నీటి మహిమ యద్భుతమైనదనియు, భగీరథియందు ఆరువేల సంవత్సరములు స్నానమొనరించిన కలుగు ఫలము ఈ కుండలముల నొక్కమారు మునిగిన కలుగుననియు, అందువలన ఇంద్రాది సర్వదేవతలును, ఋషులను ఈ కృష్ణా స్నానాభిలాషులై ఇచ్చట వసించురనియు, ఎక్కడ సముద్ర తీర్థముతో నదీజలములు సంగమించునో అక్కడ సర్వతీర్థములు సన్నిహితములై యుండుననియు ఫలశ్రుతి చెప్పుచున్నది. మరియు నాగేశ్వర దేవుని దృష్టిచేత పవిత్రమైన కృష్ణానది యొక్క ఉత్తరవాహిని యందు స్నానము చేసిన వారికి "పునర్జన్మ" ఉండదని స్కంధపురాణమునందు గలదు.

శ్రీ నాగేశ్వరాలయమునకు దక్షిణ పార్శ్వమున శ్రీ వీరభద్రాలయమును, వామపార్శ్వమున దుర్గాదేవి ఆలయమును, ఉత్తరదిక్కున దక్షిణాభిముఖంగా పార్వతిదేవి ఆలయమును, కాలభైరవ ఆలయమును, నైరుతి దిక్కున శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరాలయమును, ఈశాన్యమున నాలుగు అంగణముల కళ్యాణమండపమును ముందు సుందరమైన అయిదంతస్థుల గాలిగోపురము గలవు. ఈ ఆలయభాగముననే పూర్వము జనమేజయుండు సర్పయాగము చేసెనని పురాణములు వలనను, శాసనములు వలనను తెలియుచున్నది.

ఈ నాగేశ్వర లింగము స్వయంభవమనగా నితరులచే ప్రతిష్టింపబడక, స్వయముగానే పుట్టినదని చెప్పుటకొక కథ కలదు. పూర్వం ఒకప్పుడు దేవరకోట (చల్లపల్లి) సంస్థానాధిపతులగు అంకినీడు ప్రభువు స్వామివారి గర్భాలయము పల్లముగా ఉన్నందువల్ల అందు అభిషేక తీర్థము నిలుచుచుండినందువలన స్వామిని, త్రిపీఠములను ఎత్తుగా కట్టించి పునఃప్రతిష్ట చేయు కోరికతో త్రవ్వింపగా గర్భాలయమందే గాక, దేవాలయావరణ మంతయు నొకేశిల చుట్ట చుట్టుకొని యుండునట్లు కన్పించగా, ఆ పని సాధ్యము కాదని మానుకొనిరట ! నేటికినీ స్వామి వారు గుంటలోనేయుండుట చూడనగును.

శ్రీ దుర్గానాగేశ్వరస్వామి ఆలయం క్రీ.శ. 1292 లో సోమశివాచార్యుల వారు కట్టించిరి. క్రీ. శ. 1782 లో తిరిగి దేవరకోట (చల్లపల్లి) ప్రభువులగు శ్రీ రాజా యార్లగడ్డ కోదండరామన్న దేవాలయ జీర్ణోద్ధరణ గావించి పెక్కు ఈనాములు ఇచ్చిరి. వారి అనంతరము వారి మూడవ కుమార్డు "పెదన" వరగణాధిపతి శ్రీ రాజా నాగేశ్వరనాయుడు బహద్దూర్ క్రీ. శ. 1795 లో గోపుర ప్రాకారము కట్టించిరి. నాటినుండి ఈ దేవాలయమునకు వంశపారంపర్య ధర్మకర్తలుగా చల్లపల్లి రాజాలే ఉంటూ వస్తున్నారు.

-సిద్దినేని శ్రీమన్నారాయణ

దక్షిణకాశి 'ద్రాక్షారామ' భీమేశ్వరాలయం

దక్షిణ కాశిగా ప్రసిద్ధిగాంచిన "ద్రాక్షారామ" తూర్పుగోదావరి జిల్లా దక్షిణాదినగల అతిముఖ్యమైన పుణ్యక్షేత్రాలలో - ఒకటి. ద్రాక్షారామ శ్రీ భీమేశ్వరాలయం పంచారామాలలో ఒకటైన శివక్షేత్రం. ఇక్కడ సప్తగోదావరులు అంతర్వాహినులై ప్రవహిస్తున్నాయి. చారిత్రక ప్రాధాన్యం కలిగిన శాసనాలెన్నో ఇక్కడ లభిస్తాయి. పురాణ, చారిత్రక ఆధునిక యుగాల శిల్ప కళాభిరామం ద్రాక్షారామం. శ్రీనాథుడు తన భీమేశ్వర పురాణంలో ద్రాక్షారామ ప్రాభవాన్ని, వైభవాన్ని చక్కగా అభివర్ణించారు. నాలుగు ప్రక్కల గల గోపురాల నిర్మాణ వైశిష్ట్యాన్ని అందంగా ఉగ్గడించారు. క్షేత్ర నలుదిశలా గల ప్రకృతి సౌందర్యాన్ని వర్ణిస్తాడు. దక్షిణ నందనవనపాటి "దక్షవాటి" అని శ్రీనాథుడు వర్ణించారు. దక్షుడు యజ్ఞం చేసిన ప్రదేశం కాబట్టే ద్రాక్షారామం అయ్యింది.

రాక్షసుల పీడ ఎక్కువ కావడంతో దేవతలు శివుణ్ణి ప్రార్థించారు. శివుడు అప్పుడు త్రిపురాసుర సంహారం చేశారు.



ఆ రాక్షసుని మెడలోని శివలింగం ఐదు ముక్కలుగా చేధింపబడి గాలిలోకి ఎగసి అయిదు ప్రదేశాలలో పడ్డాయి. ఆ ముక్కలుపడిన అయిదు ప్రాంతాలలోను అయిదు శివక్షేత్రాలు వెలిశాయి. అవే పంచారామాలుగా ప్రసిద్ధి చెందాయి. అమరారామము (గుంటూరుజిల్లా అమరావతి), భీమారామము (గొనుపూడి-భీమవరం) క్షీరారామం (పాలకొల్లు) కుమారారామం (చాలుక్య భీమవరం-సామర్లకోట), ద్రాక్షారామం (ద్రాక్షారామ) అని ప్రసిద్ధిపొందాయి. ద్రాక్షారామ భీమేశ్వరుని సూర్యుడు ప్రతిష్ఠించాడని భీమేశ్వరపురాణం చెబుతుంది. ఇక్కడి శివలింగం ఎత్తు 15 అడుగులు కాగా చుట్టూ రెండతస్తుల ఆలయం వుంది. ఆలయం క్రింది అంతస్తు చీకటి గుయ్యారంగా వుంటుంది. యీ అంతస్తులో ప్రదక్షిణలు చేసి పై అంతస్తు చేరి శివార్చనలు జరపడం ఇక్కడి ఆచారం.

భీమేశ్వర లింగం శిఖరాన గంట్లపడి వుంటుంది. పాశుపతాస్త్రం సంపాదించే సందర్భంలో అర్జునుడు శివునిపై ప్రయోగించిన అస్త్రాలవల్ల ఏర్పడిన తూట్లు వాటిని భావిస్తారు. శివుడు చేధించిన లింగభాగాన్ని ద్రాక్షారామంలో ప్రతిష్ఠింపదలచిన సప్తఋషులు ముహూర్తాన్ని నిశ్చయించి స్థలశుద్ధికై గోదవరిని ఆహ్వానించారు. గోదావరి అంగీకరించి వారి వెంట ప్రవహిస్తుండగా రాక్షసులు యజ్ఞోపకరణాలు ఆ వెల్లువకు కొట్టుకుపోగా రాక్షసుల కోపానికి గురవ్వగా, తుల్యభాగుడు అనే రుషి వారికి మధ్యవర్తిత్వం నెరపి సప్తఋషుల పేర అంతర్వాహినిగా ద్రాక్షారామం చేరడానికి ఒప్పందం చేశారు. ఆ విధంగా వచ్చిన గోదావరి శాఖలు భీమేశ్వరుని సమీపంలో "సప్త గోదావరి" అనే కొలనుగా ఏర్పడిందని భీమేశ్వర పురాణంలోవుంది. శివుని అర్ధాంగి దక్షుని యజ్ఞశాలలో అవమానింపబడి అగ్నికి ఆహుతికాగా శివుడు తన జడనుండి వీరభద్రుని సృష్టించి పంపాడు. వీరభద్రుడు ద్రాక్షారామాన్ని ధ్వంసం చేశాడని పురాణగాథ చెబుతోంది.

ద్రాక్షారామ క్షేత్రం మహిమ తెలిపే మరో గాథ

కాశీ విశ్వేశ్వరునికి ఒకనాడు వ్యాస భగవానుని పరీక్షించాలనే తలువు కలిగింది. ఫలితంగా అనాడు వ్యాసభగవానునికి ఆయన శిష్యులకు కాశీనగరంలో భిక్షలభించలేదు. ఆకలిబాధ భరించలేక కాశీనగరాన్ని శపించడానికి ఉద్యుక్తుడయ్యాడు వ్యాసమహాముని. అపుడు ముసలి ముత్తయిదువ రూపం ధరించి వ్యాసభగవానునికి ఆయన శిష్యులకు భిక్ష అందచేసింది. అన్నపూర్ణాదేవి. అంతట కాశీ విశ్వేశ్వరుడు "కాశీపురం మోక్షాన్ని ప్రసాదించే స్థలమే తప్ప భోగజీవితానికి అనువైన ప్రదేశం కాదని" భక్తులకు తెలియచేశారు. ద్రాక్షారామ భీమేశ్వరుని సేవించినట్లైతే ఇహపరసుఖాలు లభించగలవని అన్నపూర్ణాదేవి వ్యాసునికి, ఆయన శిష్యులకు తెలియచేసారు. అనంతరం వ్యాసభగవానుడు శిష్యబృందంతో కలిసి ద్రాక్షారామం చేరుకొన్నారు. ఇక్కడి భీమేశ్వరస్వామి సేవలో కాశీ వియోగ దుఃఖాన్ని మరిచిపోయారు. భీమేశ్వరస్వామి భక్తులపాలిట కల్పవృక్షం అన్న విషయం వేములవాడ భీమకవి వృత్తాంతం ద్వారా ఋజువు చేస్తుంది.

ఆంధ్రదేశానికి త్రిలింగ దేశమనే నామమడి వుంది. శ్రీశైలం, కాళేశ్వరం, ద్రాక్షారామంలను కలిపి ఆ పేరు వచ్చిందని చరిత్రకారులు చెబుతున్నారు.

భీమేశ్వర ఆలయం విస్తీర్ణం ఆరు ఎకరాల చుట్టూ 12 అడుగుల ఎత్తు గల పెద్దరాతి గోడవుంది. గర్భాలయం రెండు ఆవరణల మధ్య వుంది. ఆలయం నాలుగు దిక్కులలోను 13 స్తంభాల మంగళవారపు మండపం, సప్తగోదావరి మండపాలు,. శంకరనారాయణ ఆలయం, వామనుడు, విశ్వేశ్వరుడు, అన్నపూర్ణ, దుండిగణపతి, నృత్యగణపతి, మాణిక్యాంబ, ఆలయంపై అంతస్తులో వీరభద్రుడు, నటుక భైరవుడు, కాశీలో వలె కుడిచేతిమీద తాండం కలిగిన గజపతి, నాకుళేశ్వరుడు, చతుర్ముఖ బ్రహ్మేశ్వరుడు, క్షేత్రపాలకుడు లక్ష్మీనారాయణస్వామి, విరోపాక్షస్వామి, నటరాజు, సుబ్రహ్మణ్యేశ్వరుడు దుర్గ, కైలాసపతి, వ్యాసుని ఆలయాలతోబాటు భీమేశ్వరుడు కొలువుతీరి వున్నారు.

షుమారుగా 382 శాసనాలు దేవాలయంగోడలపై మనకు కనబడతాయి. ఈ శాసనాలు 11 నుండి 15వ శతాబ్దానికి చెందినవిగా చెబుతున్నారు. పంచారామాలు బౌద్ధకేంద్రాలని, బౌద్ధమతం క్షీణదశలో ఉన్న సమయంలో శైవాచార్యులు ఈ ఆలయాలను చేజిక్కించుకొని శివక్షేత్రాలుగా మార్చారనే కథ కూడా ప్రాచుర్యంలో వుంది. అందుకు నిదర్శనమే భిక్షుపాత్రలు, కుండపెంకులు ద్రాక్షారామ ప్రాంతంలో లభించినట్లుగా చరిత్రకారుల కథనం.

షుమారు ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో భీమేశ్వర క్షేత్రం అలరారుతోంది. కాకినాడనుండి, రాజమండ్రి నుండి ద్రాక్షారామంకు చక్కని రవాణా సౌకర్యాలు వున్నాయి.

ప్రతి సంవత్సరం మాఘశుద్ధ ఏకాదశి రోజున భీమేశ్వరస్వామికి లక్ష్మీనారాయణస్వామికి సూర్యేశ్వరస్వామికి పాంచాహ్నికంగా ధ్వజారోహణ, కళ్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతాయి. ప్రస్తుతం భీమేశ్వరస్వామి ఆలయం దేవదాయ ధర్మాదాయ శాఖ అధీనంలో, పురావస్తు శాఖవారి పర్యవేక్షణలో వున్నాయి. ఈ ఆలయానికి వంశపారంపర్య ధర్మకర్తగా రామచంద్రపురం మునిసిపల్ చైర్మన్ శ్రీ రాజా కాకర్లపూడి రామచంద్రరాజు బహదూర్ కార్యనిర్వహణాధికారిగా శ్రీ పోలకపల్లి రామారావు ఉన్నారు. ప్రస్తుతం ఆలయం కేంద్ర పురావస్తు శాఖవారు "చీకటి కోణం" మరమ్మత్తుల చేపట్టి కళ్యాణం కోసం ప్రత్యేకంగా యాత్రికుల కోసం పదిరోజులపాటు ఆలయదర్శనం కోసం తెరిచారు.

-శృంగారం వెంకట అప్పలాచార్య

వడ్లమిల్లు యజమానిపై రైతుకూలీలదాడి

కదిరి, ఫిబ్రవరి 22: అనంతపురం జిల్లా కదిరి సమీపంలోని గోపాలపురం గ్రామంలో వడ్లమిషన్ (గిర్ని) యజమాని పి.పాపిరెడ్డిపై రైతుకూలీసంఘం, తెలుగుదండు కార్యకర్తలు కొడవళ్ళు, కర్రలతో దాడిచేసి కొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాపిరెడ్డి వడ్లమిషన్ సరిగ్గా నడపకపోవటం మూలంగా నూకలు ఎక్కువ వస్తున్నాయనే నెపంతో 13 మంది దాడి చేశారని ఫిర్యాదులో పోలీసులకు తెలిపారు.

బియ్యం దొంగిలించడంలాంటి అక్రమాలకు పాల్పడుతున్న వడ్లమిషన్ యజమాని పాపిరెడ్డిని రైతులు ఎన్నోసార్లు పట్టుకొని బుద్ధిచెప్పారు. అయినా అతను మానుకోకపోవటం వలన తెలుగుదండు, రైతుకూలీ సంఘం కార్యకర్తలకు చెప్పగా వారు వచ్చి అక్రమాలు ఆపకపోతే బాగుండదని చెప్పి వెళ్ళారు. అదేరోజు పాపిరెడ్డి మద్దతుదార్లకు రైతుకూలీ సంఘం కార్యకర్తలకు వాదోపవాదాలు జరిగాయని, తర్వాత ఏమైందో తెలియదని గ్రామస్థులు తెలియచేశారు.

గాయాలు అయిన పాపిరెడ్డిని అనంతపురం ఆస్పత్రికి తరలించినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ రామచంద్రారెడ్డి తెలిపారు.

దినఫలం

23-2-1990 శుక్రవారం

గంటలపంచాంగం

శ్రీ శుక్లనామ సం. మాఘ మాసం, బ. త్రయోదశి, శుక్రవారం.

1990వ సం. ఫిబ్రవరి 23, శుక్రవారం, శుక్ర. బ. త్రయోదశి: సా.5-27, శ్రవణి : తె. 4-52. వర్జ్యం: ప. 9-04 మొదలు 10-39 వరకు.

1990వ సం. ఫిబ్రవరి 24, శనివారం, శని. బ. చతుర్దశి: సా.4-13, ధనిష్ఠ : రా. 3-59. వర్జ్యం: ప. 8-43 మొదలు 10-15 వరకు.

మేషం: పత్రికాధిపతులా? మేలే. చిత్రరంగాన శ్రమిస్తారా? అనుకూలమే. పంపిణీదారులా అనుకూల సమయమే. విలువగల వస్తువులు సేకరింప ప్రయాణిస్తారా? సాగించండి.

వృషభం : అభిమానులున్నారు. ఆదాయమందు వృద్ధియున్నది. నూతన వ్యక్తులతో పరిచయమున్నది.. ఉద్యోగవతికి ఆస్కారం. రాజకీయంగా ఏదో మేలు చేకూరుట దినవిశేషం.

మిధునం : శుభసమయం. కుటుంబానందమున్నది. అయినవారి సంబంధం నిశ్చయం కానున్నది. చాలకాలంగా నెరవేరని ఒకానొక కుటుంబ వ్యవహారం సానుకూలం కావటం గమనిస్తారు.

కర్కాటకం : మీ ఆదాయంలో లోపంరాదు. సుఖశాంతులకు లోపం లేదు. ప్రజారంగాన ప్రసిద్ధి ఏర్పడగలదు. యత్నకార్యసిద్ధి, నూతన మిత్ర సమాగమం. 'కోర్టు' వ్యవహారాలుంటే విజయమే.

సింహం : ప్రసిద్ధులను కలిసికొంటారు. ధనలోపం ఏమాత్రం రాదు. చాకచక్యంతో పనులు సవరించుకోండి. చిత్రరంగాన సదవకాశాలు లభ్యమవుతాయి.

కన్య: ఇరుగుపొరుగు తగాదాలు రాకుండా చూచుకోండి. వ్యాపార, వ్యవహార రంగాన అనుకూల మార్పులున్నాయి. కొట్టు తిట్టు వ్యవహారాలుండవచ్చు, జాగరూకత అవసరమేగా!

తుల: ధనవిషయంగా ఏ లోపంలేదు. ఆరోగ్యరీత్యా అంతకన్నా లోపంలేదు. ప్రజారంగాన ప్రసిద్ధికి ఆస్కారం. ముఖ్య బంధువుల రాక.

వృశ్చికం : దూరప్రాంతాలకు వెళ్లాలని, అదీ వ్యాపార నిమిత్తముని చేసిన యత్నాలు ఈడేరు సానుకూలం కావటం గమనింపదలచిన అంశం.

ధనుస్సు: అధికారమందు అభివృద్ధి. సుఖశాంతులున్నాయి. ధనలోపం లేదు. సుప్రసిద్ధులతో స్నేహం లభ్యమవుతుంది. గ్రహించాలి. విద్యావేత్తల పరిచయం ఏర్పడనున్నది.

మకరం: నూతన మిత్ర సమాగమం. వ్యాపారీత్యా అనుకూలతగల సమయం. సుఖశాంతులున్నాయి. కళారంగాన ప్రసిద్ధి, చిత్రరంగానుకూలత కొందరకు.

కుంభం: నూతన మిత్ర సమాగమం. రాజకీయరంగాన ప్రసిద్ధుల సహాయం ఏర్పడుతుంది. ఆదాయాన్ని మించిన అయివోజు ఏర్పడుతుంది, గమనించండి.

మీనం: విద్యావేత్తల సహాయం, ఆటపాటలో ప్రావీణ్యత వికాసం, వ్యాపారరంగాన వృద్ధి, చేకూరుట చెప్పదగిన అంశం.

-విద్వాన్ కోటసత్యరంగయ్యశాస్త్రి

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబునకగు దా నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్

ఆంధ్రపత్రిక

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు: 1938–1972

నేపాల్ ప్రజావిప్లవం

శృంఖలాబద్ధుడైన మానవుడు సుషుప్తినుంచి చేతనావస్థకు చేరుకొని సింహనాదం చేస్తున్నాడు. ప్రపంచం ఎల్లెడలా స్వేచ్ఛాభానుడి కిరణస్పర్శతో మానవాళి పులకించి పోతున్నది.

ఉన్నస్థితినుంచి, ఉన్నతస్థితికి చేరుకునే నిరంతర ఆరాటంలో గతంలో రాచరిక వ్యవస్థల మహాప్రాసాదాలను కుప్పకూల్చిన మానవుడు కమ్యూనిస్ట్ కరకుపాలనలను, ఏకపార్టీ నిరంకుశాధిపత్యాలనుకూడా తిరస్కరిస్తున్నాడు. బదాబదలు చేస్తున్నాడు. నేలమట్టం చేస్తున్నాడు.

తూర్పు యూరప్ దేశాలను ముంచెత్తిన ప్రజాస్వామిక ప్రభంజనం సోవియట్ యూనియన్‌ను పావనంచేస్తూ నియంతలపాలనలో మగ్గుతున్న ఇతరదేశాలనుకూడా తాకుతున్నది. ఇండియాకు పొరుగునవున్న నేపాల్‌లో దీని ప్రతిధ్వనులు పటిష్టంగానే వినవస్తున్నాయి.

నేపాల్ ప్రజలలో ప్రజాస్వామిక స్ఫూర్తి వెల్లువై వెల్లుబకడం ఇదే మొదటిసారి కాదు. అయితే ఇంతకు ముందున్నప్పటి కంటె ఉధృత స్థాయిలో ప్రజాస్వామిక తిరుగుబాటు ఇప్పుడక్కడ రూపుదిద్దుకొన్నదని భావించవలసివుంది.

ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పరిణామాల ప్రభావంవల్ల నేపాల్‌లో ఈసారి వీరోచితమైన విప్లవోద్యమం ఆరంభమైందని అనుకోవలసి వున్నది.

నల్లభైవ ప్రజాస్వామిక వార్షికోత్సవాల సందర్భంగా నేపాల్ ప్రజలు, విద్యార్థులు వెల్లుదికి వీదుల్లోకి వచ్చారు. పార్టీ రహిత పంచాయితి వ్యవస్థ పేరిట దేశాన్ని ఏలుతున్న రాచరిక నిరంకుశపాలన నశించాలని బహుళపార్టీ వ్యవస్థ నెలకొనాలని కోరుతూ శాంతియుతంగా ప్రదర్శనలుజరిపిన ప్రజలపై ప్రభుత్వం దారుణ నిర్బంధకాండ అమలు జరిపింది. నేపాల్ కాంగ్రెస్, సమైక్యవామపక్షానికి చెందిన అగ్రనాయకులతోసహా వెయ్యిమంది ప్రజాస్వామ్య స్వేచ్ఛాకాముకులను ప్రభుత్వం అరెస్ట్‌చేసింది. కాల్పులలో దాదాపు 50 మంది మరణించారు. గత ఆదివారంనాడు ఆరంభమైన ఈ ప్రజాస్వామిక విప్లవం-దమనకాండకు జడిసి చల్లారిపోకుండా నేలకు వేసిన బంతి మాదిరిగా మరింత ఉధృతస్థాయిలో విజృంభిస్తున్నది.

స్వేచ్ఛా కాంక్షాపరులైన జనశక్తిని ఇంకేశక్తీ ఎంతటి ఉక్కుపాదము అణచిపెట్టి ఉంచలేదని నేపాల్ ప్రజలు నిరూపిస్తున్నారు.

గతంలోకి వెళ్ళిచూస్తే నేపాల్‌లో ప్రజాస్వామిక విప్లవోద్యమానికి భారత ప్రజలకు గాఢమైన అనుబంధం ఉన్నదని స్పష్టపడుతున్నది.

రాజును ఉత్సవ విగ్రహంగా కూర్చోబెట్టి వంశపారంపర్య ప్రధానులైన రాణాలు సాగించిన నియంతృత్వ పరిపాలనకు వ్యతిరేకంగా ఆనాటి రాజు త్రిభువన్ ఆశీస్సులతో ప్రవర్ధమానమైన హింసాయుత ప్రజావిప్లవం 1951లో నేపాల్‌కు ప్రజాస్వామిక వ్యవస్థను ప్రసాదించింది.

రాజును గృహనిర్బంధంలో ఉంచి రాజ్యమేలిన జానపద గాధల్లోని మంత్రుల మాదిరిగా రాణాలు 1846 నుంచి రాజులందరినీ నామమాత్రపు రాజులుగా చేసి ప్రధానమంత్రి పదవిబూని తాము ముకుటంలేని మహారాజులగా నేపాల్‌ను పరిపాలించారు. ఈ నిరంకుశ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజావిప్లవం వెల్లుబకడంతో రాజు త్రిభువన్ ఆ విప్లవానికి ఆశీస్సులు తెలిపారు.

నియంత ప్రధాని బహదూర్ రాణా ప్రతీకార జ్వాలలనుంచి తనను కాపాడుకోవడం కోసం రాజు త్రిభువన్ 1950 నవంబర్‌లో భారత రాయబార కార్యాలయం శరణుజొచ్చారు.

అందుకు ప్రధాని రాణా నిరసన తెలపడంతో రాజు త్రిభువన్‌ను ఆయన కుటుంబ సభ్యులను భారతప్రభుత్వం ఢిల్లీకి తీసుకువచ్చింది. భారతప్రభుత్వం తీసుకున్న ఈ చర్య నేపాల్ ప్రజలకు కొండంత అండను కల్పించింది. వారి ధైర్య, స్థైర్యాలు ఇనుమడించాయి. ప్రజలు సాయుధులై సమరోత్సాహం ప్రదర్శించారు. రాణాల నిరంకుశపాలనకు పెనుగండం దాపురించింది. ఆ పరిస్థితులలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మధ్యవర్తిత్వం నెరపి రాణాలు, ప్రజలకు అధికారాన్ని పంచిఇచ్చేట్లు నేపాల్‌లో ప్రజాస్వామిక వ్యవస్థ నెలకొల్పనుకొనేటట్లు ఏర్పాటు చేశారు. ఫలితంగా 1951 ఫిబ్రవరిలో రాజు త్రిభువన్ సకుటుంబంగా తిరిగి నేపాల్ చేరుకొన్నారు. 1951 ఫిబ్రవరి 18వ తేదీన పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి శ్రీకారం చుట్టారు.

రాజు త్రిభువన్ మరణానంతరం మకుటం ధరించిన రాజు మహేంద్ర 1959 ప్రథమార్థంగా ఎన్నికలు జరిపించారు. ఆ ఎన్నికలలో బి.పి. కోయిరాలా నాయకత్వంలోని నేపాల్ కాంగ్రెస్ అత్యధిక స్థానాలు సంపాదించుకొని అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత రాజు మహేంద్రకు కోయిరాలాకు విభేదాలు గాఢమై 1960 సంవత్సరాంతంలో రాజు ప్రభుత్వాన్ని, పార్లమెంట్‌నుకూడా రద్దు చేశారు. గతంలో రాణాలు చలాయించిన నిరంకుశత్వాన్ని ఈసారి రాజులే చలాయించడం మొదలుపెట్టారు. నిరంకుశ రాచరిక వ్యవస్థపై నిరంతర పోరాటాన్ని నేపాల్ కాంగ్రెస్ చేపట్టింది. రాజకీయపార్టీలపై ఖచ్చితమైన నిషేధం అమలులోకి వచ్చింది. 1962లో పార్టీ రహిత పంచాయితీ వ్యవస్థ అవతరించింది.

1971లో రాజు మహేంద్ర మరణించి బీరేంద్ర మకుటం ధరించారు. అయినా పరిస్థితులలో మార్పు రాలేదు. 1979లో నేపాల్ కాంగ్రెస్ మరొకసారి మహోధృతస్థాయిలో తిరుగుబాటు జరిపింది. అప్పుడు రెఫరాండం పేరిట కంటి తుడుపు ప్రజాభిప్రాయ సేకరణ జరిపి ప్రజలు పార్టీ రహిత పంచాయితీ వ్యవస్థనే కోరుకుంటున్నారని రాజు బీరేంద్ర ప్రకటించారు. నేపాల్ ప్రజాస్వామిక విప్లవోద్యమానికి ఇంతటి ఘనమైన చరిత్ర ఉన్నది. ఈసారి అక్కడ వెల్లుదికిన ప్రజావెల్లువ గతంలో ఎప్పుడూలేనంత ఉధృతంగానూ, విస్తృతంగానూ ఉన్నది. రాజధాని ఖాట్మాండులోనే కాక, మారుమూల పల్లెలలోకూడా, ప్రజలు విప్లవ పథంలో కలిసి వస్తున్నారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తున్నారు. తుపాకీగుండ్లకు గుండె ఎదురొడ్డుతున్నారు. అందుచేత ఈసారి నేపాల్ ప్రజల వీరోచిత పోరాటం విజయవంతం కాగలదనిపిస్తోంది. అయితే గతంలో మాదిరిగా నేపాల్ ప్రజావిప్లవానికి నేరుగా మద్దతు పలికే స్థితిలో భారతప్రభుత్వం ఇప్పుడులేదు. ఇప్పుడే ఇండియా ప్రాంతీయ పెత్తందారీ పాత్ర పోషిస్తుందనే విమర్శలు ఇరుగుపొరుగు దేశాలనుంచి వినవస్తున్నాయి.

ప్రభుత్వస్థాయిలో నేపాల్‌తో బెడిసికొట్టి ఉన్న సంబంధాలను మెరుగుపరచుకోవడానికి నేషనల్‌ఫ్రంట్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నది. అందుచేతనే నేపాల్ ఆంతరంగిక కల్లోలంవల్ల భారతప్రభుత్వం ఎటువంటి అనక్తి కనబరచకపోవడమే సరైన వైఖరి అవుతుంది. అయితే నేపాల్ ప్రజలు సాగిస్తున్న పోరాటం న్యాయసమ్మతమైనది. కాబట్టి వారు విజయులు కావాలని భారత ప్రజలు కోరుకోవడం సహజం. సర్వ నిరంకుశత్వాలను నిరసించి ప్రజాస్వామిక వ్యవస్థను కోరుకొంటున్న ప్రజానీకం ఒకనాటి ప్రజాస్వామ్యం ముసుగులో వర్ధిల్లుతున్న ధనస్వామిక దోపిడీనికూడా తృణీకరించి బహుజనహితమైన సిసలైన ప్రజాస్వామిక వ్యవస్థను నెలకొల్పుకోవడం ఖాయం. రాచరిక వ్యవస్థపై తిరుగుబాటు నల్పుతున్న నేపాల్ ప్రజాబాహుళ్యానికి ప్రపంచ ప్రజలమద్దతు దండిగా లభిస్తుందని ఆశిద్దాం.

విద్యార్థులలో అశాంతి

ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులలో నేడు వ్యక్తమవుతున్న అశాంతి, అడుగడుగునా వారికి ఎదురవుతున్న అసంతృప్తి భంగపాటులే ప్రధాన కారణాలుగా పేర్కొనవచ్చు. ఇది ఏ ఒక్క దేశానికో కాదు. మొత్తం మానవాళికే సమస్యగా పరిగణించాలి. ముఖ్యంగా అభివృద్ధిచెందుతున్న దేశాలలో నిరుద్యోగ సమస్య, భద్రతలేమి, సంఘంలో ప్రత్యక్షంగా కనబడుచున్న అసమానతలు, అన్యాయాలు వంటి ప్రధాన సమస్యలు విద్యార్థులను తీవ్రంగా చలింప చేస్తున్నాయి.

సమకాలీన చరిత్రను పరిశీలించినట్లయితే, ఇండోనేషియాలో ఒకప్పుడు ప్రజలచే ఇలవేలుపులుగా పేరుపొందిన జనరల్ సుకర్ణో విద్యార్థులలో పెల్లుబికిన అసంతృప్తి వెల్లువలో విసరివేయబడ్డారు. అలాగే, ఫ్రాన్సు దేశంలో చక్రవర్తి నెపోలియన్ తరువాత అంతటి పేరు ప్రఖ్యాతులను సంపాదించుకొన్న చార్లెస్ డీగాల్ కూడా విద్యార్థులు జరిపిన ప్రదర్శనలకు ఒరిగిపోకతప్పలేదు. ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర విమర్శలకు గురై, అపఖ్యాతిపాలైన వియత్నాంపై అమెరికా దురాక్రమణ, అమెరికాలో "హిప్పీ ఉద్యమానికి" నాంది పలికింది.

కాగా, మన దేశంలోని అనేక రాష్ట్రాలలోని విద్యార్థులు నేటి సమాజంలో జరుగుతున్న అవకతవకలకు ప్రతిస్పందిస్తున్నారు. వాటిని ప్రతిఘటించడానికై అనేక ఉద్యమాలను చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా, జైఆంధ్ర ఉద్యమాలు ప్రారంభించింది కూడా విద్యార్థి లోకమే. కావడం గమనార్హం!

ఇంతకుముందరి మన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు వెనుకబడిన తరగతులకు ఉద్యోగాలలో పెంచిన రిజర్వేషన్ల ఉత్తర్వులను రాష్ట్ర హైకోర్టు నిలుపుదల చేసింది. దీనికితోడు వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయానికి విద్యార్థిలోకంలో అనుకూలంగానూ, ప్రతికూలంగానూ కూడా ఉద్యమాలను చేపట్టడంతో ప్రభుత్వం చిక్కుల్లో పడింది. దీనితో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం బి.సి.లకు రిజర్వేషన్లకై తీసుకొన్న నిర్ణయాన్ని రద్దు చేసుకొంది. ముఖ్యంగా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం తన ప్రయోజనాలను ఆశించి మాత్రమే దీనిపై తొందరపాటు నిర్ణయం తీసుకొన్నదితప్ప, ఈ సమస్యలో ఇమిడివున్న మంచిచెడులను బేరీజు వేయలకపోయింది. దీనివల్ల అనుకోని పరిణామాలు ఉత్పన్నం కావడమే కాకుండా విద్యార్థులు అమూల్యమైన తమ విద్యాసంవత్సరాన్ని కోల్పోవడం కూడా జరిగింది.

విద్యార్థులు విశ్వవిద్యాలయ పరిపాలనా వ్యవహారాలలో చురుకుగా పాల్గొనకపోవడానికి గల కారణాలు ఇదమిత్థంగా తెలియడంలేదు. మన విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు బోర్డ్ ఆఫ్ స్టడీస్, అకడమిక్ కౌన్సిల్ అలాగే సెనేట్‌లలో ప్రాతినిధ్యం అయితే ఉందిగాని, సిండికేట్‌లోమాత్రం లేదు. విద్యార్థులందరికీ ఆమోదయోగ్యమైన, ఒకే విధమైన పాఠ్యప్రణాళికను రూపొందించడం అత్యంత అవశ్యకం. అప్పుడే విద్యార్థుల సమస్యలను, అప్పుడప్పుడు తలెత్తే ఉద్యమాలను కొంతవరకైనా పరిష్కరించడానికి వీలుంటుంది. విశ్వవిద్యాలయాలన్నింటికి ఒకే విధమైన చట్టాన్ని తీసుకురావడంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఒక ఆమోదయోగ్యమైన అంగీకారానికి రావలసిన అగత్యం కూడా ఎంతో ఉంది. విశ్వవిద్యాలయాల పరిపాలనా విధానంలో విద్యార్థుల సంఘాలు నిజానికి చాలా ప్రాముఖ్యతనే కల్గిఉన్నాయి. ఈరోజు విద్యార్థిలోకంలో అశాంతి వీర్పడటానికి పాఠ్యప్రణాళికలో లేని అంశాలను పరీక్షపత్రాలలో చేర్చారనో, విద్యాబోధన సరిగా లేదనో, పరీక్ష పత్రాలు తారుమారైనాయనో, ప్రాక్టికల్ పరీక్షలు పాఠ్య ప్రణాళికలో లేని అంశాలపై జరిగాయనో ఇలాటి అంశాలే కారణమవుతున్నాయి. బోర్డ్ ఆఫ్ స్టడీస్‌కు సంబంధించిన ప్రతి సబ్జక్ట్ గురించే తరచుగా ఆందోళనలు జరుగుతూ వున్న విషయం తెలిసిందే.

నూతన విద్యా విధానం లక్ష్యాలను సాధించే విధంగాను, చక్కని ఫలితాలను రాబట్టే విధంగానూ విద్యార్థులు, మేధావులు విద్యావేత్తలు నేటి విద్యావిధానాన్ని రూపుదిద్దాల్సిన అవసరం ఉంది. అధ్యాపకులు రాష్ట్ర వ్యవహారాల సరళిపై నింద మోపడం కన్నా అందుకై తాము చేయవలసిన కృషి ఏమిటి? చేబట్టవలసిన బాధ్యతలేమిటి? అని ఆలోచించి, సూచించడంవల్ల విశ్వవిద్యాలయాల ప్రతిష్ట ఇనుమడిస్తుంది. మన దేశంలో ఏ విశ్వవిద్యాలయం గాని, ఏ విద్యాసంస్థ కాని ప్రభుత్వం మంజూరు చేసే గ్రాంట్-ఇన్-ఎయిడ్ లేకుండా మనుగడ సాధించడం దుర్లభం. అయితే దురదృష్టవశాత్తు గత తెలుగు దేశం ప్రభుత్వం విద్యాసంస్థలకు కేటాయించిన నిధులనుండి దాదాపు 48కోట్ల రూపాయలను అది చేపట్టిన రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం, జనతా వస్త్రాల పంపిణీ పథకం వంటి వాటికై ఖర్చు చేయడం జరిగింది.

ఏమైనా, ఈనాడు మన దేశంలోని విద్యార్థులలో నెలకొన్న అశాంతికి అనేక కారణాలు ఉన్నాయి. నిజమే. అయితే, విద్యార్థుల అశాంతి దాని పరిధికి మించి, అదుపు తప్పుతున్నది. ఈనాడు మన విశ్వవిద్యాలయాలను పరిశీలించినట్లయితే, ప్రతిచోట విద్యాశత్రుత్వము, నేరస్థ లక్షణాలతో కూడు కొన్న చేష్టలు సర్వసామాన్యమైన విషయాలుగా చోటు చేసుకుంటున్నాయి. ఏ ప్రాముఖ్యతా లేని సమస్యలు ఈనాడు విశ్వవిద్యాలయ ప్రాంగణాలలో మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి! ఇలాంటి సమయాల కొరకు కొన్ని దుష్టశక్తులు వేచిఉండటమే కాకుండా, పరిస్థితులను తమకు అనుకూలంగా మలచుకొని దారి తప్పించి కలుషితమూ, హింసాయుతమూ గావిసున్నారు.

విశ్వవిద్యాలయాల స్నాతకోత్సవాల్లో "మాకు ఉద్యోగాలు కావాలి, డిగ్రీలు కాదు" అన్న విద్యార్థుల నినాదాలు సర్వసామాన్యమయిపోయాయి. దీనితో అనేక విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు స్నాతకోత్సవాల్లో ప్రదానంచేసే డిగ్రీలను ఎలాంటి ఆర్భాటాలు లేకుండా పంపిణీ చేయడానికి నిశ్చయించుకున్నాయి. అగ్నికి ఆజ్యం అన్నట్లు ఈనాడు మనం విశ్వవిద్యాలయాలలో చూస్తూనే వున్నాం- కొన్ని అభ్యంతరకరమైన నినాదాలు. వాటిలో ముఖ్యంగా చెప్పుకోదగ్గవి "అధ్యాపకుడనే రాజకీయనాయకుడు", "అధ్యాపకుడనే కుల నాయకుడు" మొదలైనవి.

కాగా, విశ్వవిద్యాలయాలల్లో హింస, విద్యా శత్రుత్వము వలన ఎలాంటి ప్రయోజనాలు ఒనగూడవని, అలాంటి హింసాత్మక సంఘటనలు జరగడం వలన విద్యార్థులే నష్టపోవాల్సి వస్తుందని ఈనాటి విద్యార్థులు గుర్తించాలి.

విద్యార్థుల అశాంతి కేవలం మానవ సమస్య గానే పరిగణించరాదు. అది సమాజానికి ఎంతగా కీడును తెస్తుందోనని కూడా పరిశీలన చేయాలి. విద్యార్థుల అశాంతిని సామాజికమైనటువంటి సమస్యగా పరిగణించాలి.

-డాక్టర్ అగరాల ఈశ్వరరెడ్డి,
(ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్)

యువనియంత

అతి పెద్దవంటశాల

మనదేశంలో అతి పెద్ద వంటశాల ఒరిస్సాలోని పూరీ వద్ద గల జగన్నాథ ఆలయ సముదాయంలో వుంది. పదిహేను వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ వంటశాలలో ఏడువందల యాభై రెండు పొయ్యిలు వున్నాయి. ప్రతి రోజు తీపి పదార్థాలతో సహా మొత్తం వంద రకాల ఆహార పదార్థాలను ఇక్కడ వండుతారట.

సంక్షోభంలో సోవియట్ యూనియన్

తూర్పు యూరప్‌లో ఏర్పడిన ప్రజాస్వామ్య ప్రభంజనం సోవియట్ యూనియన్‌కు కూడా పాకింది. సోవియట్ రాజ్యాంగంలోని 70వ నిబంధన ప్రకారం నేడు కొన్ని రిపబ్లిక్‌లు సోవియట్ యూనియన్ నుంచి విడిపోవటానికి ఉద్యమిస్తున్నాయి. సోవియట్ యూనియన్‌లోని రిపబ్లిక్‌లకు కావాలనుకొంటే సోవియట్ సమాఖ్య నుంచి విడిపోయే అధికారాన్ని సోవియట్ రాజ్యాంగమే వాటిని కల్పించింది.

అజార్‌బైజాన్, ఆర్మేనియా మొదలైన రిపబ్లిక్‌లలో అశాంతియుత వాతావరణం నెలకొని ఉంది. తూర్పు యూరప్ దేశాలలో కమ్యూనిస్ట్ పార్టీ కబంధ హస్తాలనుంచి బయటపడటానికి విజయవంతంగా నిర్వహించిన ఉద్యమాల ప్రభావం సోవియట్ యూనియన్‌లోని బహుళజాతులపై సహజంగానే పడింది. 'తెల్ల రష్యన్ ప్రాబల్యం కింద మేమెంతకాలం బానిసల్లా బతకాలి?' అని వారు ప్రశ్నిస్తున్నారు. అజార్‌బైజాన్ రిపబ్లిక్ రాజధాని బాకూలో స్వయంగా గోర్బచేవే అక్కడి నాయకత్వంతో రాజీ ధోరణిలో సంప్రదించినా ఫలితంలేకపోయింది.

ఈనాటివరకూ ఏకఖండ రాజ్యంగా కొనసాగుతున్న సోవియట్ యూనియన్‌లో నేడు అల్పసంఖ్యాక జాతుల ఈ వేర్పాటు ఉద్యమాలు సోవియట్ రాజకీయ వ్యవస్థ పునాదులను కదలించి వేస్తున్నాయి. పాశ్చాత్య ఉదారవాద ప్రజాస్వామ్య భావాలను ప్రవేశపెట్టిన సోవియట్ అధినేత గోర్బచేవ్ నేడు తన జీవితంలో అత్యంత రాజకీయ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సంప్రదాయవాదులు ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణల వల్లనే నేడు సోవియట్ యూనియన్ ఉనికికి ఆంతరంగికంగా ప్రమాదం ఏర్పడిందని, గోర్బచేవ్‌ను తూర్పారబడుతున్నారు.

కాగితంపై సోవియట్ యూనియన్ అత్యంత ఉదారవాద సమాఖ్య రాజ్యంగా ఉంది. సోవియట్ యూనియన్‌లు రిపబ్లిక్‌లు, అటానమస్ రిపబ్లిక్‌లు, అటానమస్ ప్రాంతాలు జాతీయ పార్టీలు నేషనల్ సరియాన్, అని నాలుగు అంచలస్థాయిలో విభిన్న జాతుల సమాఖ్యను సోవియట్ రాజ్యాంగం రూపొందించింది. ఈ యూనియన్ రిపబ్లిక్‌లకు స్వంత రాజ్యాంగం, స్వంత జాతీయ పతాకం, పూర్తి స్వతంత్ర ప్రతిపత్తి సోవియట్ రాజ్యాంగం ఇచ్చింది. నిజానికి వీటిలో యుక్రైన్, బైలో రష్యాలు ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వం కూడా పొందాయి! ఈ రిపబ్లిక్‌లన్నింటికీ క్రెమ్లిన్‌లో రాయబార కార్యాలయాలున్నాయి!!

అయితే వాస్తవంలో ఈనాటి వరకూ సోవియట్ యూనియన్ సమగ్రతను కాపాడగలిగింది కమ్యూనిస్ట్ పార్టీ ఉక్కు క్రమశిక్షణ, గుత్తాధిపత్యం పాలనా, రాజకీయ రంగాల్లో ఏకైక రాజకీయ శక్తిగా అదే కొనసాగుతూ రావటం- వీటివల్లనే సోవియట్ యూనియన్ ఒక సమగ్ర రాజ్యాంగా, శక్తివంతమైన అగ్రరాజ్యంగా అంతర్జాతీయ రంగంలో నిలదొక్కుకుని చరిత్రలో ఒకస్థానాన్ని కల్పించుకోగలిగింది. కమ్యూనిస్ట్ ప్రాబల్యం అన్ని ప్రాంతాలకూ విస్తరించి ఉండటంవల్ల కేంద్రీకృత పాలనా వ్యవస్థ ప్రాబల్యం వల్ల సోవియట్ యూనియన్ విభిన్న జాతులతో కూడి ఉన్నప్పటికీ ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవటం ఇన్నాళ్ళూ పెద్ద సమస్యగా ఎదురవలేదు. అయితే



ఈనాడు సోవియట్ యూనియన్ అంతర్గత సంక్షోభంలో మునిగి తేలుతున్నది.

సోవియట్ యూనియన్‌లోని విభిన్న జాతులు- ముస్లింలు, క్రిష్టియన్లు, సోవియట్ జాతి (రష్యన్) ప్రాబల్యం నుంచి బయట పడటానికి ఉద్యమిస్తున్నాయి. ఈ ఉద్యమాలు అజార్‌బైజాన్, ఆర్మేనియా రాష్ట్రాల్లో ఎక్కువగా ఉన్నాయి. "రష్యన్‌లు మాకు ముడిమూనె తప్ప ఏమిచ్చారు? వారికి మేము ఎందుకు బానిసలుగా ఉండాలి?" అని ఆర్మేనియన్లు ప్రశ్నిస్తున్నారు. వారు సోవియట్ రాజ్యాంగంలో మౌలిక మార్పులను కోరుచున్నారు. కమ్యూనిస్టు పార్టీ గుత్తాధిపత్యాన్ని సూచించే రాజ్యాంగంలోని 6వ నిబంధనను తొలగించాలని అంటున్నారు. రాజకీయ ఆర్థిక స్వేచ్ఛల కోసం ఉద్యమిస్తున్నారు.

పై పరిణామాలన్నీ సోవియట్ యూనియన్ గురించి ఇంతవరకూ మనకున్న భ్రమలను తొలగింపజేస్తున్నాయి. రాజకీయ నిబద్ధ సిద్ధాంతం ప్రాబల్యాన్ని, ఆధిక్యతను, అంటే మార్క్సిస్ట్ సిద్ధాంతం ప్రాతిపదికపై ఒక ఉపరితల నిర్మాణం పటిష్టవంతంగా నిర్మితమై కొనసాగుతున్నందువల్ల సోవియట్ యూనియన్ మార్క్సిస్ట్ రాజ్యాలకి మక్కాగా ఉన్నదన్న భావన నేడు తల్లక్రిందులైంది. అందువల్ల ప్రస్తుతం సోవియట్ యూనియన్ ఎదుర్కొంటున్న సంక్షోభానికి కారణం మార్క్సిజమా? లేదా మార్క్సిజాన్ని వక్రీకరించటం వల్లనా- అనే సందేహం కమ్యూనిస్ట్ మేధావుల్లో సహజంగానే కలుగుతున్నది.

ఛాందస కమ్యూనిస్ట్‌లు సోవియట్ యూనియన్ వంటి బహుజాతి, బహుమత, బహుభాషా సమాజం ఏకఖండ రాజ్యంగా అప్రతిహతంగా కొనసాగుతుండటం ఒక్క కమ్యూనిస్ట్ పార్టీ అగ్రగామి నాయకత్వం వల్లనే అని భావిస్తున్నది. ఈ పరిస్థితిని గోర్బచేవ్ ప్రవేశపెట్టిన రాజకీయ సంస్కరణలు తారుమారు చేసాయి. ఎప్పుడైతే గోర్బచేవ్ ప్రజాస్వామిక సంస్కరణలను ప్రవేశపెట్టారో అప్పుడు అంతవరకు అణగ తొక్కబడిన భావాలు, అదుపులో ఉన్నా నిరసనలు అన్నీ ఒక్కసారిగా బిరడాతీసిన సీసాలో సీటిలా బయటకురికాయి! అసమ్మతి వాదానికీ, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకూ ఊపిరి ఏర్పడింది. అంతవరకూ నిద్రావస్థలో ఉన్న వేర్పాటు ధోరణులన్నీ ఒక్కసారి విజృంభించి సోవియట్ వ్యవస్థ మూలస్తంభాలనే కదలించివేస్తున్నాయి.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక సులువు ఉంది. అది ఎంత అసమర్థవంతంగా, నత్తనడకలో పనిచేసినప్పటికీ అసమ్మతి వాదానికి వ్యక్తం చేయటానికి అవకాశం ఉండటం వల్ల వేర్పాటు ఉద్యమాలు వ్యవస్థపై ఎక్కువ ప్రభావాన్ని చూపలేవు. ఖలిస్తాన్, కాశ్మీర్ జార్‌ఖండ్ మొదలైనవి భారత రాజకీయ వ్యవస్థ సమగ్రతకు ప్రమాదకరంగా మాత్రం పరిణమించలేదు. అయితే ప్రజాస్వామ్య సంప్రదాయాలు, సంస్థలూ లేని సోవియట్ యూనియన్‌లో ఒక్కసారిగా గోర్బచేవ్ ప్రవేశపెట్టిన సంస్కరణలు ఉప్పెనలా సోవియట్ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి!

ప్రజాస్వామ్య సంస్కరణలు పైవిధంగా అసమ్మతి వాదాన్ని పెంచి మూలవ్యవస్థ ఉనికినే సవాలు చేస్తుంటే యీ ఉద్యమాలను ఏ విధంగా అదుపులో ఉంచాలి? స్వేచ్ఛా మార్పునూ, వేర్పాటునూ కోరుతున్నది. సంస్కరణలను వాటి ముగింపుకు తీసుకుపోతే సోవియట్ యూనియన్ సమగ్రత శేష ప్రశ్నగా మిగిలిపోతుంది. అలా అని అణచివేత పద్ధతిని అనుసరిస్తే గ్లాస్‌నాస్త్, పెరిస్త్రోయికలు అర్థరహితం అవుతాయి. అందువల్ల సోవియట్ నాయకత్వానికి ముందు నుయ్యి వెనుక గొయ్యి పరిస్థితి నేడు ఉత్పన్నమయింది. దీనిని ఏ విధంగా పరిష్కరిస్తారో వేచి చూడాలి.

-డా. వి. కృష్ణారావు

యతి కథలు గాథలు

"ఆ శిఖరాగ్రంమీద మూడు మీటర్ల ఎత్తున ఒక జూనిపర్ చెట్టు వుంది. ఓ మనిషి దానివైపు వెళ్లటం చూశాం. ఆ మనిషి జూనిపర్ చెట్టు దగ్గరకొచ్చాక ఒక విషయం అర్థమయింది. అతను కూడా దరిదాపు ఆ చెట్టంత ఎత్తు ఉన్నాడు. మనిషి మొత్తంగా ముదురు గోధుమ రంగులో ఉన్నాడు. అంతలో అతను మమ్మల్ని చూశాడు. మరుక్షణం పైకి వెళ్లిపోయాడు. హుందాగా అడుగులేస్తూ చకచకా నడుస్తూ వెళ్లిపోయాడు" అంటూ తన కళ్లబడిన యతిని అభివర్ణించింది తత్యాన గర్కీన. ఉజ్బెకిస్తాన్‌లోని ఇజ్బసార్ కవ్వోవ్‌లో గర్కీన "యతి" అనబడే మంచు మనిషిని ప్రత్యక్షంగా చూసింది.

"యతి"ని చాలామంది చూశారు. అమెరికా, మంగోలియా, ఆస్ట్రేలియా, పామీర్ తదితర ప్రాంతాలలో యతి కనిపించాడు. అప్పటి నుంచి ఈ మంచి మనిషి రహస్యం కనుక్కోవెందుకు మానవాళి కృషి చేస్తోనేవుంది. 1921లో ఎవరెస్ట్ శిఖరాగ్రం మీదికి బయలుదేరిన పరిశోధక బృందం సభ్యులకు అక్కడ భారీ అడుగుజాడలు కొన్ని దర్శన మిచ్చాయి. అప్పటి నుండి ఆ జీవిని "మంచుమనిషి", "యతి", "బృహత్పాదుడు", తదితర పేర్లతో పిలుచుకోవడం సామాన్యమైపోయింది. అయితే ఈ యతి కేవలం మంచు శిఖరాలమీదే సామాన్యంగా నివసిస్తాడనుకోడానికి వీల్లేదు. సోవియట్ యూనియన్‌లోని కోలా ద్వీపకల్పం ప్రాంతంలోనూ, ట్రాన్స్‌కకేసియా ప్రాంతంలోనూ, ఉక్రేయిన్‌లోనూ, చుకోట్కా ప్రాంతంలోనూ యతి జాడలు అగుపించాయి. అతను కనిపించినచోటల్లా, "యతి"ని మనిషిగానే- అడవి మనిషిగానూ మార్యోదయ సమయంలో కనిపించే మనిషిగానూ, ఆటవికుడిగానూ- భావించడం జరిగింది. నిపుణులు ఈ జీవికి సరిగ్గా సరిపోయే పేరును పెట్టారు. "రెలిక్ట్ హోమినాయిడ్"- మానవ పరిణామ క్రమంలో అవశేషంగా మిగిలి వున్న ఒకానొక జాతు చెందిన ప్రాణిగా ఈ యతిని పరిగణిస్తున్నారు.

యతి శాకాహారి. ఈ వింత ప్రాణి కూరలూ, పళ్లూ తినడం, యితరుల నుండి దొంగిలించడం గూడా చాలామంది కళ్లబడింది. ఒక కమ్‌డెన్స్‌డ్ మిల్క్ క్యాన్‌మీద యతి వళ్ల గుర్తు గుర్తులను వియతం మాస్కో పరిశోధకులు కొందరు గ్రహించగలిగారు. ఆ క్యాన్ మీద కనిపించిన పళ్ల గాట్లను బట్టి చూస్తే, ఆ ప్రాణికి మామూలు మనిషికి ఉండే పళ్లులాంటివే- కాస్తంత పెద్ద పరిమాణంలో వుంటాయని అర్థమవుతుంది.

'డి'ఫారమ్‌పట్టాదార్లకు సుప్రీంకోర్టు తీర్పు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి శ్రీ జి. రాధాకృష్ణారావు గారు భూసేకరణ చట్టం శె 4 (1) 18 మరియు 23-బోర్డు స్టాండింగ్ ఆర్డరు నెం. 15 ప్రకారం 'డి' ఫారమ్ పట్టా ఇచ్చిన భూములు ప్రజలు సంక్షేమం ప్రభుత్వం తీసుకొనవచ్చునినియు భూసేకరణవలన పొందు నష్టపడ్డ వ్యక్తులు నష్టపరిహారం, సొలేషియమ్, 9 % వడ్డీ ప్రభుత్వం నుండి పొందవచ్చుననియు, అటువంటి భూములు వారి వద్ద నుండి తీసుకొనునప్పుడు నష్టపరిహారం సొలేషియమ్ మరియు వడ్డీ కూడా మామూలు పట్టాదారుల భూములకు ప్రభుత్వం నష్టపరిహారములు చెల్లించినట్లుగా ప్రభుత్వం చెల్లించవలసి యుండును.

ప్రభుత్వ భూములు 'డి' ఫారమ్ పట్టాలు ఇచ్చిన వారికి మేజరు మీడియం వ్యవసాయము, విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణము చేయునప్పుడు తీసుకునే భూములకు పట్టాభూములకు నష్టపరిహారం చెల్లించు రీతులలో 'డి' ఫారమ్ పట్టా భూములకు కూడా నష్టపరిహారం చెల్లించవలసిందిగా G.O.M.S.No. 59 ఇరిగేషన్ మరియు విద్యుత్ శాఖ తే. 19-3-80 ది ఉత్తర్వు ప్రకారం నష్టపరిహారం చెల్లించవలెను. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ జి. రాధాకృష్ణారావు A.No.2942/87 కేసులో 12-6-89తేదీ నాడు భూమికి నష్టపరిహారం లేకుండా 30 % సొలేషియమ్, 9 %వంతున వడ్డీ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఇవ్వవలసినదిగా తీర్పు చెప్పారు.

'డి' ఫారమ్ పట్టాదారులకు యీ తీర్పు వలన చాలా మేలు జరుగగలదు.

చిమ్మిరి నరసింహారావు
అడ్వకేటు, ఒంగోలు.

జనఘోష

అందరికీ టీకా ప్రకృతి విరుద్ధం

17-2-90 తేదీన ఆంధ్రపత్రికలో "కుష్ఠువ్యాధికి టీకా మందు" అన్న వార్త ప్రచురితమైంది. పూర్తిగా కుష్ఠు వ్యాధి నిర్మూలనకు టీకాయే కావాలి అని చెప్పారు. ఆ విధంగా నిర్మూలన జరిగితే యింకా యితర విపరీతాలు శరీరంలో ఏర్పడతాయి. అదీగాక ఈ వ్యాధి సోకినా పూర్తి లక్షణాలు బయటపడటానికి కొన్ని సంవత్సరాలు పడుతుందని, అంతర్జాతీయ "టీకా" తయారీ బృందం అధ్యక్షుడు చెప్పడం హాస్యాస్పదంగా వుంది. ఎందుకంటే వ్యాధి ముదిరితేగాని వైద్యం చేయలేరా? ప్రారంభదశలోనే వైద్యం చేస్తే వ్యాధి పెరగదుకదా.

ఎటువంటి కండిషన్‌లో నైనా లక్షణాలకు ప్రాధాన్యత నీయకుండా వ్యాధి నిర్మూలనకు అందరికీ టీకాలివ్వటం ప్రకృతి విరుద్ధం.

డా. వెంపటి ఉమామహేశ్వరం
దుర్గాపురం, విజయవాడ-3

కుక్కలకు ఆహారంగా ఆడ శిశువులు!

నమస్తే. ది. 18-2-90 ఈనాడు పత్రికలోని వార్త "కుక్కలకు ఆహారముగా ఆడ శిశువులు" చూచి ఎంతో బాధపడినాము. ఒక ప్రక్క కట్నం పిశాచి కోరల్లో కన్నె పిల్లలు, మాదక ద్రవ్యాల గుప్పిట్లో యువజనులు మ్రగ్గిపోవుచుండగా మరల నిదొకటా అని పిస్తుంది. బహుశ ఇది కొత్తది కాకపోవచ్చును. ఇట్టి దుష్ట పరిస్థితులకు సమాజంలోని ప్రతి ఒక్కరూ చిన్న, పెద్ద, ధనిక, పేద, ఆడ, మగ, విద్యావంతులు, విద్యావిహీనులు అంతా బాధ్యులే. ఏ ఒక్క వ్యక్తిగాని, వర్గము మాత్రమే బాధ్యులని చెప్పకూడదు. పరోపకారం, దైవచింతన, పాప పుణ్యముల విచక్షణాజ్ఞానం మొదలైన ఆధ్యాత్మిక భావనలు కొరవడుటే కారణము. కావున ప్రజలలో ఇట్టి ఆధ్యాత్మిక భావనలు రగుల్కొలిపి ధనదాహము, కీర్తి కాంక్ష, స్వార్థము మొదలైనవి నశింపజేయుట కొరకు నిస్వార్థపరులు, దృఢదీక్షాతత్పరులైన కార్యకర్తలు ముందుకు వచ్చి ఉద్యమించాలి. లేకున్న మన సమాజమునకు ఇంకా ఎన్ని దుష్పరిణామాలు కల్గునో చెప్పలేము.

వి. నారాయణ
గుంటూరు

గవర్నర్‌కు కన్నీటి వీడ్కోలు!?

గవర్నర్ కుముద్‌బెన్ జోషికి కన్నీటితో వీడ్కోలు అనే అంశంతో మట్టాలు పక్కాలు కన్నీరు విడుచుచున్నట్లు ఫొటోలతో పత్రికలో ప్రకటించడం చూచి ఆశ్చర్యం వేసింది.

పదవి విరమణ చేస్తే అంత విచారమా? పదవిపై అంత వ్యామోహమా! అది విరమణ చేస్తే అన్ని కన్నీళ్ళు వదలాలా?

రావర్ల జనార్ధనరావు,
ఇంగ్లీషుపాలెం, బందరు.

టిబెట్ లామాలకు 'యతి'సాయం?

పోత శార్జివ్ గోల్ యుద్ధం జరుగుతున్న కాలంలో, తన సైనికులు యిదే మాదిరి జంతువు నొకదాన్ని బండిలో కట్టివేసి వుంచారని మార్షల్ రియబాల్కో తెలిపారు. ఆటు తర్వాత 1925లో, పామీర్ పశ్చిమ ప్రాంతంలో ఒక మారుమూల ప్రాంతంలో యిదే మాదిరి జంతువును ఒకదాన్ని కాల్చి చంపడం జరిగింది. ఎర్ర సైన్యం తరుముకొస్తుండగా, బస్మాచీ సైనికులు కొందరు "యతి" నివసిస్తూ వుండే ఒక గుహలోకి దూరిపోయారని తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన కథనాన్ని, ప్రత్యక్ష సాక్షి తోపిల్‌ష్కియ్ వివరించారు. అయితే యిలాంటి కథనాలను అప్పట్లో నిపుణులు అధ్యయనం చెయ్యలేదు. ఇక ఎర్ర సేనకు, యిలాంటి అసాధారణ జంతువును పట్టించుకునే తీరికే లేదు.

టిబెట్‌కు చెందిన లామాయిస్టు బౌద్ధ సన్యాసులు "యతి" (దాన్ని వాళ్లు 'అల్మాస్' అంటారు) విగ్రహాలు చెక్కారు. కాగా, కొద్ది దశాబ్దాల క్రితం వరకూ "యతులు" తమకు వ్యవసాయం పనుల్లో సహాయం చేస్తుండేవని పైనా రైతులు చెబుతుంటారు. మానవ మాత్రులతో సంబంధాలు పెట్టుకునేందుకు "యతి" ప్రయత్నించిందనడానికి మరి కొన్ని రుజువులు గూడా ఉన్నాయి. 1942 లో భయంకరమైన శీతాకాలం రోజుల్లో- ముర్నాన్స్ ప్రాంతంలోని లవజేర్స్కొయె గ్రామానికి చెందిన ఒక కుర్రాడు తప్పిపోయాడు. ఆ కుర్రాడ్ని పట్టుకునేందుకు చేసిన యత్నాలన్నీ విఫలమయ్యాయి. వారం రోజుల తర్వాత, తప్పిపోయిన కుర్రాణ్ణి సజీవంగా పట్టుకోగలమన్న ఆశలన్నీ అడుగంటిన తర్వాత ఆ కుర్రాడు క్షేమంగా స్వగ్రామానికి తిరిగొచ్చాడు. ఒళ్లంతా జుట్టుతోవున్న ఒక మనిషి తనని తీసుకుపోయి ఒక గుహలో వుంచాడనీ, అక్కడే తాను అన్నాళ్లు వుండి వచ్చాననీ, ఆ కుర్రాడు చెప్పాడు. ఆ గుహలో మరికొన్ని జీవులు- అవి కూడా ఒళ్లంతా జూలుతో వున్నాయట, వున్నాయనీ. యీ జీవులు దుంపలూ, కంద మూలాలు వంటి శాకాహారాన్ని మాత్రమే తినేవని-తప్పిపోయిన కుర్రాడు చెప్పాడు. అయితే ఆ తిండి సరిపడకపోవడంతో తనకు జబ్బు చేసిందనీ, ఆ వెంటనే తనను గుహలోకి తీసుకుపోయిన మనిషే తిరిగి గ్రామంలో వదిలిపెట్టాడని ఆ కుర్రాడు తెలియజేశాడు.

"యతి" ని గురించిన మరెన్నో కథలు ప్రచారంలో వున్నాయి. అయితే "యతి" గురించి అప్పుడే ఖచ్చితమైన అభిప్రాయం చెప్పడం సాధ్యం కాదు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

క్యూరేటర్ వారికార్యాలయం
నెహ్రూ జూలాజికల్ పార్క్, హైదరాబాద్
టెండరునోటీసు

(1) 1-4-1990 నుండి 31-3-1991 వరకు గల కాలంలో జూ ZOOలోని విలువయిన జంతువులకు మరియు పక్షులకు దాణా(Feeds) సరుకులు వగైరా సరఫరా చేయుటకుగాను సీలువేసిన టెండర్లు 6-3-1990 నాడు మ. 2 గం. వరకు క్యూరేటర్, నెహ్రూ జూలాజికల్ పార్క్, హైదరాబాద్ వారి కార్యాలయంనకు చేరునట్లు కోరబడుచున్నవి.

(2) టెండర్లు 6-3-90నాడు సా. 4 గం.లకు క్యూరేటర్, నెహ్రూ జూలాజికల్ పార్క్, హైదరాబాద్ వారి కార్యాలయంలో క్యూరేటర్ వారిచేగాని లేదా వారిచే అధికారమివ్వబడిన మరొక అధికారిచే గాని టెండరుదారు లేదా వారి అధికార ప్రతినిధుల సమక్షంలో తెరువబడును.

(3) టెండరు ఫారములతోపాటుగా కావలసిన వస్తువులు సుమారు పరిమాణం, నియమ నిబంధనలను ప్రతి టెండరుఫారంనకు రూ. 5/-(అయిదు రూపాయలు మాత్రం) చెల్లించి ప్రభుత్వ సెలవు రోజులు మినహా అన్ని పనిరోజులయందును ఆఫీసు పనివేళలలో క్యూరేటర్, నెహ్రూ జూలాజికల్ పార్క్ హైదరాబాద్ వారి కార్యాలయం నుండి పొందవచ్చును. టెండరుఫారములు 1-3-90 నుండి 6-3-90 మ. 12 గం.ల వరకు అమ్మబడును.

ఈ క్రింద తెలియచేసిన ధరావత్తుసొమ్మును క్యూరేటర్, నెహ్రూ జూలాజికల్ పార్క్, హైదరాబాద్ వారి పేర్న పొందిన డిమాండ్ డ్రాఫ్టురూపంలో చెల్లించవలెను. ధరావత్తుసొమ్ము చెల్లింపు తాలూకు డిమాండ్ డ్రాఫ్టును టెండరుతోపాటు జతపర్చి పంపవలెను. టెండర్లు ఖరారుచేసిన తర్వాత విజయం పొందని టెండరర్ల ధరావత్తుసొమ్మును తిరిగి ఇవ్వబడును. విజయం పొందిన టెండరుదార్ల విషయంలో ఇతర టెండరు లాంఛనాలు పూర్తిచేసిన పిదప సెక్యూరిటీ డిపాజిట్ క్రింద సర్దుబాటు చేయబడును.

క్రమ సంఖ్య	గ్రూపు నెం.	వివరణ	ధరావత్తు సొమ్ము రూ.
(1)	1	బీఫ్‌లివర్	25/-
(2)	2		
(3)		(i)యూనిట్"ఎ"తుంగ	500/-
(4)		(ii)యూనిట్"బి"కద్వి	500/-
(5)		(iii)యూనిట్"సి"పేవల్ మరియుఆకుచిగుళ్ళు (bud leavrs)	500/-
(6)	3	చేపలు	500/-
(7)	4	పళ్ళు మరియు కూరగాయలు	500/-
(8)	5	కోళ్ళు మరియు పిచ్చుకలు	500/-
(9)	6	కాయధాన్యాలు మరియు కిరాణా	500/-
(10)	7	బ్లీజింగ్ పౌడరు	100/-
(11)	9	మీల్‌వర్మ్	25/-
(12)	10	ట్యూబిఫిక్స్‌వర్మ్	25/-
(13)	11	కప్పలు,ఎలుకలు,తొండలు,పిటిపాములు	25/-

క్యూరేటర్,
నెహ్రూ జూలాజికల్ పార్కు,
హైదరాబాద్.

తెలుగుసమాచారంR.O. No. 194/AD1/C2/90

మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైద్రాబాద్
సూపరింటెండింగ్ఇంజనీర్ (ప్రాజెక్ట్సు)సర్కిల్‌కార్యాలయము,
సి.సి. కాంప్లెక్స్‌బిల్డింగ్, 6వ అంతస్తు,
ట్యాంక్‌బండ్‌రోడ్, హైదరాబాద్500029.

టెండరు నోటీసు

T.No. 27/SE(P)/MCH/T2/89-90 తేది:16-2-1990

1) ఈ క్రింద చూపిన పనులను చేయుటకై సీలువేసిన టెండర్లు సూపరింటెండింగ్ ఇంజనీరు (ప్రాజెక్టు) సర్కిల్ వారిచే తమ కార్యాలయంలో14-3-1990 నాడు సా. 3 గంటలవరకు అందుకోబడి. అదేరోజు సా. 3-30 గంటలకు తెరువబడును.

2) టెండరు షెడ్యూళ్ళు ఖరీదు తిరిగి చెల్లించడంగాని, మరొక కార్యానికి సర్దుబాటుచేయడంగాని జరుగదు.

3) ఏ కారణం తెలియజేయనవసరం లేకుండా ఏదైనా లేదా అన్ని టెండర్లను తిరస్కరించే అధికారం యీ క్రింది సంతకందారు కల్గివున్నారు.

4) ఎం.సి.హెచ్. నందు రిజిష్టరైన నిరుద్యోగ యింజనీర్లుకు రు. 1-00 లక్షవరకు మాత్రం ధరావత్తు సొమ్ము చెల్లింపు నుండి మినహాయింపు యివ్వబడింది.

ఎ) ఫస్ట్ అప్లైలెమెంట్ తేదీ నుండి మూడేండ్ల కాలంనకుపైగా యిదివరకే మినహాయింపులు పొందిన వారికి మినహాయింపులు యివ్వబడవు.

బి)వ్యక్తిగత కాంట్రాక్టులు (అనగా) తొలగించబడిన లేదా నిరుద్యోగ యింజనీర్లకు ఒక సంవత్సరంలో యివ్వబడే మొత్తం పనుల విలువ రూ. 2-00 లక్షలకు పరిమితం చేయబడింది.

5) కార్మిక సహకార సంఘాల విషయంలో యివి తగిన అధికారి నుండి సొసైటీయొక్క యిటీవలి ఆడిట్ రిపోర్టు కాపీని దాఖలు పర్చవలెను. నిబంధన పాటించనిపక్షంలో టెండరు షెడ్యూళ్ళు జారీచేయబడవు. షెడ్యూళ్ళు ఖరీదు స్వాధీనపర్చబడును.

6) టెండరు షెడ్యూళ్ళకొరకు దరఖాస్తులు దాఖలు పర్చుసమయంలో టెండరుదారులు తమ రిజిస్ట్రేషన్ కాపీని జతపరచవలెను.

టెండరు జారీచేయుటకు ఆఖరుతేది:28-2-1990సా. 5 గం.వరకు.

షెడ్యూళ్ళు జారీచేయబడు తేది: 8-3-1990

ఇతర వివరాలకు సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్సు) సర్కిల్ ఎం.సి.హెచ్. వారి కార్యాలయంనుండి పొందవచ్చును. ప్రతి అంశానికి ఎదురుగా చూపినవిధంగా ధరావత్తు సొమ్మును కమీషనర్, మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ పేర్న ఏదైన జాతీయ బ్యాంకు నుండి పొందిన డిమాండ్ డ్రాఫ్టు ద్వారా చెల్లించవలెను. ఎస్.బి.హెచ్., సి.సి. కాంప్లెక్స్ బిల్డింగ్, ట్యాంక్‌బండ్‌రోడ్ బ్రాంచినందు టెండరు షెడ్యూళ్ళ ఖరీదు చెల్లించి పొంది ఛలానా యొక్క ట్రిప్లికేటుకాపీని షెడ్యూళ్ళ సరఫరా నిమిత్తం నిర్ణీత సమయంలోగా దరఖాస్తులతో పాటు జతపరచవలెను. దరఖాస్తుతోపాటు ఛలానుయొక్క ట్రిప్లికేటు కాపీకాకుండా మరొకటి పంపిన పక్షంలో టెండరు షెడ్యూళ్లను జారీచేయుటకు డిపార్టుమెంటు కట్టుబడి వుండదు.

వరుస నెం.	పనిపేరు	ధరావత్తు సొమ్ము	టెండరు డాక్యుమెంటు ఖరీదు	పని పూర్తికి గడువు	టెండరు పెట్టుటకు అర్హత
1)	సి.సి. కాంప్లెక్స్,ఎంసిహెచ్, ట్యాంక్‌బండ్, హైదరాబాద్‌వద్ద నున్న కౌన్సిల్‌హాలునందు సీటింగ్(seating) ఏర్పాట్లు చేయుట.	5,675-00	110-00	రెండు నెలలు	తరగతి-1 (ఫర్నీచర్)లేదా పేరుపొందిన సంస్థలు
2)	టోలిచౌకి జంక్షన్‌వద్ద జంక్షన్ అభివృద్ధి పర్చుటలో ట్రాఫిక్ ఐలాండ్ నిర్మాణం.	9,500	-డిటో-	-డిటో-	తరగతి -IV (సివిల్)

ఎ. లక్ష్మన్న, బి.ఎ.,బి.ఇ.
సూపరింటెండింగ్ ఇంజనీర్,
(ప్రాజెక్ట్సు) సర్కిల్, ఎం.సి.హెచ్.

Printed and Published for Nageswara Rao, Estates Ltd., by S. Nageswara Rao, at the Andhra Patrika Press, 1-2-365/5, Gaganmahal, Domalguda, Hyderabad-29. Editorial Adviser: S. Radhakrishna, Editor: C.V. Rajagopal Rao [Hyderabad], Phones: Business: 68092, Editorial: 68037

శివరాత్రి సంబరాలకేంగాని సౌకర్యాలుమాత్రం సున్నా

వేములవాడ, ఫిబ్రవరి 22: కరీంనగర్ జిల్లా వేములవాడ రాజన్న ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా ఇక్కడకు తెలంగాణా జిల్లాలనుండి వేలాది భక్తులు శివరాత్రి ఉత్సవాలకు హాజరై కనులపండుగగా వీక్షిస్తూంటారు.

అయితే ఆలయంలో దర్శనార్థం సరైన వసతులు మాత్రం భక్తులకు లభించడం లేదని పలువురు భక్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ప్రాంతంలో ఉన్న విశ్రాంతి గదులలో ఎక్కువ శాతం పలుకుబడి వున్న వ్యక్తులకు కేటాయిస్తారని, వేలాది భక్తులు నిలువ నీడలేక చెట్లక్రింద, పేవ్‌మెంట్‌లమీద, చెరువుగట్ల మీద గడుపుతున్నారని, అలాంటివారిపై పోలీసుల జులుం ఎక్కువవుతోందని, ఆలయ కమిటీ వారు భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో బాధ్యత వహించాలని భక్తులు విశ్రాంతి తీసుకోడానికి పందిర్లు నిర్మించి, త్రాగునీటి వసతి కల్పించాలని, మరిన్ని సత్రం గదులు నిర్మించాలని, కోనేరు నీరు ఎప్పటికప్పుడు శుభ్రపరచి అంటురోగాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు

విధానసభకు హెగ్డేరాజీనామా చేయాలి:నిజలింగప్ప

బెంగుళూరు,ఫిబ్రవరి 22: ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షుడు శ్రీ రామకృష్ణహెగ్డే కర్నాటక విధానసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని కర్నాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ నిజలింగప్ప అన్నారు.

ఇటు విధానసభ సభ్యుడిగా ఉంటూ హెగ్డే ఎన్నికైన బగువన్‌గుడి నియోజకవర్గ ఓటర్లకు బాధ్యత వహించే తీరిక ఆయనకు ఉండదని శ్రీ నిజలింగప్ప విలేఖరులతో అన్నారు.

1981 జనాభా లెక్కల ప్రకారం చట్టాన్ని సవరించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా ఆయన అన్నారు.

దోపిడీదొంగల ఆటకట్టు

కరీంనగర్, ఫిబ్రవరి 22: (నవవార్త) దోపిడీ దొంగలకు, సంఘ విద్రోహ శక్తులకు, బ్లాక్ మార్కెటీర్లకు సింహస్వప్నమై "గబ్బర్‌సింగ్"గా పేరుగాంచిన శ్రీ కె.ఎస్.ఎన్. మూర్తి కరీంనగర్ జిల్లా ఎస్.పి.గా పదవీ బాధ్యతలు స్వీకరించి నెల రోజులు కూడా గడవక ముందే రెండుఅంతర్ జిల్లా దోపిడీ దొంగల ముఠాలను చాకచక్యంగా పట్టుకొని జిల్లా ప్రజల అభినందనలు అందుకున్నారు.

కల్లోల జిల్లాగా పేరుగాంచిన కరీంనగర్ జిల్లాలో గత కొన్ని సంవత్సరాలుగా పోలీసు యంత్రాంగం యావత్తు తన దృష్టిని కేవలం నక్సల్ సమస్యపై కేంద్రీకరించడంవల్ల జిల్లాలో దోపిడీలు, స్మగ్లింగ్, బ్లాక్‌మార్కెటింగ్ యధేచ్ఛగా కొనసాగింది. దోపిడీలు పల్లె ప్రాంతాల్లోనే కాకుండా పట్టణప్రాంతాలలో కూడా జోరుగా కొనసాగినప్పటికి పోలీసులు వేటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారు.

ఇటీవలికాలంలో రాష్ట్ర ప్రభుత్వం నక్సల్ సమస్యలపట్ల తీసుకుంటున్న చర్యల మూలంగా పోలీసుశాఖ తన దృష్టిని ఇక సంఘవిద్రోహకశక్తులు మరియు దోపిడీ దొంగలపైపుకు మరల్చింది. దీనికి ఉదాహరణ: కరీంనగర్‌లో ఈ నెల 14వ తేదిన సరిహద్దు జిల్లాల పోలీసు ఉన్నతాధికార్ల సమవేశం జరిపి దొంగతనాలు, దోపిడీలు ఇతర నేరాలను అరికట్టేందుకు తీసుకోవలిసిన చర్యల గురించి చర్చించడమే. గతంలో ఇలాంటి సమావేశం ఎప్పుడు జరుగలేదు.

కాగా ఎస్.పి శ్రీ కె.ఎస్.ఎన్.మూర్తి పదవీ బాధ్యతలు స్వీకరించగానే దోపిడీదారులు, బ్లాక్‌మార్కెటీర్లు, స్మగ్లర్స్ గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నట్లు తెలిసింది. ముఖ్యంగా కరీంనగర్ పట్టణంలో కొందరు బడావ్యాపారులు నిరాటంకంగా కొనసాగిస్తూ వచ్చిన బ్లాక్‌మార్కెటింగ్ జగిత్యాల, కోరుట్ల, మెటుపల్లి ప్రాంతంలో దొంగబంగారం వ్యాపారాన్ని నిర్వహిస్తున్న స్మగ్లర్స్, దొంగనోట్ల వ్యాపారంపేరుతో మోసాలు చేస్తున్న ఘరానా పెద్దమనుషులు, నక్సలైట్లమని చెప్పకొని దోపిడీలు చేస్తున్న నకిలీ నక్సలైట్లు తమ పద్ధతికి కొన్నాళ్ళు స్వస్తి చెప్పాలని యోచిస్తున్నట్లు తెలిసింది.

శ్రీ కె.ఎస్.ఎన్. మూర్తి వీరి ఆటకట్టించాడానికి నాలుగు ఐ.డి పార్టీలను ఏర్పాటు చేశారని తెలిసింది. ఈ ఐ.డి పార్టీలే ఇటీవల పెద్దపల్లిలో ఒక దొంగ లముఠాను, సిరిసిల్లా బస్‌స్టాండ్‌లో ఈ నెల 13 వ తేదిన ఒక ముఠాను అరెస్టు చేశాయి. సిరిసిల్లాలోపట్టుబడిన బానాల ఎల్లయ్య అతని తొమ్మిదిమంది అనుచరుల ముఠా జిల్లాలో నక్సలైట్లు అని చెప్పకొని అనేక నేరాలు కొనసాగించినట్లు ఎస్.పి తెలిపారు. వీరివద్దనుండి దాదాపు ఒక లక్ష పదిపేల రూపాయల విలువగల దొంగసొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్.పి శ్రీ మూర్తి పత్రికలవారితో మాట్లాడుతూ జిల్లాలో ఇంతవరకు కొనసాగుతూవచ్చిన ఈ దోపిడీలను అరికట్టాలన్న ధృడనిశ్చయంతో తాము ఉన్నట్లు ఆయన తెలిపారు. ప్రజలకు పోలీసులపట్ల ఉన్న దురభిప్రాయాన్ని తొలగించి పోలీసులు ప్రజలలో ఒక అంతార్భాగమేనని తెలియజేయాలనే భావంతో ఉన్నట్లు ఆయన తెలిపారు.

శ్రీ మూర్తి కరీంనగర్‌లో పోలీసు శాఖలో పేరుకుపోయిన్న అవినీతికి కూడా అడ్డకట్ట వేయవలసిన అవసరంవుంది. శ్రీ మూర్తి వీటన్నింటిలో విజయం సాధించినట్లయితే ప్రజల మనుసులో చిరకాలం ఒక మంచి పోలీసు ఉన్నతాధికారిగా నిలిచిపోతారనడంలో సందేహంలేదు.

కరీంనగర్‌లో ఘంటసాల వర్ధంతి

కరీంనగర్, ఫిబ్రవరి 22: (నవవార్త) మధురగాయకులుస్వర్గీయ ఘంటసాల వెంకటేశ్వరరావు 16వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 11వ తేదిన స్థానిక కళాభారతిలో ఊర్వశికళా స్రవంతి కరీంనగర్, హన్మకొండ శాఖల సంయుక్త అధ్వర్యంలో 5వ సారి నిర్వహించిన రాష్ట్రస్థాయి సినిమా పాటలపోటీలు ఘనంగా జరిగాయి.

ఈ పాటల పోటీలలో పదిజిల్లాల నుండి 75 మంది గాయనీ, గాయకులు పాల్గొనగా, ప్రథమ బహుమతి 516 రూపాయల నగదు "ఘంటసాల స్మారక స్వర్ణపతకం" వై. జీవన్ (సిరిసిల్లా) గెల్చుకున్నారు.

ద్వితీయ బహుమతి 216 రూపాయల నగదు, ప్రశంసాపత్రం శ్రీ టి. మోహనస్వామి (కరీంనగర్), తృతీయ బహుమతి రు.116 నగదు, ప్రశంసాపత్రం శ్రీమతి పి. హేమలత (జగిత్యాలు) గెల్చుకున్నారు. శ్రీ పి. వెంకటస్వామి (హైదరాబాద్), శ్రీమతి సి.సావిత్రి (మంథని), కుమారి కె.మంజులాదేవి (కరీంనగర్), శ్రీ రాంబట్వార్ (వరంగల్), ఎస్. సాంబయ్య (కరీంనగర్), కన్సొలేషన్ బహుమతులను గెల్చుకున్నారు.

జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి 216 రూపాయల నగదు "ఘంటసాల స్మారక స్వర్ణపతకం" శ్రీ కె. మధు (కరీంనగర్), ద్వితీయ బహుమతి రూపాయలు 116 నగదు జూపూడి సుధారాణి (ఖమ్మం) గెలుపొందారు. శ్రీ పి. బాలాజీ (వరంగల్), శ్రీ జి. రమేశ్ (సుల్తానాబాద్), శ్రీ పి.రాజ్‌కుమార్ (మదనపల్లి), టి. శ్రీ విద్య (కరీంనగర్) కన్సొలేషన్ బహుమతులు గెల్చుకున్నారు.

ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా దూరదర్శన్, అల్ ఇండియారేడియో కళాకారులు శ్రీ సురేంద్ర, శ్రీ పి. వినయాదగిరి, కుమారి ఎ. రాజకుమారిలు వ్యవహరించగా, జిల్లా కలెక్టర్ సతీమణి శ్రీమతి ఐ.వి. రేఖసుబ్బారావు జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కుమారి జి. రాధిక వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి సంస్థ ప్రధాన కార్యదర్శి శ్రీ మంచె సత్యనారాయణ స్వాగతం పలుకగా, అధ్యక్షులు శ్రీ రవిచంద్ర వందన సమర్పణ చేశారు.

వినియోగదారులను ఏసిగిస్తున్న "పెట్రోల్ బంకులు"

మిర్యాలగూడ, ఫిబ్రవరి 22: మిర్యాలగూడ పట్టణంలో ప్రధానంగా మూడు పెట్రోల్ బంకులు వున్నప్పటికీ ఒక్క బంకులోకూడ పెట్రోలు దొరకక వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానికంగా పట్టణంలోని నడిబొడ్డులో వున్న రెండు పెట్రోల్ బంకులలో నెలలో ఒక్క రోజుకూడ పెట్రోలుపోసిన జాడ కనిపించడంలేదు. పట్టణంలోని వాహనదారులు తమకు పెట్రోలు కావలసినప్పుడు పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలోని ఈదులగూడెం పెట్రోలు బంకుని ఆశ్రయించవలసి వస్తోందని, పట్టణానికి చివరనగల బంకులో కూడ అప్పుడప్పుడు పెట్రోలు దొరకక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, సక్రమంగా పెట్రోలును సరఫరా చేయని పెట్రోలు బంకుల లైసెన్సు లనురద్దుచేసి ఉత్సాహవంతులైన వారికి ఇచ్చినట్లయితే బాగుంటుందని పట్టణ ప్రజలు అంటున్నారు. కాగా పెట్రోలు బంకు యజమానులు సంబంధిత అధికారులకు ఘుడువులు చెల్లిస్తూ తమ లైసెన్సులు రద్దుకాకుండా చూసుకుంటున్నారు. పెట్రోలు బంకుకు వుండవలసిన విస్తీర్ణస్థలం వీటికిలేక వాహనాలరాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఈ కారణంగా గతంలో కొన్ని యాక్సిడెంట్లుకూడా జరిగినాయని, అంతేకాకుండా పెట్రోలు బంకులకు జనరేటర్‌లేని కారణంగా కరెంటులేని సమయంలో మీటర్‌లో ఇనుపరాడ్‌పెట్టి త్రిప్పి తప్పుడు రీడింగ్ చూపెస్తున్నారని పెట్రోల్ వాడకందారులు ఆరోపేస్తున్నారు. ఈ పెట్రోలుబంకు విషయంలో ప్రభుత్వ అధికారులు తగిన చర్యలు తీసుకొని ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

శతావధాని 'అష్టావధానం'

రాజంపేట, ఫిబ్రవరి 22: కడపజిల్లా పులిపెండల తాలూకా వేముల ఉన్నతపాఠశాల వార్షికోత్సవం ఇటీవల జరిగింది. ఈ కార్యక్రమంలో 'అష్టావధాన' కార్యక్రమం నిర్వహించారు. పెనగలూరు తెలుగు పండితుడు, శతావధాని శ్రీ భూతపూరి బాలసుబ్బరాయుడు అష్టావధానం చేశారు. పృచ్చకులుగా పలువురు తెలుగు పండితులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీ సి.రామసుబ్బారెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

జనవిజ్ఞాన వేదికకార్యక్రమాలు

వనపర్తి, ఫిబ్రవరి 22:(నవవార్త) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటి జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న ఆరోగ్య వ్యవసాయ జాతా ఈనెల 24 న వనపర్తి పట్టణానికి చేరుకుంటుందని జిల్లా జన విజ్ఞానవేదిక కన్వీనర్ శ్రీ డాక్టర్ మురళీధర్ మంగళవారం నాడు జరిగిన విలేఖరుల సమావేశంలో తెలిపారు.

ఈ సమావేశానికి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, అడ్వకేట్ నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు.

ప్రజలకు విజ్ఞానం అందించేందుకు, మూఢనమ్మకాలను పోగొట్టేందుకు, ప్రజలలో శాస్త్రీయ ఆలోచనాధోరణిని పెంపొందిస్తూ, దేశ స్వావలంబనకు సమగ్రతలకు శాంతికి ప్రజల సర్వతోముఖాభివృద్ధికి సైన్స్ ఉపయోగపడాలనే లక్ష్యంతో జనవిజ్ఞాన వేదిక కమిటీలు చేస్తున్న కృషిలోభాగంగా జాతీయ దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 7 నుండి 28 తేదీ వరకు ఆరోగ్యం వ్యవసాయం అనే అంశాలపై జాతాజరుగుతుందని శ్రీ మురళీధర్ చెప్పారు.

20 మంది కళాకారులతో ఈ 'జాతా' 210 పట్టణాల ద్వారా ప్రయాణం చేస్తూ ప్రదర్శనలు ఇస్తున్నారని ఆయన తెలిపారు.

రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న మూడు జాతాలలో ఒక జాతా ఈ నెల 7 న చిత్తూరుజిల్లాలోని రేణిగుంట నుండి బయలుదేరి 23 వ తేదిన మహబూబ్‌నగర్ జిల్లాలోని రాజోలికి చేరుకుంటుందని ఆయన తెలిపారు. నాటకాలు, పాటలు, నృత్యగేయాలరూపంలో వ్యవసాయం, ఆరోగ్యం సమస్యల మీద ప్రదర్శన వుంటుందని శ్రీ మురళీధర్ తెలిపారు.

ఈ నెల 24 న వనపర్తిలో జరిగే కార్యక్రమాలలో ప్రదర్శనలు, బహిరంగ సభలు వుంటాయని, జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న ఈ శాస్త్ర కళాజాతాలకు నేషనల్ కౌన్సిల్ ఆఫ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, స్టేట్ సెంటర్ సంస్థలు తమ సహకారాన్ని అందిస్తున్నాయని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా కాలేజీ, ఉన్నతపాఠశాలల విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను స్థానిక జనవిజ్ఞానవేదికలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేస్తారని ఆయన వివరించారు. అన్ని పట్టణాల సందర్శానంతరం 28 న హైదరాబాద్‌లో జరిగే బహిరంగసభతో ముగుస్తుందని తెలిపారు.

చక్కెరవ్యాధి చికిత్సాశిబిరం

అనంతపురం, ఫిబ్రవరి 22: విజ్ఞానాన్ని పెంపొందించి రోగనిర్మూలన లక్ష్యంగా కృషిచేయడమే 'వైద్యమని' తిరుపతి డయాబెటిస్ పరిశోధన సంస్థ డైరెక్టర్ డా.వి.రఘుణ తెలిపారు. ఇటీవల అనంతపురం లయన్స్ క్లబ్ వారు ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించిన ఉచిత డయాబెటిస్ చికిత్సాశిబిరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో డా. వి.రమణ మాట్లాడారు. అతిమూత్రం, ఎక్కువ ఆకలి, బరువుతగ్గుట, నీరసం, శరీరంపై దురదలు, కీళ్ళనొప్పులు, చూపులో మార్పు, నపుంసకత్వం లాంటి ఇబ్బందులు డయాబెటిస్ యొక్క ముఖ్య లక్షణాలని శ్రీ రమణ తెలిపారు. ఈ వ్యాధి తగ్గుటకు ఆహార నియమం, వ్యాయామం, మందులు అవసరమని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్యవిధానపరిషత్ డిప్యూటీ కమీషనర్ డా. రామసుబ్బయ్య మాట్లాడుతూ భయంకరమైన ఈ వ్యాధిని నిరోధించాలని అందుకోసం లయన్స్‌క్లబ్ చేస్తున్న కృషిని ప్రశంసించారు.

ఈ సమావేశంలో జిల్లా ఆరోగ్యశాఖాధికారి డా. సి.సాంబశివరావు, మాజీ పార్లమెంట్‌సభ్యుడు శ్రీ రాజగోపాల్ నాయుడు, జిల్లాజడ్జి శ్రీ నారాయణరెడ్డి, లయన్స్‌క్లబ్ ప్రతినిధి శ్రీ పి.లక్ష్మీనారాయణరెడ్డి, మునిసిపల్ వైస్‌చైర్మన్ శ్రీ జి.వి.రామయ్యశెట్టి పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యుడు శ్రీ బి.నారాయణరెడ్డి ప్రారంభించగా, స్థానిక మునిసిపల్ చైర్మన్ శ్రీ ఎ.నారాయణరెడ్డి జ్యోతిని వెలిగించారు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సభకు లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ శ్రీ పి.ప్రకాశం గుప్తా అధ్యక్షత వహించగా, శ్రీ జి.నాగరాజు స్వాగతం పలికారు. శ్రీ గోవిందప్పశెట్టి వందన సమర్పణ గావించారు.

సినిమాథియేటర్ల కార్మికులసమస్యలు

మనరాష్ట్రంలో సినిమాపరిశ్రమ దిన దినాభివృద్ధి చెందుతూ వుంది. దేశం మొత్తంమీద ఎక్కువ థియేటర్లు కలిగివున్న రాష్ట్రం మనదే కావటం సంతోషించాల్సిన విషయమే!

సినిమా థియేటర్ల కార్మికుల సమస్యల్ని ఎవరూ పట్టించుకోకపోవటం బాధాకరమైన విషయం.

అతి తక్కువ వేతనాలు, నికృష్టమైన పని పరిస్థితులు, ఉద్యోగభద్రత లేకపోవటం ఇలాంటి సమస్యలతో వేలాది కార్మికులు అర్ధాకలితో దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు.

తమ కనీస వేతనాల సవరణ కోసం, కరువుభత్యం కోసం, ఉద్యోగభద్రత కోసం, సాంవత్సరిక ఇంక్రిమెంట్ కోసం, ప్రత్యేక సంక్షేమ పథకం కోసం అనంతపురం సినిమా ధియేటర్ల కార్మికులు ముఖ్యమంత్రికి,కలెక్టర్‌కి వినతిపత్రాలు సమర్పించారు.

మండలాలరద్దుకు టి.ఎన్.జి.ఒల సుముఖత

ఆదిలాబాద్, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో మండల వ్యవస్థను రద్దుచేసి తిరిగి తాలూకాలు ఏర్పాటు చేయాలని తెలంగాణా ఎన్.జి.ఒల కేంద్ర సంఘం అధ్యక్షుడు శ్రీ బి.స్వామినాథం ఇక్కడ విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా సింగిల్ విండో పద్ధతిని రద్దుచేసి పాత పద్ధతిని పునరుద్దరించాలని కూడ ఆయన సూచించారు. సహకార శాఖలు శాఖాపరమైన ఆడిటర్లను కాదని చార్టర్డ్ అకౌంటెంట్లతో ఆడిట్ చేయించే పద్ధతిలో రద్దుచేయించి ఆయన కోరారు.

శ్రీ ఎన్.టి.రామారావు నాయకత్వంలోని ఏడేళ్ళ తెలుగుదేశం పాలనలో ఎన్.జి.ఒలు, ఇతర ఉద్యోగులకు భద్రత లేకుండా పోయిందని ఆయన అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగుల విధి సానుభూతితో వ్యవహరిస్తున్నదని, భద్రత సమస్య లేదని ఆయన అన్నారు.

రాష్ట్రంలో తిరిగి గ్రామాధికార వ్యవస్థను పునరుద్ధరించాలని, ఉద్యోగులకు బోనస్ చెల్లించాలని, 53 రోజుల సమ్మె జీతం చెల్లించాలని, తాలూకా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయివరకు ఎన్.జి.ఒలకు గృహవసతి కల్పించాలని శ్రీ స్వామినాథం కోరారు.

రాష్ట్రంలోని వివిధ శాఖలలో ఒక లక్షా పదిహేనువేల ఉద్యోగాలు ఖాళీగా వున్నాయని, వాటిని భర్తీ చేసినట్లయితే నిరుద్యోగ యువకులకు ఉపాధి లభిస్తుందని శ్రీ స్వామినాథం తెలిపారు.

ఆరువేల రూపాయలకంటే ఎక్కువ సంవత్సరాదాయంగల ఉద్యోగులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వకూడదన్న ఆంక్షలు తొలగించాలని, ప్రమోషన్లు కల్పించాలని, 187 జి.ఒను ఉపసంహరించుకోవాలని శ్రీ స్వామినాథం ప్రభుత్వాన్ని కోరారు.

తెలంగాణా ఎన్.జి.ఒల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ.కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీ గులాంఆలీఅఫీజ్, కార్యదర్శి శ్రీ ఎల్.లింగారెడ్డి, జిల్లా శాఖ కార్యదర్శి శ్రీ పూర్ణచంద్రరావులు పత్రికా గోష్ఠిలో పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకోండి

మెదక్, ఫిబ్రవరి 22: కరెంట్‌కోత విషయంలో ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానానికి రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రతి సంవత్సరం రైతులకు రుణాలు మంజూరు చేసే బ్యాంకులు ఈ సంవత్సరం ఇంతవరకూ రుణాల మంజూరు విషయం పట్టించుకోలేదు. రుణాలు రద్దు విషయంలో ప్రభుత్వం స్పష్టమైన హామీని వెంటనే ఇవ్వాలి. గ్రామాల్లో రైతాంగానికి అప్పులు ఇచ్చే వడ్డీ వ్యాపారస్తుల్ని తీవ్రవాదులు మందలిస్తుండటంతో వారు అప్పులు ఇవ్వటానికి వెనుకాడుతున్నారు. కనీసం ఈ పరిస్థితుల్లో అయినా బ్యాంకులు వెంటనే రైతాంగానికి రుణాలు మంజూరు చేయవలసినదిగా రైతులు కోరుతున్నారు.

జిల్లాప్రజాపరిషత్ కార్యాలయం మహబూబ్‌నగర్

నెం.ఎ6/602/90(జి.పి.పె)

తేది: 16-2-1990

టెండరునోటీసు

ఈ దిగువ చూపబడిన కార్యాలయంనకు అవసరమున్న స్టేషనరీ సామానులు సరఫరా చేయుటకు టెండరు తేది 5-3-1990నాడు మధ్యాహ్నం 3.00 గంటలవరకు జిల్లా అభివృద్ధి అధికారి జిల్లా ప్రజాపరిషత్ మహబూబ్‌నగర్‌గారికి చేరునట్లు పంపుటకు కోరనైనది: అదేరోజున టెండర్లు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 3.30 గంటలకు జిల్లా అభివృద్ధి అధికారివారిచే తెరువబడును.

సదరు టెండరు షెడ్యూల్స్ మరియు నిబంధనలు 26-2-90 నుండి 4-3-90 తేదిలలో జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయ వేళలో నియమింపబడిన ఫీజు రు.20/- చెల్లించి పొందవలయును. ఏ కారణం చూపకనే అన్ని లేక కొన్ని టెండర్లు నిరాకరించుటకు జిల్లా అభివృద్ధి అధికారికి అధికారం కలదు.

(సం) జిల్లా అభివృద్ధి అధికారి,
జి.ప్ర.ప.మహబూబ్‌నగర్.

ఫిషరీసర్వేఆఫ్ఇండియా
జోనల్‌బేస్,ఫిషింగ్‌హార్బర్‌రోడ్
విశాఖపట్నం - 530 001

చేపలుపట్టే నాకలకు అవసరమైన యీ క్రింది సామగ్రిని సరఫరా చేయుటకు "Tender for the supply of Twines and ropes" అని స్పష్టంగా వ్రాయబడిన సీలు వేసిన టెండర్లు 14-3-1990నాడు మ.3 గం.లవరకు అందుకోబడి, అదే రోజు మ.3.30 గం.లకు తెరువబడును. (1) Nylon Rope: 32mm & 28mm (2) Braided Nylon Rope: 28mm (3) 8" Circumferance braided Poly Propelene Rope (4) Poly Propelene Rope of 6mm/8mm/12mm/14mm/18mm/24mm/28mm (5) Monofilament Twine:2mm (6) Nylon (Braided) Twine: 4mm.

1. రేటు కిలోగ్రాం ఒక్కంటికి తెలుపవలెను. 2. పేరుపొందిన తయారీదార్లకు ప్రాధాన్యత యివ్వబడును. 3. కొటేషన్‌తోపాటుగా సామగ్రి యొక్క నమూనా/టెస్ట్ సర్టిఫికేట్/సంగ్రహ వివరాలుగల కరపత్రం వగైరాలు పంపవలెను. 4. సరఫరాకు అవసరమైన కాలం మరియు కొటేషన్ చెల్లుబాటు కాలం మరియు ఏకమొత్తంగా సరఫరాకు వర్తించే ఏదైనా మినహాయింపు రేటు వుంటే ఆ వివరాలు తెలుపవలెను. 5. నమూనాలు లేకుండాను మరియు గడువు తేదీ మరియు సమయందాటిన తరువాత అందుకొనే కొటేషన్లు అంగీకరించబడవు. 6. బిల్లు అందుకొన్న తేదీనుండి 30 రోజుల కాలం క్రెడిట్ సౌకర్యం ఇవ్వవలెను. 7. డిజిఎస్ అండ్ డి, ఆర్/సినందు కొనసాగుతున్న పక్షంలో పై సామగ్రి విషయంలో దీని చెల్లుబాటుకాలాన్ని ఈ కొటేషన్లలో తెలుపవలెను. 8. ఏ కారణం తెలియజేయనవసరంలేకుండా ఏదైనా లేదా అన్ని కొటేషన్లను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు సీనియర్ ఫిషరీస్ సైంటిస్ట్ అధికారం కలిగివున్నారు.

davp 545(8)89

సవరణ

తేది.22-2-90నాడు ఈ దినపత్రికలో ప్రచురించబడిన డైరెక్టరేట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ వారి ప్రకటన 3వ పేరాలో 'ఉత్తర్వులులేని' అనే దానిని 'ఉత్తీర్ణులుకాని' అని చదువుకొనగోరడమైనది.

సి.పి.డబ్ల్యుడి, హైదరాబాద్
టెండర్లుకోరుతూనోటీసు

ఈ క్రింద తెలిపిన వాటిని సరఫరా చేయుటకై తయారుదార్లు నుండి ప్రతి అంశానికి విడివిడిగా సీలువేసిన ఐటం రేటు కొటేషన్లు భారత రాష్ట్రపతి తరపున ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) హెచ్.సిఇడి-1, సిపిడబ్ల్యుడి, నిర్మాణ్‌భవన్, సుల్తాన్‌బజార్, హైదరాబాద్ - 500 195చే కోరబడుచున్నవి.

1. One No. indoor type 500 KVA 11 KV/433V 3 ph 50 HZ copper wound, vector group 11 Delta Star, transformer confirming to IS 2026 as amended upto date upto 14-3-90

2. One No. indoor type 500 KVA capacity transformer of Dry type as per IS 11171 as amended upto date.

వివరమైన స్పెసిఫికేషన్లు మరియు నిబంధనలను వ్రాతమూలకంగా అభ్యర్థన పెట్టుకొని 5-3-90వరకు అన్ని పని రోజుల యందును ఈ కార్యాలయం నుండి ఉచితంగా పొందవచ్చును.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్
హైదరాబాద్ సెంట్రల్ ఎలక్ట్రికల్ డివిజన్ I సెంట్రల్ పి.డబ్ల్యు.డి, హైదరాబాద్.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
నమూనా -2ఏ

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరిచిన నిజామాబాద్ జిల్లా జుకల్ మండలం లింగంపల్లి గ్రామంలోవున్న భూమి ప్రజాహిత కార్యాలకు అంటే కౌలాస్‌నాల ప్రాజెక్టు రైట్ సైడ్ ఇర్ర్ డ్యాం నిమిత్తం అవసరమైనట్లు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావించినందున 1923 భూసేకరణ(సవరణ చట్టం) 1923లో 38 వ చట్టం ద్వారా సవరించిన విధంగా ఉండే 1894 భూసేకరణ చట్టంలోని 4వ విభాగపు (1) ఉపవిభాగంలోని నిబంధనల మేరకు ఆ విషయం గురించి అందుకు సంబంధించిన వారందరి ఎరుకనిమిత్తం ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గారు చట్టంలోని 4వ విభాగపు(2) వ ఉపవిభాగంద్వారా లభ్యమైన అధికారాలను వినియోగించేందుకు సహాయ కలెక్టరు, బోధన్‌కు, ఆయన సిబ్బందికి, పనివారికి ఇందుమూలంగా అధికారమిస్తున్నారు.

ఆ చట్టంలోని 17వ విభాగపు (4)వ ఉపవిభాగం క్రింద ఈ విషయంలో సత్వరమే చర్య తీసుకోవాల్సిన అవసరం ఉన్నదృష్ట్యా ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గారు చట్టంలోని 5-ఎ విభాగపు నిబంధనలు ఈ విషయానికి వర్తించరాదని ఇందుమూలంగా ఆదేశిస్తున్నారు.

షెడ్యూలు

జిల్లా:నిజామాబాద్ మండలం:జుక్కల్ గ్రామం:లింగంపల్లి

సర్వే నెం.	భూమి వివరం	పట్టాదారులేక అనుభదారు	విస్తీర్ణం	సాగు/భూమి
51/A	ఖుష్కి పట్టా	ప/అ:శంకర్‌పురి వ. హన్మంతపురి	8-17గుం.	సా.

సం/-(ఎస్.ఎన్.మహంతి)
ప్రభుత్వసంయుక్త కార్యదర్శి.

తెలుగు సమాచారం Ro.No.16-163/NZB/AD1/C1/90

బీరేంద్ర సింహాసనం క్రింద ప్రజాస్వామ్య భూకంపం

ప్రజాస్వామ్య వెల్లువలో కరడుగట్టిన కమ్యూనిస్ట్ ప్రభుత్వాలేకూలిపోయాయి. ఇప్పుడుగాలి రాజరికం కింద ఉన్న నేపాల్‌లో బలంగా వీచే సూచనలు కన్పిస్తున్నాయి. 43 ఏళ్ళ నేపాలీ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు కలిసి నిషేధం ఉన్నా రాజధాని ఖాట్మండులో ప్రదర్శన తలపెట్టాయి.

1960లో రాజరికంపై తిరుగుబాటు జరిగినప్పటి నుండి పార్టీలపై నిషేధం పెట్టారు. ఏడు కమ్యూనిస్ట్ వర్గాల కూటమి, ఇతర పార్టీలు ప్రజాస్వామ్య ఉద్యమానికి మద్దతు ప్రకటిస్తున్నాయి. మన దేశపు రాజకీయ పార్టీ కాంగ్రెస్ (ఐ), జనతాదళ్, ఉభయ కమ్యూనిస్ట్ పార్టీలు నేపాలి కాంగ్రెస్‌తో సమాలోచనలు జరిపాయి కూడా.

ఇదిలా ఉండగా, ప్రజాస్వామ్య ఉద్యమానికి వెరగని నేపాల్ (రాజరికం) ప్రభుత్వం దీనికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాలని ప్రయత్నిస్తోంది. ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ, ఉద్యమ నాయకులను విదేశీ దళాలుగా పేర్కొంటూ నేపాల్‌రాజు అనుకూలురు ర్యాలీలు జరిపారు. ఈ ఉద్యమం వెనుక ఇండియా హస్తం ఉందంటూ వారు ఆరోపించారు.

ఉద్యమం పొడలు కన్పించగానే ఇటీవల పలువురిని అరెస్ట్ చేశారు. దాదాపు నేపాలి కాంగ్రెస్ కార్యాచరణ కమిటీ వారందరిని అరెస్ట్ చేశారు. నిర్బంధించిన 2,500 నుండి 3,500 మంది వ్యక్తుల్లో కమ్యూనిస్టు నాయకులు శ్రీ సహనప్రధాన్, విష్ణుబహదూర్ మనందార్ కూడా ఉన్నారు. నిర్బంధిస్తారనే భయంతో వేలాది రాజకీయ కార్యకర్తలు అజ్ఞాతంలోకి వెళ్ళారు.

ప్రి.సెన్సార్‌షిప్ విధించిన తర్వాత 22 పత్రికల ప్రచురణ ఆగిపోయింది. పత్రికలయితే అత్యవసర పరిస్థితి అయినా ఎత్తాలని లేదా ప్రిసెన్సార్‌షిప్ తొలగించడమన్నా చేయాలని డిమాండు చేస్తున్నాయి. సెన్సార్‌షిప్ లేకుండా పత్రికలు ప్రచురణ ప్రారంభించవచ్చుని ప్రభుత్వం చెపుతోంది కాని జర్నలిస్టులు దీనిని నమ్మడం లేదు.

నెల్సన్ మండేలా విడుదల సందర్భంగా పోఖ్రా అనే చోట నేపాల్‌రాజు విడిదిచేసి ఉండగా విద్యార్థులు ప్రదర్శన జరిపారు. ప్రజాస్వామ్య ఉద్యమానికి, వీరి ప్రదర్శనకు సంబంధం లేకపోయినా వారిపై పాశవికంగా ప్రవర్తించారు. పోలీసులు విద్యార్థినులను హాస్టల్ గదుల నుండి బయటకు లాగి, లాఠీలతో బాదారు. 518 మందిని అరెస్ట్ చేసినట్లు స్థానిక జర్నలిస్టులు తెలిపారు. బిర్‌గంజ్‌లో కూడా ప్రజాస్వామ్యాన్ని కోరుతూ నిర్వహించిన ర్యాలీని మామూలు దుస్తుల్లో ఉన్న పోలీసులు చెల్లాచెదురు చేశారు.

పోలీసుల ద్వారా అణచివేత చర్యలకు పాల్పడడమేకాక ప్రభుత్వం గూండాలకు శిక్షణ ఇచ్చి, సైకిల్ చైన్‌లతో నేపాలి కాంగ్రెస్ శాంతియుతంగా ప్రదర్శన జరుపుతున్నా, సమావేశమవుతున్నా, వారిపై ఉసిగొలుపుతోంది. ప్రభుత్వం కనుక ఉద్యమాన్ని అణచివేయలేక పోతే పంచాయత్ విధానాన్ని రద్దుచేసి, బహుళ పార్టీ వ్యవస్థను పెట్టాలన్న డిమాండ్‌కు తలవంచాల్సి వస్తుంది.

నేపాలి కాంగ్రెస్ నాయకుడు శ్రీ గణేశ్‌మాన్‌సింగ్ ఒక పత్రికకు ఇంటర్వ్యూ ఇస్తూ, తమ పార్టీ ప్రజాస్వామ్యం నెలకొనడానికి మొదట ఏర్పాటుగా జాతీయ ప్రభుత్వం కావాలని అడుగుతోందని చెప్పారు. పార్టీలపై నిషేధాన్ని తొలగిస్తే కనుక రాజు ఒక ఒప్పందానికి రాగలడని పరిశీలకుల భావన. అయితే ఇది జరిగేపనిలా కన్పించడం లేదు. పంచాయితీ వ్యవస్థను రద్దు చేయాలని నేపాలి కాంగ్రెస్ గట్టిగా కోరుతోంది. 1960లో నిషేధానికి గురైన నేపాలి కాంగ్రెస్ ఆయుధాలను చేపట్టింది. 1976లో అది జాతీయ సామరస్యం కావాలనికోరింది. 1979లో పాకిస్తాన్‌లో భుట్టోను ఉరితీసినప్పుడు నేపాల్‌లో విద్యార్థి ఉద్యమం తలెత్తి దాదాపు రాజరికాన్ని కూలదోసేంతవరకు వెళ్ళింది. అప్పుడు రాజు బీరేంద్ర నేపాల్ రాజకీయ భవిష్యత్తుపై రిఫరెండం పెట్టి ఈ పరిస్థితి నుండి బయటపడ్డారు. రిఫరెండంలో పంచాయితీ వ్యవస్థకు 55 శాతం మద్దతు లభించగా, బహుళపార్టీ ప్రజాస్వామ్యం 45 శాతం అభిప్రాయంతో వీగిపోయింది. అయితే రిగ్గింగ్ వలన ఇలాంటి ఫలితం వచ్చింది.

తూర్పు యూరపులో నెలకొన్న పరిస్థితులు, ప్రపంచ వ్యాప్తంగా మానవహక్కుల పరిరక్షణకు జరుగుతున్న కృషి, నేపాల్ ఉద్యమానికి అనుకూల పరిస్థితులు కల్పిస్తాయని అక్కడ కమ్యూనిస్టు నాయకులు భావిస్తున్నారు. నేపాల్ ఎక్కువగా విదేశీ సహాయంపై ఆధారపడి ఉంది. ఇప్పటికే అక్కడ మానవ హక్కులకు గ్యారంటీ ఇస్తేనే సహాయపడతామని, ఆర్థిక సహాయం అందించే దేశాలు సూచించాయి.

ఎలక్ట్రానిక్ రంగం ప్రముఖ పాత్ర వహిస్తుండడంతో పత్రికంపై ఉన్న సెన్సార్‌షిప్ ప్రభావం నేపాల్‌లో అంతగాలేదు.

అక్కడ ఉద్యమం ప్రజాస్వామ్యం నెలకొనేవరకు సాగవచ్చు. నేపాలి కాంగ్రెస్‌లోని యువరక్తం, కమ్యూనిస్టులు ఈసారి లక్ష్యసాధనకు గట్టిగా పోరాడాలనే కృతనిశ్చయంతో ఉన్నారు.

'చెవిలో పువ్వు'లో రాజేంద్రప్రసాద్, సీత

ఫిబ్రవరి 23న "చెవిలో పువ్వు"

శ్రీ ఉషా ఆర్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై యువ నిర్మాత కె. అశోక్‌కుమార్, నవ దర్శకుడు ఇ.వి.వి. సత్యనారాయణ దర్శకత్వంలో నిర్మిస్తున్న "చెవిలో పువ్వు" చిత్రం కోసం రాజేంద్రప్రసాద్, సీతలపై మైసూర్ బృందావన్‌గార్డెన్స్, నంది హిల్స్, బెంగుళూర్-అశోక్ హోటల్‌లో రెండు పాటలు చిత్రీకరించడంతో షూటింగ్ పూర్తయింది. హైదరాబాద్ ప్రసాద్ లాబ్ డబ్బింగ్ థియేటర్‌లో డబ్బింగ్ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న 'చెవిలో పువ్వు'ను ఫిబ్రవరి 23న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

రాజేంద్రప్రసాద్, సీత, కోట శ్రీనివాసరావు, వేలు, శుభలేఖ సుధాకర్, బ్రహ్మానందం, మల్లికార్జునరావు, సంగీత దర్శకుడు చక్రవర్తి, ప్రముఖ రచయిత డి.వి. నరసరాజు, తనికెళ్ల భరణి, సాక్షి రంగారావు, బడి తాతాజీ, ధమ్, చిట్టిబాబు, సత్తిబాబు, కళ్లు చిదంబరం, చిడతల అప్పారావు, పొట్టిప్రసాద్, కల్పనారాయ్, రాజ్యలక్ష్మి, కోకిల, శ్రీలక్ష్మి, హేమ డబ్బింగ్ జానకి, వైశ్యా బ్యాంక్ బాల్డి నటించిన ఈ చిత్రానికి

సినిమా

మాటలు : తనికెళ్ల భరణి, సంగీతం : చక్రవర్తి, కెమెరా : ప్రతాప్, కళ : చంటి, కూర్పు : కృష్ణారెడ్డి, నృత్యాలు : తార, కో-డైరెక్టర్ : ఎమ్. పార్థసారధి, అసోసియేట్ : రామారావు, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ : పి. నాగేశ్వరరావు, నిర్మాత : కె. అశోక్‌కుమార్, కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం : ఇ.వి.వి. సత్యనారాయణ.

కమల్‌హాసన్, రాధిక

ఫిబ్రవరి 23న "మాఇంటి కృష్ణుడు"

పద్మశ్రీ కమల్‌హాసన్ కథానాయకుడిగా భవానీ- అమ్మ కంబైన్స్ పతాకంపై ఆర్. విజయకుమార్ నిర్మించిన "మా ఇంటి కృష్ణుడు" ఫిబ్రవరి 23న విడుదల అవుతుంది. కమల్‌హాసన్, రాధిక, కె.ఆర్. విజయ, సంగీత, రమ్యకృష్ణ, గౌండమణి, రవీందర్, చక్రవర్తి, మలేషియా వాసుదేవన్, మనోరమా, ఆంథోని, జయగణేష్, బేబి సుజాత నటించిన ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా, కథ: పంజు అరుణాచలం, రచన: రాజశ్రీ, కెమేరా: వినాయకం. నిర్మాత: ఆర్. విజయకుమార్. స్క్రీన్‌ప్లే- దర్శకత్వం: ఎస్.పి. ముత్తురామన్.

సంసారం ఒక చదరంగం, గురుశిష్యులు చిత్రాలకు దర్శకత్వం వహించిన ఎస్.పి. ముత్తురామన్ దర్శకత్వంలో తయారయిన మరో సెంటిమెంటల్ కామెడీ ఫ్యామిలీడ్రామా మా ఇంటి కృష్ణుడు.

-బి.ఎ.రాజు

భూములఅభివృద్ధికి "మాస్టర్‌ప్లాన్"

ఆదోని, ఫిబ్రవరి 22: ఆదోని డివిజన్‌లో షెడ్యూల్డు కులాల వారికిచ్చిన భూములు అభివృద్ధి చేయుటకుగాను ఒక మాస్టరుప్లాన్ రూపొందించడం జరిగిందని, ఆ పథకానికి సంబంధించిన పనులు 30నుంచి 40 శాతం పూర్తి అయినవని, మిగిలినది ఒకటి రెండు రోజులలో పూర్తిచేసి సమగ్రమైన నివేదికను ఈ నెల 15వ తేదీన సంబంధిత ఉన్నతాధికారులకు పంపడం జరిగిందని ఆదోని ఆర్డీవో శ్రీ ఎం.సుబ్బారెడ్డి విలేఖరుల సమావేశంలో అన్నారు.

గతంలో ఎస్.సి.లకు కేటాయించిన భూములు వారి స్వాధీనంలో వున్నవా లేవా, వాటికిగల సాగునీటి లభ్యత, భూగర్భ జలాలవెలికితీతకు ఏ అవకాశాలున్నాయో, నీటి వనరులు గల భూములు, అదనంగా నీటివనరులు సమకూర్చి ఆ భూములను అభివృద్ధి చేయుటకుగాను సర్వే జరుగుతోందని ఆయన అన్నారు. నీటివనరులు సమకూర్చుటకు, అసంపూర్ణంగా ఉన్న నీటి వనరుల అభివృద్ధి కూడ ఈ పథకంలో చేర్చడం జరిగిందని, అందుకుగాను ఏకఖండంగా ఉన్న 5 ఎకరాల భూములను, ముక్కలుముక్కలుగా అక్కడక్కడ వున్న 5 ఎకరాలలోపు భూములు ఎంపికచేసి, ఆ భూముల పరిస్థితి, పంటల వివరాలు, నీటివనరుల వివరాలు, అసంపూర్ణమైన నీటి వనరులను ఏర్పాటు చేయడం, కొత్త వనరులను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అందుకుగాను ఆంధ్రప్రదేశ్ ఎస్.సి.కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ వారి ఆర్థిక సహాయం కూడ లభిస్తుందని ఆర్డీవో శ్రీ సుబ్బారెడ్డి తెలిపారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యాన వివరాలు సేకరించుటకు మండల స్థాయిలో టీములను ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో తెలిపారు.

ఆదోని డివిజన్‌లోని 17 మండలాలలో 13 మండలాలయందు 859 ఎకరాల బంజరు భూములున్నాయని, వీటిని కేటాయించుటకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, అందుకుగాను నూతన అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు కావలసివుందని, ఆర్డీవో శ్రీ సుబ్బారెడ్డి తెలిపారు. నీటి అభివృద్ధికి బృహత్తర పథకం తయారు అవుతున్నట్లు ఆర్డీవో తెలిపారు. (కం)

ఎన్నికలతర్వాత పి.సి.సి. అధ్యక్షుని నియామకం

విశాఖపట్నం, ఫిబ్రవరి 22: ఎ.ఐ.సి.సి. అధ్యక్షుని నిర్ణయం మేరకు ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తరువాత పి.సి.సి. అధ్యక్షుని ఎన్నిక జరుగుతుందని ముఖ్యమంత్రి డా. మర్రి చెన్నారెడ్డి మంగళవారం సాయంత్రం విమానాశ్రయంలో విలేఖరులతో మాట్లాడుతూ చెప్పారు. ఒరిస్సా ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఆయన హైదరాబాదుకు తిరిగివెడుతూ కొద్దిసేపు విలేఖరులతో మాట్లాడారు.

శ్రీ చెన్నారెడ్డి 14 నియోజకవర్గాలలో ప్రచారం చేశారు. ఇక్కడ ప్రజలు పార్టీపై అపార ఆదరణ చూపారనీ, అన్నిచోట్ల కాంగ్రెస్ తప్పక గెలిచితీరుతుందని ఆయన చెప్పారు. ఇతర నియోజకవర్గాలలోకూడ కాంగ్రెస్‌కు అనుకూలపరిస్థితి ఉందని ఆయన అన్నారు.

బలిమేల ప్రాజెక్టు విషయంలో ఒరిస్సా ప్రభుత్వ సహకారం గురించి అధికారులతో చర్చించామని శ్రీ చెన్నారెడ్డి చెప్పారు. విజయనగరానికి చెందిన 971 ఎకరాలు జంజావతి ప్రాజెక్టుక్రింద మునిగి పోతుందని, ఈ నష్టపరిహారం విషయమై ఒరిస్సా ప్రభుత్వం చేస్తున్న విజ్ఞప్తుల మేరకు నష్టపరిహారం ఎంతయింది గణించవలసిందిగా కోరామని ముఖ్యమంత్రి అన్నారు.

తెలుగుగంగ గురించి కూడా ఈ ఎన్నికల తరువాత కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రులతో చర్చిస్తామని ఆయన తెలిపారు.

ఉద్యోగనియామకాలపైగల ఆంక్షలను తొలగించాలి

వనపర్తి, ఫిబ్రవరి 22: (నవవార్త) రాష్ట్రంలోని ఉద్యోగ ఖాళీల నియామకంపై విధించిన ఆంక్షలను తొలగించాలని పంచాయతీరాజ్ ప్రత్యేక ఉపాధ్యాయ సంఘ ప్రతినిధి శ్రీ వి.శ్రీకాంత్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ వయోపరిమితి దాటిపోతున్నదనే బాధతో నిరుద్యోగులు నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారని శ్రీ శ్రీకాంత్ ఆవేదన వ్యక్తపరిచారు.

అలాగే గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్పెషల్ టీచర్ల స్కీంలో పని చేస్తున్న ఉపాధ్యాయులందరిని రెగ్యులర్ చేస్తూ స్కేల్ వర్తింపజేయాలని ఆయన కోరారు.

స్పెషల్ టీచర్లు మూడు సంవత్సరాలు పనిచేయాలనే నిబంధనగల జి.ఒ. 68ని ప్రభుత్వం రద్దుచేయాలని, రిజర్వులిస్టులో వున్న అభ్యర్థులందరి పోస్టులను భర్తీ చేయాలని, వయోపరిమితి దాటిపోతున్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవాలని శ్రీ శ్రీకాంత్ కోరారు.

అలాగే తెలుగు పండితులు, హిందీ పండితులు, వ్యాయమ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని శ్రీ శ్రీకాంత్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. (కం)

సివిల్ సర్వీసులనాటకోత్సవాలు

కరీంనగర్, ఫిబ్రవరి 22:(నవవార్త) ఆంధ్రప్రదేశ్ సచివాలయ సాంస్కృతి కసంస్థ వారు నిర్వహించనున్న 'సివిల్ సర్వీసుల నాటకోత్సవాలు' ఫిబ్రవరి 28 నుండి మార్చి 4 వ తేది వరకు జరుపతలపెట్టిన "సాంస్కృతిక వారోత్సవాలలో" భాగంగా జరుగుతాయని సంస్థ కార్యదర్శి శ్రీ కె.వి సుకుమార్‌బాబు తెలిపారు. ఈ ఉత్సవాలలో జిల్లాలో పని చేయు ప్రభుత్వోద్యోగుల సాంస్కృతిక సంస్థలు పాల్గొనాలని ఆయన కోరారు.

వారం రోజులపాటు జరిగే ఈ సాంస్కృతిక వారోత్సవాలలో మొదటి రెండు రోజులు సెక్రటేరియట్‌లో పని చేసే వివిధ శాఖల మధ్య నాటకపోటీలు జరుగుతాయని, ఆ తర్వాత మూడురోజులు రాష్ట్రంలోని ఇతరజిల్లాల నుండి వచ్చిన నాటకాలకు కేటాయించబడిందని, బహుమతి ప్రదానోత్సవం మార్చి 4 వ తేదీన జరుగుతుందని ఆయన తెలిపారు.

ఈ ఉత్సవాలలో నాటకాలను ప్రదర్శించగోరే జిల్లాలో పనిచేయు ప్రభుత్వోద్యోగుల సాంస్కృతిక సంస్థలవారు దరఖాస్తుఫారాలకు, ఇతర వివరాలకు జిల్లా పౌర సంబంధాల అధికారిని సంప్రదించాలని ఆయన కోరారు. ఉత్సవాలలో పాల్గొనేందుకు వచ్చిన దరఖాస్తులలో ఒక నాటకాన్ని ఎంపికచేసి జిల్లా కలెక్టర్ ఆమోదముతో పోటీకి పంపబడుతుందని, ఈ పోటీలలో గెలిచిన వారికి షీల్డ్ బహూకరించబడుతుందని శ్రీ సుకుమార్ బాబు తెలిపారు.

వనపర్తి విలేఖరుల ఖండన

వనపర్తి, ఫిబ్రవరి 22: (నవవార్త) విలేఖరులు వార్తలు వక్రీకరించి వ్రాస్తున్నారని వనపర్తి ఎం.ఎల్.ఎ డాక్టర్ జి.చిన్నారెడ్డి కొత్తకోటలో చేసిన ప్రకటనను వనపర్తి విలేఖరులు ఖండించారు.

ఉన్న వాస్తవాలు వ్రాయడం విలేఖరులకు బాధ్యత అని అర్హతలు ప్రస్తావించడంపట్ల విలేఖరులు నిరసన వ్యక్తంచేశారు. అర్హతలు ముఖ్యంకాదని, విజ్ఞానం ముఖ్యమని శాసనసభ్యులు గ్రహించాలని వారు కోరారు. (కం)

పాన్‌గల్ పంచాయతీరాజ్ ఉపాధ్యాయకార్యవర్గం

మహబూబ్‌నగర్ జిల్లా పాన్‌గల్ మండలశాఖ పంచాయతీరాజ్ ఉపాధ్యాయసంఘం అధ్యక్షులుగా శ్రీ వి.రామమూర్తి, ఉపాధ్యక్షులుగా శ్రీ జె.ప్రభాకరచారి, కార్యదర్శిగా శ్రీ ఎస్.వేణాచారి, సంయుక్తకార్యదర్శిగా ఎం.రాఘవరెడ్డి, స్పెషల్ టీచర్ ప్రతినిధిగా శ్రీ వి. శ్రీకాంత్ ఎన్నికయ్యారు. (కం)

విజ్ఞానాభివృద్ధికే సైన్సు ప్రదర్శనలు

అనంతపురం, ఫిబ్రవరి 22: శాస్త్ర విజ్ఞానప్రదర్శనలు యువతీయువకులలో విజ్ఞానాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయని డాక్టర్ జె.బి.భట్టాచార్య అన్నారు. ఇటీవల అనంతపురంలోని శ్రీ సాయిబాబా నేషనల్ జూనియర్ కళాశాలలో దక్షిణరాష్ట్రశాస్త్ర విజ్ఞాన ప్రదర్శనకు శ్రీ భట్టాచార్య జ్యోతిని వెలిగించి ప్రారంభోత్సవం చేశారు.

ఆ సమావేశానికి అధ్యక్షత వహిస్తూ పాఠశాలల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీ వి. వెంకటరెడ్డి, మానవుని పురోగతికి ఉపయోగపడే విజ్ఞానశాస్త్ర పరిజ్ఞానాన్ని విద్యార్థులలో పెంచడం ఎంతైనా అవసరమని ఉద్బోధించారు.

జిల్లా కలెక్టర్, దక్షిణ రాష్ట్రాల శాస్త్ర విజ్ఞాన ప్రదర్శన ఛైర్మన్ శ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఏర్పాటు చేసే ప్రదర్శన మన జిల్లాలో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషదాయకమని అన్నారు.

శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీ వెంకటరెడ్డి ప్రసంగిస్తూ దేశంలో 60 శాతం పాఠశాలల్లో కనీసావసరాలు లేవని, ఏకోపాధ్యాయపాఠశాలలు 35 శాతం వున్నాయని, అందుకే దేశంలోని పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలని తెలియజేశారు.

బెంగుళూరు విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలాజికల్ మ్యూజియం డైరెక్టర్ శ్రీ జి.నాగరాజు ఉపన్యసిస్తూ, జాతీయ కౌన్సిల్ సైన్స్ మ్యూజియం రాష్ట్రంలో 60 పాఠశాలల్లో సైన్స్ మ్యూజియంలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు.

జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ నెల 15నుండి 19వరకు జరిగిన ఈ ప్రదర్శనలో దక్షిణాది రాష్ట్రాలనుంచి మొత్తం 150 పాఠశాలలు పాల్గొన్నాయని తెలియజేశారు.

సమావేశంలో సభ సభ్యుడు శ్రీ అనంతం వెంకటరెడ్డి, శ్రీ నర్సిరెడ్డిలు ప్రసంగించారు.

'బ్లాక్‌బోర్డ్' టీచర్లకు వేతనాలు

అనంతపురం, ఫిబ్రవరి 22: ఆపరేషన్ బ్లాక్‌బోర్డ్‌పథకం క్రింద 30 శాతం, 10 శాతం స్కీం ద్వారా పనిచేస్తున్న టీచర్లకు వేతనాలు ఇచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం నిధులు విడుదలచేసిందని, గత కొన్ని మాసాలుగా వేతనాలందని ఈ టీచర్లకు వేతనాలు ఇవ్వటం జరుగుతుందని, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయులసంఘం అనంతపురం శాఖ ఒకప్రకటనలో తెలియచేసింది.

అనంతపురంలో ప్రముఖ డాక్టర్ మృతి

అనంతపురం, ఫిబ్రవరి 22: అనంతపురంలో ప్రముఖ వైద్య నిపుణులు, డా. గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి గత శుక్రవారంనాడు మరణించారు. ఆయన వయస్సు 59 సంవత్సరాలు. ఆయనకు తల్లి, భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీ కృష్ణమూర్తి తన వైద్యసేవలో దాదాపు 44,226 కుటుంబనియంత్రణ శస్త్రచికిత్సలు చేసారు. 79 నేత్ర చికిత్సాశిబిరాలు నిర్వహించి ఎందరికో చూపుకల్గించారు. శ్రీ అవుల సాంబశివరావు 'నేత్రదాత' అనే బిరుదును శ్రీ రాధాకృష్ణమూర్తికి ప్రదానం చేసారు. శ్రీ శంకరానందగిరి స్వామివారు శ్రీ రాధాకృష్ణను 'అభినవ ధన్వంతరి' అని కొనియాడారు.

శ్రీ రాధాకృష్ణ రోటరీక్లబ్ గవర్నర్‌గా గోవా, కర్నాటక, మహారాష్ట్రలలోకూడా పెక్కు నేత్ర చికిత్స శిబిరాలు నిర్వహించారు. నేత్ర చికిత్సలపై, అనేక వ్యాసాలు, రేడియో ప్రసంగాలు చేసారు. (వి)

ఆకాశవాణి 23-2-1990 శుక్రవారం

హైదరాబాద్ 'ఎ'

ఉ. 5.55	వందేమాతరం, మంగళధ్వని, దేశభక్తి గేయం
6.10	భక్తిరంజని
7.15	ఉదయతరంగిణి
7.45	గాంధీమార్గం
11.40	చిత్రసీమ
మ. 12.15	కథాపఠనం
రా. 8.00	వయోజనవిద్య
8.15	అమరవాణి
11.10	వాతావరణసూచన

హైదరాబాద్ 'బి'

ఉ. 6.30	వందేమాతరం, మంగళధ్వని
7.15	ఆం.ప్ర.సార్వత్రిక విశ్వవిద్యాలయంపాఠాలు
7.45	యువవాణి-సంగీతం
8.00	యువవాణి(తెలుగు)
మ. 2.30	లడఖ్ జానపదసంగీతం
సా. 5.30	మేరీపసంద్
6.15	యువవాణి(ఇంగ్లీషు) సైన్స్‌డైజెస్ట్
6.45	ఎం.హరిప్రియ-వీణావాద్యం
7.45	ఆర్.విశాలాక్షి-గాత్రసంగీతం
రా. 9.30	రైల్వేసమాచారం, నయారంగ్-ఉర్దూకార్యక్రమాలు
11.00	వాతావరణసూచన

ఆకాశవాణి 24-2-1990 శనివారం

హైదరాబాద్ 'ఎ'

ఉ. 5.55	వందేమాతరం, మంగళధ్వని, దేశభక్తి గేయం
6.10	భక్తిరంజని
7.15	ఉదయతరంగిణి
7.45	ప్రసారతరంగిణి
11.40	ఉన్నతపాఠశాలలకు తెలుగుకార్యక్రమాలు
మ. 12.05	ప్రాథమికపాఠశాల ఉపాధ్యాయులకుఇంగ్లీషు కార్యక్రమాలు
1.30	సమత
2.10	మాధ్యమికపాఠశాల ఉపాధ్యాయులకుఇంగ్లీషుపాఠాలు
రా. 8.00	చిత్రసీమ
8.30	సైన్స్‌డే
9.30	జాతీయసంగీత కార్యక్రమం-టి.కె.మదురై నాదస్వరం
11.10	వాతావరణసూచన

హైదరాబాద్ 'బి'

ఉ. 6.30	వందేమాతరం, మంగళధ్వని
7.45	పి.సరోజినీదేవి జానపదగేయాలు
8.00	యువవాణి(తెలుగు)
8.25	యువవాణి(హిందీ)
సా. 6.45	ఇందిర వెన్నెటి-గాత్రసంగీతం
7.45	జి.మాల-వయోలిన్ వాద్యం
రా. 9.30	రైల్వేసమాచారం, నయారంగ్-ఉర్దూకార్యక్రమాలు
10.30	వాతావరణసూచన



నేపాల్ ఉద్యమంలో 32 మంది బలి

ఖాట్మండు, ఫిబ్రవరి 22: నేపాల్‌లో జరుగుతున్న ప్రజాస్వామ్య అనుకూల ప్రదర్శనల సందర్భంగా గత మూడు రోజుల్లో 32 మంది చనిపోయినట్లు అధికార వర్గాలు తెలుపుతుండగా 11 మంది మాత్రమే చనిపోయినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

తూర్పు నేపాల్, ధనుషలో పోలీసు కాల్పుల్లో ముగ్గురు చనిపోగా నిన్న చికిత్సలో ఉన్న ఒక వ్యక్తి చనిపోయినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రదర్శకుల గుంపుపై పోలీసులు జరిపిన కాల్పుల్లో వేరువేరు చోట్ల ఏడుగురు చనిపోయినట్లు అంతకు ముందు అధికార వర్గాలు ప్రకటించాయి.

కాగా భరత్‌పూర్‌లో ఏడుగురు, భక్తపూర్‌లో ఏడుగురు, పల్పాలో ముగ్గురు, కమినీఛూక్‌లో 9 మంది, ఇతర చోట్ల 7గురు గత మూడురోజుల్లో పోలీసు కాల్పుల్లో చనిపోయినట్లు అనధికార వర్గాలు తెలిపాయి.

భక్తపూర్‌లో పరిస్థితిని అదుపుచేయడానికి సైన్యాన్ని దించిన విషయాన్ని నేపాల్ ప్రభుత్వ ప్రధాన ప్రతినిధి తిరస్కరించినప్పటికీ అక్కడి ప్రజలు సైన్యం గస్తీని గమనించారు. భక్తపూర్ నగరంలో పోలీసు వాహనాలను నిరోధించేందుకు పెద్దపెద్ద దుంగలను ప్రజాస్వామ్య అనుకూల వాదులు అడ్డంగా పెట్టారు.

అమెరికా విచారం

నేపాల్‌లో ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమం సందర్భంగా హింసాయుత ఘటనలపట్ల అమెరికా విచారం వ్యక్తం చేసింది. ఉద్యమ కారులపై పోలీసు కాల్పుల గురించి అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మార్గరెట్ వ్యాఖ్యానిస్తూ శాంతి భద్రతల నిర్వహణలో అదనపు బలగాలను తగ్గించేందుకు తాము నేపాల్ ప్రభుత్వాన్ని ప్రోత్సహిస్తామన్నారు.

చలనచిత్రదర్శకుడు మైకేల్ పవెల్ మృతి

లండన్, ఫిబ్రవరి 22: సుమారు 50 చిత్రాలకు దర్శకత్వం వహించిన ప్రముఖ దర్శకుడు శ్రీ మైకేల్ పవెల్ మృతి చెందారని జాతీయ ప్రాచీన చలనచిత్రాల ప్రదర్శనవిభాగం తెలిపింది. ఆయన వయస్సు 84 ఏండ్లు. న్యూయార్కులో రెండు వారాలక్రితం జబ్బుపడ్డారు. 19 రాత్రి చనిపోయారు.

రిచర్డ్ అటెన్‌బరో ఆయన మృతికి విచారం తెలుపుతూ పవెల్ దర్శకత్వ ప్రతిభాసంపత్తిని కొనియాడారు.

కోడేకల్లుడీలర్ సస్పెన్షన్

ఆదోని, ఫిబ్రవరి 22: ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని కోడేకల్లు గ్రామం చౌక డిపో డీలరు గడ్డం తాయన్నను జనవరి 29న సస్పెండు చేసినట్లు ఆర్డీవో తెలిపారు. డిపోకు సంబంధించిన రిజిస్టర్లు సక్రమంగాలేవని, నిత్యావసర సరుకుల పంపిణీ సక్రమంగాలేదని, ఆ గ్రామంలో నివసించడం లేదని, తూనికలు-కొలతలయందు అక్రమాలు తదితర అవకతవకలకు పాల్పడినందులకు డీలర్‌ను సస్పెండు చేసినట్లు శ్రీ ఎం. సుబ్బారెడ్డి తెలిపారు.



నల్లజాతియూదులకు ఇజ్రాయిల్ వివక్ష

డిమోనా, ఫిబ్రవరి 22: ఇజ్రాయిల్ దేశంలో నల్లహెబ్రూ జాతి జనంలో ఆటలమ్మ (మెజిల్స్) వ్యాధి సోకి పసిబిడ్డ మరణిస్తే అది ఏ మాత్రం వార్త కాదు. కనీసం ముగ్గురు, నలుగురు మరణించటం కానీ, వాళ్ళ జీవితాలు పాడుకావటం కానీ జరిగితే, అప్పుడు సభ్యమానవ ఇజ్రాయిల్ సమాజం ఆ విషయాన్ని గుర్తిస్తుంది.

2వేల మంది హెబ్రూజాతి ప్రజలు చికాగో నగరం నుంచి 20 ఏళ్ళ క్రితం దుమ్ముతో, దూళితో నిండి వుండే డిమోనాకు తరలి వచ్చారు.

ఇజ్రాయిల్‌లో భక్తి విశ్వాసాలతో పడి వుంటామన్నా సరే ఇజ్రాయిల్ తిరస్కరిస్తోంది.

డిమోనాలో వీళ్ళు అమెరికా పద్ధతులతో కాకుండా సహజసిద్ధమైన, సాంప్రదాయకమైన జీవితాన్ని గడుపుతున్నారు.

తాము యూదు జాతికి చెందినవారని వీళ్ళు విశ్వసిస్తుంటారు. ఇజ్రాయిల్‌లో యూదుల మాదిరిగా తమకు పౌరసత్వం ఇవ్వమని వీళ్ళు కోరుతున్నారు.

అయితే ఇజ్రాయిల్ పాలకులు ఈ నల్ల హెబ్రూజాతి ప్రజల్ని యూదులుగా గుర్తించటానికి తిరస్కరిస్తున్నారు. ఇజ్రాయిల్‌లో వాళ్ళు విదేశీయుల మాదిరిగానే వుంటున్నారు. వాళ్ళకి ఎలాంటి హక్కులూ, ఆదాయాలూ లేవు.

ఈ హెబ్రూ జాతి ప్రజల సమస్యలు ఆర్థిక సమస్యలేకాదు. కనీసం వాళ్ళు పనిచేయటానికి కూడా అక్కడ చట్టపరమైన హక్కులు లేవు.

1988లో వీళ్ళు పనికోసం ప్రయత్నిస్తే అధికారులు వీళ్ళని పూర్తిగా నిర్లక్ష్యం చేయటమే గాకుండా 42మంది స్త్రీ, పురుషుల్ని అరెస్ట్ చేశారు.

అప్పుడు ప్రజల్ని చందాలు అడుక్కుంటూ రైతుల్ని పొలాల్లో తమకు పనులు చూపెట్టవలసినదిగా ప్రాధేయపడ్డామని ఈ జాతి నాయకుడు బెన్-అమీన్ జెటర్ చెప్పారు.

అయినా సరే, వాళ్లు పనికల్పించలేదు. మేము చాలా పేదవాళ్ళం. మా పిల్లలు పౌష్టికాహార లోపంతో తీవ్రంగా బాధపడుతున్నారని ప్రభుత్వాధికారులు కూడా అంగీకరించారు అని ఆయన చెప్పారు.

ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలతో కూడా వీళ్ళు బాధపడుతున్నారు. 5 సంవత్సరాల లోపు ప్రతి ముగ్గురు పిల్లలు ఆటలమ్మ వ్యాధితో మరణిస్తుండగా, 54 మంది పిల్లలు బీర్‌షెబ్‌లోని ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాలలో చేరుతున్నారు.

హెబ్రూ నల్లజాతి ప్రజలు వ్యాధినిరోధక టీకాలు తీసుకోకపోవడం, సహజసిద్ధమైన శాఖాహారం భుజించటం వ్యాధి పెరుగుదలకు కారణమని ఇజ్రాయిల్ ఆరోగ్య, సంక్షేమశాఖమంత్రి చెప్పారు.

రెండు సంవత్సరాల క్రితం వ్యాధి నిరోధక టీకాలు నల్లజాతి ప్రజలకు వేయటానికి మెడికల్ కమిటీ తీర్మానించింది.

నల్లజాతి ప్రజలు ఈ కార్యక్రమానికి డబ్బులు ఏమీ చెల్లించనవసరం లేదనీ, ఇవి ఏ మాత్రం ప్రమాదకరం కాదని కూడా కమిటీ చెప్పింది. అయితే పోయిన వారం వ్యాధి ప్రబలడంతో వ్యాధినిరోధక కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ జాతి ప్రజలకు ఆటమ్మ వ్యాధి ఒక్కటే కాదు సమస్య. ప్రభుత్వం వాళ్ళ సమస్యల్ని ఎన్నిటినో పరిష్కరించవలసివున్నది. ముందు పౌరసత్వం కల్పించాలి. పని చేసుకునే హక్కు కల్పించాలి. ఆరోగ్య సంబంధమైన ఇన్సూరెన్స్‌లను చెల్లించాలి. ఇంకా ఎన్నో సాంఘిక ఆదాయాల్ని కూడా కల్పించాలి.

యూదుల మాదిరిగా పౌరసత్వం కల్పించటానికి అధికార్లు భయపడుతున్నారు. ఎందుకంటే మిగతా ఇతర జాతులు కూడా యూదుల మాదిరిగా పౌరసత్వం కల్పించమని కోరతాయనీ, దేశంలో అందరూ అగ్రస్థానం కోసం ప్రయత్నిస్తారని అధికార్లు భయపడుతున్నారు.

హెబ్రూ నల్లజాతి ప్రజల్ని తిప్పి అమెరికా పంపించటం అంత తేలికకాదు. విదేశాలకు పోయి, వాళ్ళే స్వచ్ఛందంగా తమ పౌరసత్వాన్ని పోగొట్టుకున్నారు. తిరిగి వీళ్లకు పౌరసత్వం కల్పించటానికి అమెరికా అధికారులు కూడా అంత ఆసక్తి చూపెట్టటం లేదు.

జోరుగా సాగుతున్న 'జనతా' చీరెల వ్యాపారం

(ఆంధ్రపత్రిక ప్రతినిధి) హైదరాబాద్, ఫిబ్రవరి 22: ఆప్కో నిర్వహించిన జనతాచీరెల డిజైన్ పోటీలలో హైదరాబాద్‌కు చెందిన శ్రీ శ్రీనివాస్‌గోవింద్ డిజైన్‌కు పది వేల రూపాయల విలువచేసే ప్రథమ బహుమతి లభించింది.

కుమారి ఎన్.సుదీప్ (హైదరాబాద్), సత్రం కాళప్ప (నెల్లూరు), సి.రాజకుమార్ (హైదరాబాద్), జి.వి.ఈశ్వర్ (సికింద్రాబాద్), ఎ.పద్మావతి (సికింద్రాబాద్)కి రెండవ బహుమతులు లభించాయి. 18 మందికి కన్సొలేషన్ బహుమతులు లభించాయి.

ఆప్కో అధ్యక్షుడు శ్రీ రుమాండ్ల రామచంద్రయ్య గురువారంనాడు విలేఖరులకు ఈ సంగతి తెలిపారు. గత సంవత్సరం 19 కోట్ల రూపాయలకొరకు జనతా వస్త్రాలు వ్యాపారం జరిగిందని, ఈ సంవత్సరం రు.24 కోట్లకు పెరుగుతుందని ఆయన చెప్పారు. ఆప్కో గత ఏడు రు.75 కోట్ల వ్యాపారం చేయగా, ఈ సంవత్సరం రు.80 కోట్లకు పెరుగుతుందని ఆయన తెలిపారు.

ఉన్ని, జనతా, సిల్క్‌వస్త్రాల ఉత్పత్తిని మరింత సమన్వయపరిచి రాష్ట్రంలో చేనేత కార్మికులకు మరింత పని కల్పించేందుకు ఆప్కో కృషి చేస్తున్నదని ఆయన అన్నారు. ఇతర రాష్ట్రాలలో ఆప్కో వస్త్రాలను విక్రయించేందుకుగాను, యు.పి, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలలో విక్రయశాలలను పెట్టామని చెప్పారు.

హైదరాబాద్ అబిడ్స్‌లో మాదిరిగా మరో పది హాండ్‌లూం హవుస్‌లను నెలకొల్పాలని సంకల్పించామని వీటిలో మూడు హైదరాబాద్‌లోను, మిగతావి ఇతర ప్రాంతాలలోను ఏర్పాటవుతాయని ఆయన చెప్పారు.

జనతావస్త్రాల సేకరణ గురించి వివరిస్తూ 1988-89లో 26 లక్షల దోవతులను, 36 లక్షల చీరెలను సేకరించామని తెలిపారు. 89-90లో 22 లక్షల దోవతులు, 134 లక్షల చీరెలు సేకరించారని ఆయన చెప్పారు.

గత సంవత్సరం డిసెంబర్‌వరకు 28 లక్షల చీరెలను అమ్మారని, దోవతుల విషయానికి వస్తే సేకరించినవన్నీ విక్రయించారని చెప్పారు. 1990-91లో రు.100 కోట్ల వ్యాపారం చేయాలని ఆప్కో లక్ష్యంగా పెట్టుకున్నదని శ్రీ రామచంద్రయ్య తెలిపారు.

నేడే బ్రహ్మాండమైన విడుదల

గొప్ప హాస్యభరిత శృంగార చిత్రం

స్కైలైన్-70ఎంఎం 1-45, 4-00, 6-45, 9-45

లాంబా-70ఎంఎం 1-45, 3-45, 6-45, 9-45

శ్రీ రాజ్యలక్ష్మి-70ఎంఎం 1-45, 4-00, 6-45, 9-45

కమల్ 12-45, 4-15, 7-15, 10-15

ఫార్‌బిడెన్ డ్రీమ్స్

అడ్వాన్స్‌బుకింగ్ ఉ. 11గం.నుండి సా. 6గం. వరకు.

360 కోట్లతో విశాఖరేవువిస్తరణ

(ఆంధ్రపత్రిక ప్రత్యేకప్రతినిధి) విశాఖపట్నం, ఫిబ్రవరి 22: సుమారు మూడువందల అరవై కోట్ల రూపాయలఖర్చుతో విశాఖపట్నం ఓడరేవుని విస్తరించాలని ప్రభుత్వం సంకల్పించింది.

విశాఖపోర్ట్ మేనేజర్ శ్రీ డి.సి.హెచ్. తిరుపతిరాజు

విశాఖ ఓడరేవుని సందర్శించిన హైదరాబాద్ పత్రికా ప్రతినిధుల బృందంతో పోర్ట్ మేనేజర్ (ఆపరేషన్స్) శ్రీ డి.సి.హెచ్.తిరుపతిరాజు మాట్లాడుతూ పై విషయాన్ని తెలిపారు. 8వ ప్రణాళికలో 1990-95 సంవత్సరాలకుగాను పోర్టు అభివృద్ధి కార్యకలాపాలకోసం రు.359 కోట్ల 37 లక్షలను కేటాయించినట్లు శ్రీ తిరుపతిరాజు చెప్పారు. ఎనిమిదవ ప్రణాళికాకాలంలోనే పలురకాలయిన పనులకు వినియోగపడే విధంగా ఔటర్ హార్బర్‌లో 'బెర్తు'లను నిర్మిస్తామని ఆయనన్నారు.

పోర్టుకు చెందిన రైల్వే విధానాన్ని క్రమబద్ధీకరిస్తామనీ, దానిని అభివృద్ధిపరుస్తామని ఆయనంటూ సాధారణవస్తువులకోసం ఇన్నర్‌హార్బర్‌లో కూడ బెర్తుల నిర్మాణాన్ని చేపడతామని తెలిపారు.

ఎల్.పి.జి టాంకర్ల నిమిత్తం ఆఫ్‌షోర్ టాంకర్ టెర్మినల్ నిర్మాణాన్ని త్వరలోనే చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏడవ ప్రణాళికలో చేపట్టిన ఆయిల్ బెర్త్ నిర్మాణం, రెండు గోడవున్ల నిర్మాణం ప్రస్తుతం కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.



విశాఖరేవులో 'భీమా'నౌక

విశాఖ ఉక్కు కర్మాగారం అవసరాలను తీర్చేందుకు ఎన్.టి.పి.సి, రాష్ట్ర విద్యుత్ బోర్డు విద్యుదుత్పాదనా కేంద్రాలను నెలకొల్పితే, వాటి అవసరాలను తీర్చేందుకు గంగవరం పోర్టును ఏర్పాటు చేసే యోచనవుందని శ్రీ తిరుపతిరాజు చెప్పారు.

ఈ హార్బర్ నిర్మాణానికి కనీసం రు.500 కోట్లు అవసరమవుతుందని ఆయన చెప్పారు.

నేడేవిడుదల!ఉదయం ఆటతో ప్రారంభం!

నేటినుండి ఆదివారం వరకు రోజూ 4 ఆటలు



వెంకటేశ70ఎంఎం ఎ/సి (నారాయణగూడా) మీరాథియేటర్(ఖైరతాబాద్) 11-00, 2-00, 6-00, 9-00; మనోహర్ ఎ/సి, (సికిందరాబాద్) 11-45, 2-45, 6-45, 9-45; వెంకటాద్రి-70ఎంఎం ఎ/సి, (దిల్‌షుక్‌నగర్) 12-00, 3-00, 6-45, 9-45; రామయ్యచిత్రమందిర్ ఎ/సి, (వరంగల్) విజయ ఎ/సి, (హనుమకొండ) వినోదా (ఖమ్మం)

సోమవారం నుండి ఓడియన్70ఎంఎం ఎ/సి(హైదరాబాద్), ఉదయం 11.30 గం. రాఘవేంద్ర70ఎంఎం ఎ/సి,(మల్కాజ్‌గిరి) ఉదయం 11.30 గం.

నేడే విడుదల!ఉదయంఆటతోప్రారంభం!

నేటినుండి ఆదివారంవరకు రోజూ 4ఆటలు

గమనిక: ఈ చిత్రంలోని పాటను నేటి రాత్రి దూరదర్శన్ వారి చిత్రలహరి కార్యక్రమంలోచూసి ఆనందించండి.



సంధ్య-70ఎంఎం,చిక్కడపల్లి, రాజేశ్వర్(సికిందరాబాద్) 11.00 2.00 6.00 9.00

రాజధాని(దిల్‌షుక్‌నగర్) 11.45, 2.45, 6.45, 9.45, రాఘవేంద్ర (మల్కాజ్‌గిరి)11.00, 2.00, 6.00, 9.00, శోభన(బాలానగర్) 11.00, 2.00, 6.00, 9.00 శ్రీదేవి (చిలకలగూడ),11.45, 2.45, 6.45, 9.45, శాంతి(నారాయణగూడ) ఉ. 10.45,

అమరావతి (అకిడికాపూల్),ఉ.11.45, జ్యోతి(రామచంద్రాపురం) 12.15, 3.15, 7.00, 10.00, కాకతీయ-70ఎంఎం (వరంగల్), అశోక్(హనుమకొండ), రాఘవ (ఖమ్మం), అలంకార్(కర్నూలు), రాజరాజేశ్వరి(బళ్ళారి)

—సురేష్ మూవీస్

శిక్ష నిలిపివేత

షార్జా, ఫిబ్రవరి 22: ప్రముఖ నటుడు ఆల్‌రిడాకు విధించిన శిక్షను కువైట్ కోర్టు 6 నెలలపాటు నిలిపివేసింది. ఇస్లామ్‌ను అవమానపరిచాడనే నేరంపై ఆల్‌రిడాను కోర్టులో హాజరుపరిచారు.

అయితే జామీనుకుగాను ఆల్‌రిడా 5 వేల దీనార్లు (10 వేల డాలర్లు) చెల్లించడమే కాకుండా 3 సంవత్సరాలదాకా చాలా జాగ్రత్తగా ప్రవర్తించుకుంటానని హామీ ఇవ్వాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

శివరాత్రిఉత్సవం

హైదరాబాద్,ఫిబ్రవరి 22: ఆంధ్రసారస్వతపరిషత్ హాలులో ఆంధ్రప్రదేశ్ షిర్డి సాయిబాబా సేవా సమితి అధ్వర్యాన శివరాత్రి ఉత్సవం, భజన కార్యక్రమాలు 23 రాత్రి 8 గంటలకు జరుగుతాయి. న్యాయమూర్తి శ్రీ సి.శ్రీరాములు, దేవాదాయశాఖ అధికారులు, ఎం.ఎల్.లు పాల్గొంటారు.

జనాభాఉధృతితో భూమాతకుభారం

హైదరాబాద్, ఫిబ్రవరి 22: చరిత్రలోనే అత్యధిక జనాభారేటును ఈ దశాబ్దంలో చూడబోతున్నామని ఐక్యరాజ్యసమితి అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వున్న 525 కోట్ల జనాభాకు మరో 100 కోట్ల జనాభా 1990లలో చేర్చుతోందని వారు అంచనా వేశారు. ఇది ప్రస్తుత చైనా జనాభాతో సమానం.

ఆసియా ప్రెస్ ఫౌండేషన్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఐక్యరాజ్యసమితి జనాభానిధి డైరెక్టర్ శ్రీమతి నఫీస్‌సాదిక్ ఈ విధంగా అంచనా వేశారు. 'చరిత్రలో గత దశాబ్దంలోనూ లేనంతగా ఈ దశాబ్దంలో జనాభా పెరుగుదల రేటును మనం చూడబోతున్నాం' అని ఆమె అన్నారు. 'ప్రస్తుతం 5.25 బిలియన్‌లు వున్న జనాభాకు ప్రతి క్షణం మరో ముగ్గురు తోడవుతున్నారు. అంటే రోజు 2.5 లక్షలుగా పరిగణించవచ్చు' అని నఫీస్‌సాదిక్ వివరించారు.

1990లోనే 9 కోట్ల నుండి 10 కోట్ల మంది అదనంగా జోడవుతారు. ఇది ప్రస్తుత ఫిలిప్పైన్స్, దక్షిణ కొరియాల ఉమ్మడి జనాభాతో సమానం. కొత్తగా జన్మించే జనాభా అవసరాలను తీర్చలేని పేదదేశాలలోనే జనాభా పెరుగుదల అధికంగా వుంటుందని సమితి అధికారి పేర్కొన్నారు.

1984నుండి జనాభా పెరుగుదల రేటులో తగ్గుదల కనబడినప్పటికీ అది సరిపోదని ఆమె అన్నారు. జననాల రేటు తగ్గించడంలో జరుగుతున్న కృషి, ఫలితాలు ఆశించిన వాటికన్న తక్కువగా వున్నాయని ఆమె అన్నారు. ఈ పరిస్థితి మారకపోతే వచ్చే దశాబ్దం అంతంనాటికి ప్రపంచ జనాభా 14 వందలకోట్లకు చేరుకోగలదని ఆమె హెచ్చరించారు.

ఈ విధమైన పెరుగుదల సమతుల్యంగాసాగే అభివృద్ధికి అడ్డుకట్ట కాగలదని ఆమె అన్నారు. పల్లె ప్రాంతాలలో భూస్వాములు కుటుంబ జనాభా పెరుగుదలవల్ల రోజురోజుకూ పేదవారైపోతున్నారని ఆమె చెప్పారు. పెట్టుబడుల, సేవలనిధులను ఈ అధిక జనాభా హరించివేస్తోందని శ్రీమతి సాదిక్ తెలిపారు. జనాభా పెరుగుదల పర్యావరణాన్ని, ఆహార సరఫరాలను కూడ దెబ్బతీస్తుందని ఆమె హెచ్చరించారు.

జనాభా పెరుగుదల నరికట్టడం మూడవ ప్రపంచ దేశాలకు అభివృద్ధిలో భాగమేనని ఆమె చెప్పారు. జనాభా నియంత్రణ పద్ధతులు సక్రమంగా పాటించకుండా దేశాలను పారిశ్రామికీకరణ చేయడంవల్ల ఏమాత్రం ప్రయోజనం వుండదని ఆమె స్పష్టం చేశారు.

నేడేవిడుదల! ఉదయంఆటతో ప్రారంభం!

నేటినుండి ఆదివారం వరకు రోజూ4 ఆటలు

ఓడియన్-70ఎంఎం ఎ/సి, హైదరాబాద్ 10-45, 2-00, 6-00, 9-00; అంజలిసికింద్రాబాద్, శ్రీ ద్వారకామయి ఎ/సి, మల్కాజ్‌గిరి, శాంతిథియేటర్ ఎ/సి, హెచ్.ఎం.టి. రోడ్ 11-00,2-00, 6-00, 9-00; మీరాడీలక్స్ ఎ/సి, ఖైరతాబాద్ 11-15, 2-00, 6-00, 9-00; కోణార్క్-70ఎంఎం ఎ/సి, (దిల్‌షుక్‌నగర్) 11-30, 2-45, 6-45, 9-30; సురేష్-70ఎంఎం ఎ/సి, (సీతాఫల్‌మండి) సత్యం-70ఎంఎం ఎ/సి, (అమీర్‌పేట) 11-45, 2-45, 6-45, 9-30; నవరంగ్ ఎ/సి, (జాంబాగ్) 12-00, 2-45, 6-45, 9-45; సంపూర్ణ-70ఎంఎం ఎ/సి, (వనస్థలిపురం) 12-15, 3-15, 7-15, 10-00; పరమేశ్వరి-35ఎంఎం ఎ/సి, (కాచిగూడ) ఉ. 10-45 గంటలకు, గీత ఎ/సి,(రామచంద్రాపురం) రోజూ 4 ఆటలు జెమిని ఎ/సి,(వరంగల్); వెంకట్రామ ఎ/సి,(వరంగల్), శ్రీదేవి ఎ/సి,(హనుమకొండ); అశోక్ ఎ/సి, (నిజామాబాద్);విజయ ఎ/సి, (నిజామాబాద్); వెంకటసాయి70ఎంఎం ఎ/సి, (కరీంనగర్); సత్యం70ఎంఎం (ఖమ్మం); కిన్నెరసాని ఎ/సి, (ఖమ్మం). నటరాజ్ కరీంనగర్(ఉ. ఆటలు)

—గోపీకృష్ణ కంబైన్స్

యూదుల వలస-ఇజ్రాయిల్‌కు బెడద

టెల్‌అవివ్, ఫిబ్రవరి 22: ఇజ్రాయిల్‌కు సోవియట్ యూనియన్ నుండి యూదులు పెద్దపెట్టున వలస రావడం అంతర్జాతీయంగా వివాదానికి దారితీస్తోంది. లికిడ్ పార్టీ ఆధ్వర్యంలోని యూదు ప్రభుత్వం వెస్ట్ బ్యాంక్ ప్రాంతంలో జనాభాలో యూదుల శాతం పెంచడానికి సోవియట్ యూదులను వాడుకుంటుందని భయపడుతున్నారు.

మూకుమ్మడి వలస 'పెద్ద ఇజ్రాయిల్'ను తప్పనిసరి చేస్తోందని ఇజ్రాయిల్ ప్రధాని ఇజాక్ షమీర్ గతంలో ప్రకటించడం వివాదానికి మరింత కారణమవుతుంది. అయితే ఆయన సహాయకులు పత్రికలు తప్పుగా వ్రాశాయని అంటున్నారు. వెస్ట్ బ్యాంకును సోవియట్ యూదుల వలసను ప్రభుత్వం ప్రోత్సహించడంలేదని వారు స్పష్టం చేశారు.

తలెత్తిన వివాదం కారణంగా ఈ అంశంపై తాను ఇచ్చిన స్వేచ్ఛను గురించి సోవియట్ యూనియన్ పునరాలోచనలో పడింది. ఇది అమలుకు వచ్చినట్లు పలువురు భావిస్తున్నారు. యూదులు ఇజ్రాయిల్‌కు వెళ్లడానికి సోవియట్ యూనియన్ ఇంతకుముందు మాస్కోనుండి టెల్‌అవివ్‌కు విమానాలు నడిపింది. పి.ఎల్.ఒతో పాటు వివిధ అరబ్ దేశాలు సోవియట్ యూదులవలసపట్ల నిరసన తెలపడంతో ఇజ్రాయిల్‌కు సరాసరి విమానాలు నడపడం నిలిపివేసింది.

అయితే అక్కడ నుండి యూదులు వలసరావడం యథాస్థాయిలోసాగుతోందని ఇజ్రాయిల్ కన్సర్వేటివ్‌లు చెబుతున్నారు. ఈ సంవత్సరం లక్షమంది యూదులు అక్కడనుండి ఇజ్రాయిల్‌కు వస్తారని అంచనా. వీరే ఇజ్రాయిల్ భవిష్యత్తుకు మూలకారకులవుతారని అధికారులు అంటున్నారు.



ఉ.	7.00	ఉదయంప్రసారాలు
	9.00	టెలిస్కూల్
మ.	12:45, 4.00	ఉన్నతవిద్యా కార్యక్రమాలు
	1.45	మధ్యాహ్నప్రసారాలు
సా.	5.30	పాశ్చాత్యసంగీతం
	6.00	లలితసంగీతం
	6.30	దులిప్‌ట్రోఫీ ఫైనల్స్
	6.45	వ్యవసాయదారుల కార్యక్రమం
	7.00	ప్రకటనకార్యక్రమం
	7.30	వార్తలు
	7.45	సుమాంజలి
	7.55	చిత్రలహరి
	8.40	సమాచార్
	9.00	కబ్ తక్‌పుకారూ (హిందీసీరియల్)
	9.30	దిన్యూస్
	9.50	దివరల్డ్‌దిస్‌వీక్
	10.35	ఇండియాన్యూజిలాండ్‌క్రికెట్
	11.10	హాకీవరల్డ్‌కప్‌హైలైట్స్
	11.40	ఫీచర్‌ఫిలిమ్

'ఆ చిరునవ్వు కలకాలం ఉంటుంది'

అవాంఛిత గర్భం వస్తుందేమోనన్న భయం పోయిన రోజు నుంచీ ఆమెలో ఆనందోత్సాహాలు పెల్లుబికాయి. తమ కుటుంబాన్ని పరిమితం చేసుకోవడానికి ప్రపంచమంతటా ఆరున్నర కోట్ల కంటె ఎక్కువ మంది స్త్రీలు గర్భ నిరోధక మాత్రలను వాడుతున్నారు. వారి వలెనే ఆమె కూడా తక్కువ మోతాదులో ఉన్న క్రొత్త మాత్ర మాలా-డి ని తీసుకోవటం మొదలు పెట్టింది.

భారత దేశ స్త్రీలకు ఎంతో అనుకూలమైనవి ఈ మాత్రలు. మొదటి బిడ్డను త్వరగా పొందకుండా ఉండటానికి రెండవ బిడ్డ మధ్య ఎడాన్ని ఎక్కువగా ఉండేటట్లు చూడటానికి తెలివిగల స్త్రీలు గర్భ నిరోధక మాత్రలను తీసుకుంటారు

కీళ్ల నొప్పులు మున్నగు రోగాలు, అస్థానిక గర్భ ధారణ. చర్మ కేన్సరు. అండాశయంలో కేన్సరు. రొమ్ములలో రుగ్మత మొదలైన అనేక రోగాల ప్రమాదాన్ని మాలా-డిని ఉపయోగించటం ద్వారా తగ్గించవచ్చును

డాక్టరుని సంప్రదిస్తే

మాలా-డి ని

సిఫారసు చేస్తారు.



పిల్లల మధ్య ఎడాన్ని ఉంచడానికి సురక్షితమైన. తేలికైన. నమ్మకమైన పద్ధతి. క్రొత్త గర్భ నిరోధక మాత్ర సబ్సిడీ ధరపై ప్యాకెట్టు రూ 2 లు.

davp 89/692 TEL